సంపుటి : 3
సంచిక : 6
పుటలు :52
రు. 20/-లు
తెనాలి


1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2017



గిడుగురామమూర్తి 154 వ జయంతి

తెలుగుభాషాదినోత్సవం-ఆగస్టు 29

రెండేళ్ళుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు గిడుగు సాక్షిగా అధికారిక ఉత్సవాల్లో చేసిన వాగ్దానాలు, ప్రకటనలు అన్నీ కల్లలే అని తేలిపోయింది. తెలుగుకోసం చేసినదేమీ లేకపోగా అన్నిరంగాలలో తెలుగును దుంపనాశనంచేసే చర్యలకే తెలుగుదేశం ప్రభుత్వం పాల్పడుతున్నది. మరి, ఈ ఏడాది ఏం చెప్పబోతున్నారు?

ఇంటర్‌నెట్‌లో భారతీయభాషల ముందంజ

తూర్పు ఆసియా దేశాల అభివృద్ధికి బోధనామాధ్యమంగా మాతృభాషలే కీలకం



భాషోద్యమ కలు - ఒకటి

ఏడాది గడచినా ప్రాధికారసంఘం ఏర్పాటు కాలేదు. ఇదే తుది విన్నపం. ఇక పోరాటమే...

జాతిమనుగడకే సవాలుగా మారిన భాషాసమస్య రాజకీయ అంశం కాదా ?

"మనపాలకులే తెలుగుకు శత్రువులు. తెలుగువారంతా ఒక్కటై తెలుగును రక్షించుకోవాలి"

ఉత్తర అమెరికా తెలుగుసంఘం(చికాగో), డిట్రాయిట్ తెలుగుక్లబ్ సభల్లో డా॥సామల రమేష్‌బాబు పిలుపు

చికాగోలో జులై 1న నాట్స్ NATS ప్రధాన వేదికపై తెలుగు పరిరక్షణ అంశంపై జరిగిన సభకు డా॥యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధ్యక్షత వహించారు. కథారచయిత నామిని సుబ్రహ్మణ్యంనాయుడు, తెలుగుభాషోద్యమసమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు, ప్రముఖకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సమావేశకర్త డా॥ వేములపల్లి రాఘవేంద్రచౌదరి పాల్గొన్నారు. జులై 9న డిట్రాయిట్‌లో జరిగిన తెలుగు పరిరక్షణ సభలో జొన్నవిత్తుల, స్థానిక రచయిత అరె సీతారామయ్య, డా॥సామల, డా॥రాఘవేంద్రచౌదరి, కథారచయిత, సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ పాల్గొన్నారు.









తెలుగువాణి తరగతుల ముగింపుసభల్లో పాల్గొన్న మలేసియాసంఘం ప్రతినిధులు

తమిళనాట జరుగుతున్న తెలుగువాణి ముగింపు వేడుకలలో మలేసియా నుంచి వచ్చిన ప్రతినిధులు శ్రీ వెలగా అప్పల్నాయుడు, వారి సతీమణి శ్రీమతి విజయలక్ష్మి, జులై 23, 24, 25 తేదీలలో పాల్గొన్నారు. తెలుగువాణి ట్రస్టీలు డా॥సామల రమేష్‌బాబు, స.వెం.రమేశ్, ఉడుములపేటకు చెందిన 'మాతెలుగు' కార్యకర్తలు వసంత్, సెంథిల్, జవహర్ మొదలగువారితో కలిసి వారు అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందులో–ఒకనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదురించి బలియైన తెలుగువీరుడు వీరపాండ్య కట్టబ్రహ్మన్న (గట్టిబొమ్మ) వంశీకులను కలుసుకున్న చిత్రం(మొదటిది). రెండవచిత్రం: బ్రిటీష్‌వారిని ఎదిరించి బలియైన మరొక తెలుగువీరుడు ఎద్దులప్పనాయుడు సమాధిని దర్శించిన సందర్భం.





వివరాలు 9,10,11పేజీలలో


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...
◆ తెలుగుభాషోద్యమ నిర్మాణంకోసం...
◆ ఆంధ్ర,తెలంగాణల్లో, ఇతరరాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఆగస్టు 2017

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచన లను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

లోపలి పుటలలో....

చిత్రాలు : **రేఖా చిదంబరం**   కార్టూన్లు : **సరసి, శేఖర్**

కంప్యూటరీకరణ : **సోమయాజులు**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* , e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	**రూ.5000**	**రూ.7500**	--
5 సం॥	:	**రూ.1000**	**రూ.1500**	**150 డాలర్లు**
3 సం॥	:	**రూ. 700**	**రూ.1000**	**75 డాలర్లు**
1 సం॥	:	**రూ. 240**	**రూ. 400**	**25 డాలర్లు**

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అకౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

తెలుగుజాతి (ట్రస్టు)

నడుస్తున్న చరిత్ర ప్రోత్సాహంతో 2000సం॥నుండి ఆంధ్రప్రదేశ్ లోని, పొరుగు రాష్ట్రాల్లోని తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగుభాషోద్యమ నిర్మాణానికి ఎంతో కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించు కొనివున్న తెలుగు జాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావ సమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపివేయవలసి వచ్చింది. కొద్ది విరామం తరువాత మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' ట్రస్టును స్థాపించాము. (92/2014).

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. తొలుత స.వెం. రమేశ్ వ్యాసాల సంకలనం **ఎల్లలు లేని తెలుగు**ను విడుదల చేశాము. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారి రచనలు **ద్రావిడ-మంగోలు భాషల జన్యుసంబంధం ('తెలుగు' పుట్టుపూర్వోత్తరాలు)** అనే పరిశోధనా గ్రంథాన్ని, **తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభం** పైనా, చేపట్టవలసిన **భాషావిధానం**పైనా మరి రెండు పుస్తకాలను త్వరలో వెలువరించనున్నాము.

ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.

రాజ పోషకులు రు.1,00,000/-	పోషకులు రు.25,000/-
విశిష్ట పోషకులు రు.50,000/-	ప్రోత్సాహకులు రు.10,000/-

దాత ఫోటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము. దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి. అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068. లేదా- అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టు పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244



చేసిన వాగ్దానాల్ని నెరవేర్చండి

ముఖ్యమంత్రిగారికి ఇదే తుది విన్నపం.

ఇక పోరాటమే...



గిడుగు 154 వ జయంతి - తెలుగు భాషాదినోత్సవం

ఉద్యమకారులకు పిలుపు

ఇరవై యేళ్లుగా ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న తెలుగు భాషోద్యమానికి గిడుగు స్ఫూర్తికేంద్రం. తొలినుండీ ప్రత్యేక అంశాలపై తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమాలకు, పోరుబాటకు గిడుగు పుట్టినరోజే కీలకమైంది. ప్రత్యేక మంత్రిత్వశాఖను సాధించిందీ, తర్వాత తెలుగు అభివృద్ధి సాధికార సంఘం ఏర్పాటుకు ఒప్పించి సిఫారసులకై కమిటీని 2016లో సాధించిందీ తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమంతోనే. ఒకటి రెండు నెలల్లో పూర్తి కావలసిన పని ఏడాది అవుతున్నా ఇంకా కాలేదు. మే నెలలో కమిటీ నివేదికను ఇచ్చినా ముఖ్యమంత్రిగారు దానిని ఆమోదించకుండా పక్కన పెట్టేశారు.

మళ్లీ ఆగస్టు 29 వచ్చేస్తోంది. ఈలోపుగానే దానిని పూర్తిగా, ఎటువంటి మార్పులు లేకుండా ఆమోదించినట్లు ప్రభుత్వంనుండి అధికార ప్రకటన రావాలి. ఆమేరకు వెంటనే సమగ్ర చట్టాన్ని తెస్తామని కూడా ప్రకటన రావాలి. లేనట్లయితే 29 నుంచి గిడుగు స్ఫూర్తిగా మళ్లీ మనం పోరుబాట పట్టాలి.

ఇందుకోసం-27న కీలకమైన సమావేశం ఉంటుంది.

స్థలం, సమయం వివరాలను త్వరలో ప్రకటిస్తాము.

ఈ సమావేశానికి రాదలుచుకున్నవారందరికీ ఇదే ఆహ్వానం. అన్ని భాషోద్యమ సంఘాలకు, సాంస్కృతిక సంస్థలకు ఇదే పిలుపు. మీ అందరి సహకారంతోనే, కలయికతోనే ఈ కార్యక్రమం సాగుతుంది. 27న సమావేశానికి మీ ప్రతినిధులకు ఇదే ఆహ్వానం.

నిక్కచ్చులు (డిమాండ్లు)

1. తెలుగుభాషాభివృద్ధి ప్రాధికారసంఘం ఏర్పాటుకై కమిటీ ఇచ్చిన నివేదికను పూర్తిగా ఆమోదిస్తూ ప్రకటన చెయ్యాలి. దానికి తగిన చట్టరూపాన్నివ్వాలి.
2. ఆగష్టు 29 నుండి ముఖ్యమంత్రి, రాష్ట్ర కార్యదర్శిగారల కార్యాలయాలనుండి పూర్తిగా తెలుగులో పరిపాలన జరగాలి. తక్షణం తగిన అధికార ప్రకటన రావాలి.
3. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో మాతృభాషామాధ్యమాన్ని తప్పనిసరి చేసేందుకు చర్యలు మొదలుపెట్టాలి.

మీ మీ సంఘాలనుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు చెయ్యండి. శాసనసభ, శాసనమండలి సభ్యులపై ఒత్తిడి తీసుకురండి. మీకు తోచిన అన్ని ప్రయత్నాలు చెయ్యండి.

తెలుగుభాషోద్యమ సమాఖ్య
కేంద్ర అధ్యక్షుడు : డా॥సామల రమేష్‌బాబు
ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి : డా॥వెన్నిసెట్టి సింగారావు

గమనిక :ఇది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్యక్రమం మాత్రమే.

విజయవాడ, 1 ఆగష్టు 2017

వివరాలకు:
9848016136
9393015584

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదడులని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు.

ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500 రూ. వెంటనే ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ఈ సంచికలో డా॥ వేదగిరి రాంబాబు కథానికతో ఈ అమ్మనుడి కథానికల పరంపర మొదలవుతున్నది.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004. కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136
e-mail : editorammanudi@gmail.com

గమనిక : కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. ఫైల్సులో *editorammanudi@gmail.com* కు పంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసినదానిని స్కాన్ చేయించి పంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులోగాని, కొరియర్‌లో గాని పంపించాలి.

సంపుటి : 3 సంచిక : 6
అమ్మనుడి
ఆగష్టు 2017

సంపాదకీయం

జాతి మనుగడకే సవాలుగా మారిన భాషాసమస్య రాజకీయ అంశం కాదా?

స్వాతంత్ర్యోద్యమకాలంలోనే భాషారాష్ట్రాల ఏర్పాటు కావాలనే కోరిక బలంగా ముందుకువచ్చింది. వలస పాలకుల నుండి విముక్తి అయ్యాక ఈ కోరిక పుంజుకొని భాషారాష్ట్రాల ఏర్పాటుకు దారితీసింది. ఇక్కడ భాష ప్రధాన రాజకీయ అంశం మాత్రమేకాదు, భాషాజాతి వాదాన్ని నిరూపించింది. భాష ప్రాతిపదికన ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్, రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పరిణామానికి కూడా భాష ఒక అంశం అయింది. రాజకీయార్థిక అంశాలే ప్రధానంగా ఈ మార్పుని తెచ్చాయి. సాక్షాత్తూ భాషావైరుధ్యమే పాకిస్తాన్ చీలిపోయి, బాంగ్లాదేశ్ ఏర్పడడానికి దారితీసింది. ఇదంతా రాజకీయ అంశమే.

రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల్ని తెలుగులోనే ఓట్లు అడుగుతారు. రాజకీయ నాయకులే కాదు, అందరూ తమ కష్టసుఖాల్ని తమ భాషలోనే చెప్పుకుంటారు. కళలు, సాహిత్యం, సంస్కృతీ అంతా భాషతో పెనవేసుకునే ఉంటుంది. విద్య, పరిపాలన అంతా ప్రజల భాషల్లోనే జరగాలన్న ప్రజాస్వామ్య సూత్రాన్ని పాటించాల్సిందీ పాటింపజెయ్యాల్సిందీ ప్రభుత్వమే. ఇదీ రాజకీయాంశమే.

అయినా, రాజకీయ నాయకులు మాత్రం తమ ఉపన్యాసాల్లో భాషను ప్రజలే రక్షించుకోవాలని, ప్రభుత్వ బాధ్యత ఏమీ లేదంటూ ప్రసంగాలు చేస్తూ వుంటారు. తమ బాధ్యతేమీ లేదని, చేతులు దులుపుకొంటారు. 60 ఏళ్లకుపైగా సాగుతున్న భాషావిధ్వంసకాండను చూస్తూ కూడ బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారు మన తెలుగు రాజకీయనాయకులు.

కాలంతోపాటు మారుతున్న భాషావసరాలు, పెరుగుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా భాషాభివృద్ధిని చేయాలనే ఇంగితజ్ఞానం కూడా లేని పాలకులు – మన నాయకులు. అన్నిపార్టీల పరిస్థితీ ఇదే. ఏదో ఒకరిద్దరు నేతల విషయాలలో తప్ప ఇది అందరికీ వర్తిస్తుంది.

1940కి ముందే దశాబ్దాల తరబడీ భాషా ప్రజాస్వామ్యం కోసం పోరాడిన గిడుగు, గురజాడ వంటివారలు అప్పుడు ఎదుర్కోవలసి వచ్చింది – పాలకులతో కాదు; వారి పోరాటమంతా భాషామౌఢ్యులతో, పండిత పెద్దలతో... ప్రజలభాషను ప్రజలకు చేర్చేందుకు.

కానీ ఎంతో పోరాడి భాషారాష్ట్రాన్ని సాధించుకొన్న తర్వాత ప్రజలభాషలోకే పరిపాలనను, ప్రజల ప్రగతికి చెందిన అన్ని విషయాలనూ తేవాలన్న బాధ్యతను కోల్పోయి, ప్రజలను పరభాషా బానిసత్వంలోకి వీలైనంతగా నెట్టివేసే విధానాలను అమలుచేస్తున్న పాలకులను – వారేపార్టీకి చెందినవారైనా... వారికి శిక్ష ఏమిటి?

సంస్కృతమో, ఇంగ్లీషో, హిందీయో లేకపోతే – మనకు అతీగతీ ఉండదనీ, మన భాష ఎందుకూ పనికిరాదనే భావనను పసితనం నుండే భావిపౌరుల మనస్సుల్లోకి ఎక్కిస్తున్న మన పాలనావిధానాల వల్ల మనకు ఒరిగిందేమిటి? పూర్తిగా భాషా బానిసత్వాన్ని ఆమోదించాలని మృదువుగా బోధిస్తున్న పాలకుల్నీ, వారి ప్రతినిధుల్నీ, మేధావుల్నీ రాజకీయంగా లోతుగా పూడిపెట్టాల్సిన తరుణం వచ్చేసింది.

శాస్త్రీయమైన విశ్లేషణల్ని పట్టించుకోరు. కళ్ళెదురుగా కన్పించే వాస్తవాల్ని గమనించరు. కొద్దిమంది

స్వార్థపరులైన వ్యాపారస్తుల, జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారుల గుప్పిట్లో ఇరుక్కుపోయి, వారికి దాస్యం చేస్తున్నారు మన నేతలు. 'అభివృద్ధి' అంటే వారి దృష్టిలో పరిశ్రమలు, పెట్టుబడి, ఆర్థికపోటీలో మునిగి, తేలుతూ ఆధునికత పేరుతో మానవీయతకూ, సాటి ప్రజల హితానికీ దూరంగా ఉండే జీవితమే. వారి స్వార్థానికి ఉపయోగించని అంశాలకు చోటే ఉండదు.

తెలుగుభాషకు సంబంధించి అన్ని కోణాలనుంచీ ఎన్నో అంశాలు చర్చకొస్తున్నాయి. భాషోద్యమకారులే కానక్కరలేదు. కొందరు మేధావులు, ఉద్యమశీలం కలిగిన వివిధ రంగాల్లోని కొందరు వ్యక్తులు ఈ అంశాలను ఇప్పుడు చర్చిస్తున్నారు. 'అమ్మనుడి' పత్రిక ఎన్నో వాస్తవాంశాలను ప్రచురిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిశోధనలు పత్రికా ప్రసార మాధ్యమాల్లో వస్తున్నాయి. అయినా రాజకీయనాయకులకు, వారి తాబేదారులుగా ఉన్న అధికారగణానికీ ఇదంతా పట్టదు.

అందుకే ఇప్పుడు భాషోద్యమం అంతా రాజకీయపార్టీలను, ప్రభుత్వనేతలను, అధికారవర్గాలను గురిగా పెట్టుకొని ముందుకుసాగాలి.

భాషలేని సంస్కృతి ప్రాణం లేని శరీరం. తెలుగు కనుమరుగైతే తెలుగు సంస్కృతీ ఉండదు, తెలుగు సమాజమూ వుండదు. భాష పోయిన తర్వాత –నీ ఉనికీ గుర్తింపూ ఏమీ ఉండవు.

కేవలం సాహిత్యం కాదు, బ్రతుకులో ప్రతి ఎదుగుదలకూ భాష అవసరం ఉంది. అది నీ భాష కావాలి. నీ తెలుగు కావాలి. ఇప్పుడు ఆధునిక సాంకేతికత అంతా నీకు తోడుగా నిలుస్తోంది. కావలసింది నీ సంసిద్ధతే.

కొందరు పెద్దమనుషులున్నారు. వీరు ఎంతో అనాలోచితంగా ఒక సిద్ధాంతాన్ని ప్రవచిస్తుంటారు. 'తెలుగు మాధ్యమంగా అక్కరలేదు. కేవలం ఒక సబ్జెక్టుగా కొనసాగించండి. చాలు' అని వీరి సిద్ధాంతం. పైకి అనకపోవచ్చుగాని కీర్తిశేషులైన రాజశేఖరరెడ్డిగారైనా నేటి ముఖ్యమంత్రి చంద్రబాబుగారైనా, తక్కిన ప్రముఖ రాజకీయనేతలైనా ఇలాంటి అభిప్రాయాన్నే కలిగి ఉంటారు. అందువల్లే వాళ్ళకు ఇంగ్లీషుపై అంత ప్రేమ.

బోధనామాధ్యమంగానే కాక, అన్ని రంగాలలోను తన భాష ద్వారా తన భావప్రకటన చేయలేని భాషాజాతికి గుర్తింపుగాని, భవిష్యత్తుగాని ఉండవు.

ఇంగ్లీషుగాని, మరో భాష గానీ అది మన చేతిలో వుండి అవసరానికి వాడుకొనే పరికరంగానే మన నియంత్రణలోనే ఉండాలి గాని, మన బుర్రను, శరీరాన్నీ, బ్రతుకునూ శాసించేదిగా ఉండకూడదు. చుట్టూ వున్న సమకాలీన ప్రపంచాన్ని చూచి అయినా నేర్చుకోవాలి.

యునెస్కో చెప్పినా, ప్రపంచస్థాయిలోని విద్యావేత్తలు చెప్పినా, అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఆచరణలో చెప్తున్నా చూడడానికీ, వినడానికీ తిరస్కరిస్తున్న మన పాలకవర్గాలను దారికి తేగల మార్గం – రాజకీయమార్గమే.

ఆ దారి తెరుచుకోవడానికి చాలా కష్టపడాలి. మన రాజకీయపార్టీలకు భాష, విద్యాసాంస్కృతిక అంశాలపై మన రాజకీయ పార్టీలను 'రిపెయిర్' చెయ్యడానికి పెద్దఎత్తున ఉద్యమాలను చెయ్యాలి. ఇదంతా కొంతసమయం పట్టే వ్యవహారమే. రాజకీయ అవసరంగా ఓట్లను తెచ్చిపెట్టగల అంశంగా ఈ సమస్యను మనం ముందుకు తేగలిగితేనే ఇది సాధ్యమవుతుంది. అవసరమైతే ఇదే ప్రధానాశంగా ఒక కొత్త రాజకీయపార్టీయే రంగంలోకి రావాలి. ఇందుకు కొంత సమయం పడుతుంది. మన ఉద్యమాన్ని నిరంతరంగా సాగించాలి.


ఇది సరైన సమయం. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయ సంక్షోభాలకు, అవసరాలకు భాషోద్యమం ఒక ప్రజ్వలనాంశం కావాలి. ఇది తొలిగా ఆంధ్రప్రదేశ్‌తోనే ప్రారంభం కావాలి.

తేదీ: 1-08-2017

సామల రమేష్ బాబు

"ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రే తెలుగుకు శత్రువు"

ఉత్తర అమెరికా తెలుగుసంఘం (NATS) వేదికపై తెలుగు భాషోద్యమసమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు ప్రకటన.



జూలై 1న చికాగో నగరంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (NATS) అమెరికా తెలుగు సంబరాలు పేర పెద్ద ఎత్తున జరిపిన రెండున్నర రోజుల కార్యక్రమంలో వేలాదిగా అమెరికా తెలుగువారు పాల్గొన్నారు. తొలిరోజు ఉదయం పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. అందులో ఆంధ్రప్రదేశ్‌నుంచి విశ్వంజీ మహారాజ్, మరికొందరు స్వాములు, స్థానిక తెలుగు ప్రముఖులతోపాటు అతిథులుగా డా॥ మండలి బుద్ధప్రసాద్, డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లు కూడా పాల్గొన్నారు. అదే ప్రధాన వేదికపై కొన్ని సాంస్కృతిక ప్రదర్శనల తర్వాత మధ్యాహ్నం 3 గం॥లకు తెలుగుభాష పరిరక్షణ అంశంపై ప్రత్యేకంగా సభ జరిగింది. అప్పుడు కూడా ఆ సభలో వెయ్యిమందికి పైగా శ్రోతలున్నారు. ఆ సభకు అధ్యక్షులుగా లక్ష్మీప్రసాద్, అతిథులుగా ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, తెలుగు మాండలిక కథా రచనా ప్రముఖుడు నామిని సుబ్రహ్మణ్యం నాయుడులను వేదికపైకి పిలిచి, కార్యక్రమ సమన్వయకర్త డా॥ వి.రాఘవేంద్ర చౌదరి పరిచయ ప్రసంగం చేశారు. డా॥ యార్లగడ్డ తన ప్రసంగంలో కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంతవరకు తెలుగు విశ్వవిద్యాలయం, అకాడమీ విషయంపైగాని, ఇతర తెలుగు అవసరాలపైగాని ఏవిధంగానూ ముఖ్యమంత్రి శ్రద్ధ చూపలేదని, కొత్త రాజధాని శిలాఫలకాన్ని కూడా తెలుగులో వెయ్యాలన్న స్పృహ లేకపోయిందని, నిరసనలను కూడా పట్టించుకోవడంలేదని విమర్శించారు. జొన్నవిత్తుల ప్రసంగిస్తూ తెలుగును రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని తెలుపుతూ ప్రసంగించారు. మాండలికాలు ప్రజాభాషలకు ఊపిరిగా వుంటాయని, తన కథల్లో ప్రాణశక్తికి అదే కారణమని నామిని సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి డా॥ మండలి బుద్ధప్రసాద్ కూడా సభలో పాల్గొనాల్సి వుంది. డా॥ రమేష్‌బాబు భాషోద్యమం నుంచీ డా॥ బుద్ధప్రసాద్ ప్రభుత్వం వైపు నుంచీ మాట్లాడాల్సివుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. కాని, డా॥ బుద్ధప్రసాద్ పాల్గొనలేదు. ఆయన కూడా వస్తే సభికులకు తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి గురించి– సమగ్ర అవగాహన కలిగేందుకు అవకాశం ఉండేది. ఆయన రాకపోవడాన్ని డా॥ రమేష్‌బాబు తన ప్రసంగంలో ప్రస్తావించి, అందుకు తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. దేశంలోనూ బయటా ఎక్కడ తెలుగు కార్యక్రమాలు జరిగినా బుద్ధప్రసాద్ గారిని గౌరవంగా పిలుస్తారని నిజానికి ఆయన తెలుగు సాంస్కృతిక రాయబారిగా అంతటా గుర్తింపు కలిగిన వ్యక్తి అనీ, ఆయన రాకపోవడం చాలా విచారకరమని అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇంతవరకు ఏ వాగ్దానాన్నీ నిలబెట్టుకోకపోవడం వల్లనే ఆయన సభకు రాలేకపోయారని భావిస్తున్నామన్నారు. 2002 లో తాము శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు దేవాలయ ప్రాంగణంలో భాషోద్యమ శిబిరం నిర్వహించడం, అక్కడి నిర్ణయాల ప్రకారం తామిద్దరమూ కీ.శే. సి. ధర్మారావు గారితో కలిసి తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించి ఉద్యమాలను నడిపించడం జ్ఞాపకం చేసుకొంటూ మాట్లాడారు. శాసన సభలోపలా, బయటా డా॥ బుద్ధప్రసాద్ తెలుగు కోసం ఎంతో కృషి చేసిన వ్యక్తి అని అంటూ ముఖ్యమంత్రి ఆలోచనాధోరణి అంతా తెలుగుకు వ్యతిరేకంగా ఉందని ఇప్పుడు నిస్సందేహంగా స్పష్టమైపోయిందని అన్నారు. అందువల్ల – "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు తెలుగుకు శత్రువు" అని తాను ప్రకటిస్తున్నానని, మొత్తం పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అన్నారు. ఒక నెలలో ఏర్పాటు చేస్తానన్నతెలుగు అభివృద్ధి ప్రాధికార సంఘం ఏడాది గడుస్తున్నా ఆచరణకు రాలేదని కమిటీ నివేదికను బుట్టదాఖలు చేశారని అనుమానంగా ఉన్నదని అన్నారు. రెండేళ్ళుగా చేస్తున్న వాగ్దానాలలో దేనినీ అమలుచేయలేదనీ, ఆచరణలోఆయనప్రభుత్వం అధికార భాషను నాశనం చేస్తూఉందని అన్నారు. రాష్ట్ర విద్యా పాలనా రంగాలను వ్యాపారస్తుల చేతిలో పెట్టిందని అన్నారు. ఇక ఈ అంశం పై ప్రజలలోకి విస్తృతంగా వెళతామని ప్రకటించారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి నవీన్

మనభాషను మనమే కాపాడుకోవాలి
తెలుగుప్రభుత్వాలమీద ఒత్తిడిని పెంచాలి
డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి సదస్సు పిలుపు

అమెరికాలోని డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి (డి టి ఎల్ సి) గత పంతొమ్మిది సంవత్సరాలుగా తెలుగు భాష, సాహిత్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. జులై తొమ్మిదో తారీకున డిట్రాయిట్ కు దగ్గరలో ఉన్న నోవై పట్టణము లోని శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణములో తెలుగు భాషాభివృద్ధి మీద ఒక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి భారతదేశం నుండి ముఖ్య అతిధులుగా "అమ్మనుడి" పత్రిక సంపాదకులు మరియు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా॥ సామల రమేష్‌బాబు, కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, కథకుడు, సంపాదకుడు శ్రీ వాసిరెడ్డి నవీన్ పాల్గొన్నారు.

ముందుగా సభాధ్యక్షులు డా॥ వేములపల్లి రాఘవేంద్ర చౌదరి సూచన మేరకు అందరూ డాక్టర్ వి. చంద్రశేఖరరావు గారి మృతికి ఒక నిమిషం మౌనం పాటించి తమ సంతాపాన్ని తెలియజేశారు.

డాక్టర్ సామల రమేష్‌బాబు "మరోసారి తెలుగు భాషోద్యమం" అనే అంశము మీద మాట్లాడారు. భాషాప్రాతిపదికమీద ఏర్పడిన తెలుగురాష్ట్రం రెండుగా విడిపోయినా, రెండూ తెలుగు రాష్ట్రాలేనని, వీటిలోని 9 కోట్లమందీ ఇతర రాష్ట్రాల్లోనూ దేశాల్లోనూ ఉన్న 9 కోట్లమందీ కలిసి మొత్తం 18 కోట్లమందికి పైగా ఉన్న తెలుగు ప్రజల గురించి మనం ఆలోచించాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు తెలుగుకు మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయించామని, అరవైఏళ్ళ తర్వాత ఎంతో పోరాటం చేసి తెలుగుభాషోద్యమ సమాఖ్య దీన్ని సాధించిందని, కాని దానితోపాటు అత్యంత అవసరమైన తెలుగు అభివృద్ధి ప్రాధికారసంఘాన్ని (డెవలప్‌మెంట్ అథారిటీని) ఏర్పాటుచేయకుండా మంత్రిత్వశాఖను నిరుపయోగం చేశారని, ఇందుకు పాలకులదే బాధ్యత అని అన్నారు. మళ్ళీ పోరాటం తర్వాతే ఒక కమిటీఏర్పాటు జరిగిందనీ, అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఇంతవరకు కమిటీరిపోర్టును ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారని విమర్శించారు.

యునెస్కో వారు సూచించినట్లు మాతృభాషలో ప్రాథమిక విద్య అభ్యసించాలని, అలా అభ్యసించిన విద్యార్థులు తమదైన మాతృభాషలో తమకు తెలియని విజ్ఞానాన్ని (భాషలు, విభిన్న విషయాలు) సులువుగా నేర్వ గలుగుతారని వివరించారు. పాలకులు ఎన్నికల సమయంలో ఓట్లు మాతృభాషలో అడిగి, పరిపాలన వేరొక భాషలో జరిపి పాలనా వివరాలు సామాన్య ప్రజలకు అర్థం కాని విధముగా జరుగుతున్న వ్యవస్థని ప్రజలు ప్రశ్నించాలన్నారు. తెలుగు ప్రభుత్వాలమీద ఒత్తిడిపెంచి, తెలుగును రక్షించుకోవాలని ఇందుకు దేశంలోనూ, బయటా ఉన్న తెలుగుప్రజలు, సంఘాలు ఉద్యమించాలని కోరారు. డెట్రాయిట్ తెలుగుసాహిత్య సమితి కృషిని కొనియాడారు.

వాసిరెడ్డి నవీన్ "మాండలిక కథ" అనే అంశము మీద మాట్లాడుతూ కథలలో గురజాడకు పూర్వ కాలం నుండి గ్రాంథిక భాషనుంచి వ్యావహారిక భాషలోకి జరిగిన మార్పులు వివరించారు. భాషలో యాస మరియు మాండలికాల మధ్య ఉన్న తేడాలను పాఠకులు గమనించాలని చెప్పారు. మాండలికంలో కథలు వ్రాస్తున్న ప్రముఖ కథారచయితల కృషిని వివరించారు. మరుగున పడిన మాటలు, కొత్తగా వచ్చే మాటలు గ్రంథస్తం చేసినందువలన కలిగే ఉపయోగాలు వివరించారు.

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు "తెలుగు భాషా వైభవం – పరిరక్షణ" అనే అంశము మీద మాట్లాడుతూ పరిపాలన, విద్య, జనజీవనం, వార్తా ప్రసారాలు మాతృభాషలో జరిగితే వచ్చే ఉపయోగాలు వివరించారు. బెజవాడ దుర్గమ్మవారి మీద మంచి పద్యము, పారడీలతో అందర్నీ అలరించారు.

కార్యక్రమంలో అంతర్జాల పత్రిక "ఈ –మాట" సంపాదకులు శ్రీ మాచవరం మాధవ్, తానా మాజీఅధ్యక్షులు శ్రీయుతులు బండ్ల హనుమయ్య, నాదెండ్ల గంగాధర్, మాజీ డి టి ఏ అధ్యక్షులు ఎక్కా వెంకట్, కోడూరి చలపతి, నాట్స్ ప్రముఖులు కొడాలి శ్రీనివాసరావు, వీరపనేని విష్ణు, మనబడి నిర్వాహకులు శ్రీని తొంట, చిత్తలూరి పాల్గొన్నారు.

ఈ సమావేశ విజయానికి ఆలయ నిర్వాహకులు చిరుమామిళ్ల శివాజీ, పెద్దిబోయిన జోగేశ్వరరావు, కొడాలి వేణు,అక్కినేని క్రిష్ణ, పద్మసనమ్ ఎంతో సహకరించారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ డి టి ఎల్ సి తరఫున శ్రీయుతులు మద్దిపాటి కృష్ణారావు, ఆరి సీతారామయ్య, వెంకట్ నర్రా, పిన్నమనేని శ్రీనివాస్, బూదరాజు కృష్ణమోహన్, అడుసుమిల్లి శివ కైమోడ్పులు సమర్పించారు.

(ఫొటోలు : రెండవ అట్టపైన)



ఉడుమలపేటలో వెలగా అప్పలనాయుడు దంపతులను స్వాగతిస్తున్న తెలుగువాణి, మాతెలుగు ప్రతినిధులు.(ఎడమనుండి మాటూరి వసంత్‌నాయుడు, సెంథిల్‌కుమార్, డా.సామల రమేష్‌బాబు, అప్పలనాయుడు, జయలక్ష్మి, స.వెం.రమేశ్)

తెలుగును కాపాడుకుందాం కలిసి పనిచేద్దాం, సహకరించండి

మలేసియా తెలుగు సంఘం నేత వెలగా అప్పలనాయుడు

రెండున్నరకోట్ల జనాభా వున్న చిన్న దేశం మలేసియా. అందులో 60 శాతం మెలే (మలాయీ) భాషీయులు. 30 శాతం మంది చైనీస్. 7 శాతం భారతీయ సంతతివారు కాగా ఇతరులు 3 శాతం.

భారతీయ సంతతిలో తెలుగువారు 5 లక్షలమందే. వారిలో తెలుగు మాట్లాడుతున్నవారు కేవలం 3 లక్షలమంది. వారంతాకలిసి తెలుగును కాపాడుకొంటున్నారు. ఇప్పుడు తమకోసం ఒక తెలుగు పేరోలగం (తెలుగు అకాడమి)ని ఏర్పాటు చేసుకొని దానికొక ఖరీదైన భవనాన్ని కట్టుకొంటున్నారు. ఇప్పటికే వాళ్లు నడుపుకొంటున్న తెలుగు విద్యావ్యవస్థకు అది కేంద్రంకానుంది. ఆ సంగతుల్ని మలేసియా తెలుగు సంఘం బాధ్యుల్లో ఒకరైన శ్రీ వెలగా అప్పలనాయుడు తెలియజేశారు.

తెలుగువాణి నడుపుతున్న తరగతుల సభల్లో పాల్గొనడానికి ఆయన తన సతీమణి జయలక్ష్మి గారితో కలిసి జూలై 22న ఉడుమలపేటకు వచ్చారు. అదేపనిమీద వెళ్లిన నేను 22, 23, 24 తేదీలు వారితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. (ఆ వివరాలను, ఫోటోలను ఈ పత్రిక 50వ పుటలోను, 2, 51 పుటల్లో (చూడవచ్చు) తెలుగువాణి తరగతుల బాధ్యుడు స.వెం. రమేష్‌తోను, తెలుగు ప్రజల్లో చైతన్యం కోసం పనిచేస్తున్న స్థానిక యువ విద్యావంతుడు, 'మాతెలుగు' బాధ్యులు మార్టూరి వసంతనాయుడు, సెంథిల్, జవహర్ తదితరులతో కలిసి గడిపిన ఆ మూడు రోజులు ఎన్నో విషయాలను పరస్పరం తెలుసుకోగలిగాం.

ముఖ్యంగా మలేసియాలో విద్యావ్యవస్థ ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యావ్యవస్థల్ని చూసి ఎంతైనా నేర్చుకోవలసి వున్నదనిపిస్తుంది. మధ్యలో చదువు మానివేసేవారిపైనా, చదువులో వెనకబడేవారిపైనా, వారు చూపే శ్రద్ధ అచ్చెరువు కలిగిస్తోంది. అలాగే తెలివిగల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కోసం 'ఆశ్రమ' వ్యవస్థ ఉంది. ప్రాథమిక, సెకండరీ విద్యాదశల్లో ఉత్తీర్ణత, ప్రమోషన్లూ, పరీక్షల విషయాల్లో ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. అందరికీ కనీస విద్య కలిగేట్లు SPM అంటే మలేసియన్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్టు పొందేట్లు చూసే పద్ధతి బాగుంది. ఆ తర్వాత మెట్రిక్యులేషన్ తర్వాత ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులలో వారి అభిరుచి మేరకు ఎంపిక చేయడం– ఇదంతా ఒక అభ్యుదయ పద్ధతితో ఉంది. ఇదంతా వివరంగా మరికసారి వ్రాస్తాను.

ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే ప్రయివేటు విద్యా వ్యాపారులకు బలిచేయకుండా ప్రభుత్వం ప్రజలందరికీ కనీస విద్యను అందించడంలో పూచీపడుతున్నది.

విద్యామాధ్యమం విషయంలో వారికొక పద్ధతి ఉంది. 6వ తరగతివరకు (12వ సంవత్సరం వరకు) విద్య మొత్తం తమిళ/ చైనీస్/ మెలీ ఉంటుంది.–అంటే మాతృభాష ఉంటుంది. గణితం, సైన్సు సబ్జెక్టులు కూడా అదే భాషలోగాని, ఇంగ్లీషులో గాని ఉంటాయి. 7వ తరగతినుండి 5వ ఫారం వరకు మెలే మాధ్యమంలో ఉండి ఇంగ్లీషు ఒక సబ్జెక్టుగా ఉంటుంది. దానితో పాటు చైనీస్ గానీ, తమిళ్‌గాని ఒక సబ్జెక్టుగా ఉంటుంది. తమ మీడియాన్ని కాపాడుకొంటూ, చైనీస్‌వారు తమ స్వంత భవనాలనేర్పాటు చేసుకొంటే వారికి ఉపాధ్యాయుల్ని మలేసియా ప్రభుత్వం ఇస్తుంది. చూడండి, వాళ్లకు ఒక శాస్త్రీయ విధానం ఉంది. మాతృభాషలకున్న ప్రాధాన్యతను కాపాడుకొంటున్నారు. మరి మన సంగతి... ప్చ్...

అక్కడి తెలుగు వారందరికీ తలగా ఉన్న డా॥ అచ్చయ్య కుమార్‌రావుగారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మలేసియాలో తెలుగువారి గౌరవ మర్యాదలకు బాధ్యులైన వారిలో ఆయన, వారితో పాటు అప్పలనాయుడుగారి లాంటివారు కొందరున్నారు. మన ఖమ్మం నుండి సత్యనారాయణరావు గారనే విశ్రాంత అధ్యాపకుడు నాలుగైదేళ్లపాటు మలేసియా వెళ్లివస్తూ అక్కడివారికి తెలుగు పాఠాలను నేర్పిన వివరాలను నడుస్తున్న చరిత్రలో ఆరేడేళ్ళక్రితం అందించాం.

మలేసియాకు రమ్మని పిలుపు

అప్పలనాయుడుగారి పర్యటనలో కొన్ని ప్రకటనలు చేశారు. తెలుగు నేర్చుకోవడానికి, నేర్పటానికి జానపద కళాకారులకు తాము ఆహ్వానం పలుకుతున్నామని, ప్రతియేటా ఐదుగురు విద్యార్థులను మలేసియాలోని తమ 'తెలుగు పేరోలగానికి' తీసుకువెళ్ళగలమని ప్రకటించారు.

–సామల రమేష్‌బాబు


-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

భారతదేశంలో ఇంటర్నెట్‌ను నిర్వచిస్తున్న భారతీయ భాషలు

(భారతీయ భాషలలో ఇంటర్నెట్ ఉపయోగంపై కెపిఎంజి అనే సంస్థ నిర్వహించిన సర్వే ఫలితంగా వచ్చిన ఆసక్తికర విషయాలను సమాహారంగా అందిస్తున్న వరుసలో ఇది ఆఖరు)

2021 నాటికి ప్రభుత్వ సేవల అందుబాటు పూర్తి స్థాయిలో వలగూడులో రావటం, ప్రభుత్వ పనితనం కంప్యూటరీకరణ కావటం వలన దాదాపు 13.1 కోటి మంది భారతీయులు కొత్తగా వలగూడును ఆశ్రయిస్తారు. ప్రస్తుతం కేవలం 4.1 కోటి మంది భారతీయులు కంప్యూటరీకృత ప్రభుత్వ సేవలను పొందుతున్నారు. 2021 నాటికి 33% పెరిగి 17.2 కోట్ల మంది ప్రభుత్వ సేవలను కేవలం వలగూడు ద్వారానే పొందుతారు.

ప్రభుత్వ సేవలను పొందగోరే వారు ప్రస్తుతం ఏదో దరఖాస్తు చేసుకోవటానికో, ఉద్యోగావకాశాల వలస్థలాలను(upsc, appsc, tspsc, etc), ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని పొందటానికో లేదా పన్ను కట్టేందుకో 28% భారతీయులు వలగూడుకు వస్తున్నారు. ఈ సేవలు ప్రస్తుతం దాదాపుగా ఆంగ్లంలోనే ఉన్నాయి. మెల్లిగా, హిందీ, ప్రాంతీయ భాషలలోకి ఇవి తర్జుమా అవుతుండటంతో వలగూడును తమ మాతృభాషలో వాడే వారి సంఖ్య పెరగనుంది.



కేవలం ప్రభుత్వ రంగ సేవల కోసం వలగూడును ఆశ్రయిస్తున్న వారి సంఖ్య, లక్షల్లో, కింద పట్టికలో చూడవచ్చు.

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
2016	240	10	30	30	40	10	30	20
2021	540	80	130	150	160	70	130	60

ప్రభుత్వరంగ సంస్థల సేవలను వలగూడు ద్వారా కాకుండా నేరుగా కంప్యూటర్ సహాయం లేకుండా పొందాలనుకునే వాడుకరులు ఎందుకు అలా చేస్తున్నారా అన్న విషయమై వాకబు చేయగా సర్వేలో తెలిసిన కొన్ని ఆసక్తికర విషయాలు ఏమిటంటే:

54% ప్రజలకు ప్రభుత్వ రంగ సంస్థల సేవలు వారి మాతృభాషలలో అందుబాటులో లేకపోవడం.

38% మందికి ఆంగ్లంలో ఫారాలు నింపడం/ వలగూడు వాడటం మరింత మెరుగ్గా అనిపించింది.

36% మందికి వారి వద్ద ఉన్న ఫోను/లాప్టాప్/కంప్యూటరులో మాతృభాషలో ప్రభుత్వ సేవలు అందుబాటులో లేవు (కనపడ్డం/ ముద్రించడం కుదరటం లేదు)

23% మందికి ప్రభుత్వ సేవలు తమ మాతృభాషలో అందుబాటులో ఉన్నాయన్న సంగతి తెలీదు.

33% వృద్ధి అంచనాతో భారతీయ భాషా వాడుకరులను వలగూడు వైపుకి లాగడంలో ప్రభుత్వ రంగ సంస్థలే ముందంజలో ఉన్నాయి – ఈ వృద్ధి రేటు సామాజిక మాధ్యమాలు, వార్తా పత్రికల కంటే ఎక్కువ!

2021 నాటికి హిందీ, తమిళం, మరాఠీ భాషల్లో వలగూడులో ప్రభుత్వ రంగ సేవలు పొందేవారిలో 75% జనాభాగా ఈ మూడు భాషల వారే ఉండనున్నారు.

ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడం వలన ఆయా సేవలు తమ మాతృభాషలో ఉండవేమో అనుకునే 40% పట్టణ ప్రజలకు, 30% గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన వచ్చి, భారతీయ భాషలలో వలగూడు వాడకం పెరిగే అవకాశం ఉంది.


వలగూడు ద్వారా ప్రభుత్వ సేవలు పొందకపోవటానికి ప్రధాన కారణం అవి తమ మాతృభాషలో లేకపోవడమే అని 60% గ్రామీణులు తెలిపారు. అందువలన వారు ఆ ప్రభుత్వ సేవలకు లబ్ధిదారులు కాలేకపోతున్నారు.

ఇక వినోదం పొందటం కోసం, ఆహ్లాదం కోసం కంప్యూటర్లు – వలగూడు వాడబోయే జనాభా 2021 నాటికి 39.2 కోట్లకు చేరుకోనుంది. ప్రస్తుతం వలగూడు ఆధారంగా సినిమాలు, సీరియళ్ళు, లఘుచిత్రాలు, పాటలు చూస్తూ, వింటూ ఉన్నవారు 16.7 కోట్లున్నారు. ఈ సంఖ్య మరో ఐదేళ్ళలో రెట్టింపు అయి 39.2 కోట్లు కానుంది. ఈ రంగంలో 19% వృద్ధి ఉండబోనుంది.


చాట్ అప్లికేషన్ల తరువాత అంతటి ప్రజాదరణ ఉన్న విభాగం వలగూడు ద్వారా సినిమాలు, సీరియళ్ళు వగైరా చూడటం. దాదాపు 90% మంది వారు చూస్తున్న సీరియళ్ళు-సినిమాలు వలగూడులో అందుబాటులో ఉంటే, వలగూడుకు మారటానికి సిద్ధంగా ఉన్నారు. ఇందుకు ముఖ్య కారణం మనమున్న చోటు నుండే మనకు నచ్చిన కార్యక్రమాన్ని ఎక్కడైనా ఎప్పుడైనా మన వెసులుబాటు ప్రకారం చూసుకోగలగటమే అన్నది నిజం. 84% మంది భారతీయులు యూట్యూబ్ ద్వారా వీడియోలు చూస్తున్నారు. వూట్, సన్ నెక్స్ట్, హాట్ స్టార్ లాంటి ఆప్లన ద్వారా 36% మంది వారికి నచ్చిన సీరియళ్ళను తాపీగా ముందుకు వెనక్కూ కదుపుతూ చూసుకుంటు న్నారని సర్వేలో తేలింది.

వారి భాషలలో వారికి నచ్చిన/కావాల్సిన వీడియోలు లేవని 45% హిందీ, 63% బెంగాలీ, 36% తెలుగు, 25% తమిళం, 50%

మరాఠీ, 32% గుజరాతీ, 13% కన్నడ, 40% మలయాళం వారు వాపోయారు. భారతీయ భాషలలో కేవలం సినిమా/సీరియళ్ళు మాత్రమే కాకుండా, జానపద నృత్యాలు, శృంగార చిత్రాల కోసం వెతికే వారి సంఖ్య విపరీతంగా ఉంది.



భారతీయ భాషలలో వినోదాన్నిచ్చే వలగూడు స్థలాలు లేవని చెప్పిన భారతీయుల శాతం



వినోదం కోసం వలగూడును ఆశ్రయించనున్న జనాభా శాతం

కేవలం వినోదం కోసం వలగూడును ఆశ్రయిస్తున్న వారి సంఖ్య, లక్షల్లో, కింద పట్టికలో చూడవచ్చు.

లక్షల్లో వాడుకరుల సంఖ్య	హిందీ	బెంగాలీ	తెలుగు	తమిళం	మరాఠీ	గుజరాతీ	కన్నడ	మలయాళం
2016	320	170	110	130	200	80	100	60
2021	1900	400	370	290	470	280	130	140

వలగూడును కేవలం వినోదం కోసమే మొట్టమొదటిసారిగా వాడినవారు సర్వే ప్రకారం 43% మంది. అంటే జనాభాలో సగం మంది కేవలం వినోదం కోసం వలగూడును ఆశ్రయిస్తున్నారు.

రాబోయే ఐదేళ్ళలో ప్రాంతీయభాషలలో వాణిజ్య ప్రకటనలకు ఊతమిచ్చే ఒకే ఒక్క అతి పెద్ద వేదిక ఈ వినోదరంగం.

ఈరోజు వలగూడు ఊసు తెలియని 56% జనాభా, వినోదం కోసం వలగూడు – కంప్యూటరులకు చేరువవుతారు.

ఈ వలగూడు ద్వారా వినోదాన్ని పొందేవారు భాషలవారీగా హిందీ, మరాఠీ, ఆపై బెంగాలీ వారు ఉండనున్నారు.

రాబోయే ఐదేళ్ళలో వలగూడు ద్వారా వినోదాన్ని పొందేవారిలో బెంగాలీ, కన్నడ, మలయాళం భాషీయుల పెరుగుదల అత్యధికంగా ఉంది. ఆయా భాషల్లో విషయవస్తువు పెరుగుదలపై ఇది ఆధారపడి ఉంటుంది.

భారతీయ భాషల్లో విశేషంగా పెరుగుతున్న చాట్ అప్లికేషన్లు, సోషల్ మీడియా వేదికలు మరియు వలగూడులో రాయబడిన కథనాలు:

19% పెరుగుదలతో, ప్రస్తుతం 17 కోట్ల జనాభా వాడుతున్న చాట్ అప్లికేషన్లు, 2021 నాటికి 40 కోట్ల జనాభాను వలగూడుకు కట్టిపడేయనున్నాయి.

హిందీ భాషీయులు ప్రస్తుతం 50% వలగూడు వాడుకరులైతే, వచ్చే పదేళ్ళలో ఈ శాతం కొనసాగుతూనే, కన్నడంలో వృద్ధి రేటు 20% హిందీ తరువాత అత్యధికంగా ఉండనుంది. 45% భారతీయులకు వారి మాతృభాషలో టైపు చెయ్యలేకపోవడం, చాట్ అప్లికేషన్ భాష ఆంగ్లంలో ఉండిపోవటం అడ్డంకిగా మారి, వారిని ఈ చాట్ అప్లికేషన్లకు దూరంగా ఉంచుతోంది. మాట నుండి పాఠ్యం, భారతీయ భాషల్లో కీబోర్డులు, లిప్యంతరీకరణ సాధనాలు ఈ అడ్డంకిని తొలగించటంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి, పోషించనున్నాయి కూడా!

ఫేసుబుక్, గూగుల్ ప్లస్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాలలో 11.5 కోట్ల మంది భారతీయులు నిమగ్నులై ఉన్నారు, ఈ సంఖ్య 2021 కి 30 కోట్లు కానుంది. ఈ సామాజిక మాధ్యమాలను వాడే భారతీయ భాషీయుల్లో 44% మంది హిందీ వాళ్ళు కాగా, బెంగాళీ, తెలుగు, తమిళం వాడుకరులు 30% మందిగా ఉన్నారు.

ప్రాంతీయ భాషలలో కనిపించడం మొదలైతే మరో 58% ఇప్పటికే ఫేసుబుక్, గూగుల్ ప్లస్, ట్విటర్, ఇన్‌స్టాగ్రాం, మొదలైనవి వాడనివారు కొత్తగా వచ్చి చేరతారు. అంటే మరో 15 కోట్ల మంది!

భారతీయ భాషలలో వలగూడును వాడే వారిలో 33% జనాభా 30 యేళ్ళ లోపే, వారి అభిరుచికి అనుగుణంగా, కథలూ కథనాలు అందుబాటులో ఉంటే, వలగూడులో ఆ భాషలకు మంచి ఆదరణ ఉండవచ్చు.

ఇలా డిజిటల్‌గా కథనాలు, కథలు చదివే వారిలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు, మరింత అధికంగా, మరింత వైవిధ్యంగా కథనాలు ఉంటే బాగుంటుందని సూచించారు. రచయితలు, వలగూడులో రాసే వారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే మరింత మంది వలగూడును ఆంగ్లంలో కాకుండా వారి మాతృభాషలోనే చదవనారంభిస్తారు.

మరొక ముఖ్యమైన విషయం – ఈ కథలూ, కథనాలు డెస్కుటాప్ తరహా తెరలపై బాగానే కనిపించవచ్చు, కానీ మొబైళ్ళలో ఈ కథనాలు చదవటంలో కొంత శ్రమ పడాల్సి వస్తుంది. అదే ఆయా కథనాలు మొబైల్ తెరకు అనుగుణంగా కూడా రూపొందిస్తే మరో 54% మంది వలగూడును మన భాషల్లోనే చదువుతారు.

ఇక, ఆఖరుగా, రాబోయే రోజుల్లో మనం చూడబోయే మార్పులు ఏమేంటి?

1. వలగూడులోనే నేరుగా పుస్తకాల ప్రచురణ, కథనాలు, రచనలు విపరీతంగా రాయబడటం. రాబోయే ఐదేళ్ళలో 17.6 కోట్ల కొత్త ఫోను వాడుకరులు రానున్నారు. వీరంతా తాపీగా రాసుకున్నా, సృజనాత్మక రచనలు భారతీయ భాషల్లో రాబోయే రోజుల్లో విపరీతంగా పెరగనున్నాయి.

2. వేరే వాళ్ళ రచనలు చదివి ఊరకుండక తామూ రచనలు చేసే వారి సంఖ్య పెరగనుంది. అలా కేవలం చదువరుల నుండి రచయితలుగా మారే సమయం పుస్తకాల యుగంలో సంవత్సరాల్లో

ఉండేది. అది నెలలకు- వారాలకు-రోజులకు తగ్గనుంది.

3. యాభై కోట్ల మంది భారతీయులు వలగూడు గొడుగు కిందకు వచ్చే ఐదేళ్ళలో చేరుకుంటారు. వారంతా వలగూడును వాడటం మొదలయ్యాక వలగూడు నిర్వచనం మారిపోనుంది. సమాచార సామగ్రి గ్రామ స్థాయి-ఇంటి స్థాయి విషయాలను ప్రపంచ స్థాయి జనం చదివేలా చేసేస్తుంది.

4. రాబోయే సమీప భవిష్యత్తులో వాణిజ్య-వ్యాపార ప్రకటనలు, వార్తలు, ఆర్థిక లావాదేవీలు భారతీయ భాషల్లోకి వలగూడులో అందుబాటులోకి రావటం వలన ఈ రంగాలలో భారతీయ భాషలలో నైపుణ్యం ఉన్న వారికి మంచి ఉపాధి అవకాశాలు రానున్నాయి.

5. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, బ్యాంకులు, భారతదేశంలో రెండవ స్థాయి, ఆ కింది స్థాయి నగరాలను పట్టణాలను, గ్రామాలను చిన్నచూపు చూసాయి. అక్కడి జనాభాకు అవసరమున్న వస్తువులు, సేవలు, ఈ సంస్థలు దూరంగానే ఉంచాయి. ఐతే వలగూడు రాకతో హైదరాబాదు-ముంబై నగరాలకు ధీటుగా అమెజాన్ లాంటి సంస్థలు వస్తువులను సేవలను మారుమూల గ్రామాలకు తెచ్చిపెడుతున్నాయి. విద్య, వ్యాపారం, సేవలు, ఆర్థిక రంగ విషయాలు పెద్దా-చిన్నా నగరాల వ్యత్యాసాన్ని తుడిచి అందరికీ సమానంగా అందుబాటులోకి రానున్నాయి.

6. ప్రస్తుతం ఆంగ్లానికి పరిమితమైన ఎన్నో సేవలు అన్ని భారతీయ భాషలలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా అందుబాటులోకి వస్తాయి. మరింత మందికి చేరువవ్వాలంటే వాళ్ళ మాతృభాషలోనే అది సాధ్యమన్న విషయాన్ని వ్యాపార సంస్థలు గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి, ఈ పంథా మరింత విస్తృతం కానుంది.


7. ఈ సర్వేలో భాగంగా ఒక వంద మందికి వాణిజ్య ప్రకటనలు ఆంగ్లంలో, వారి మాతృభాషలో విడివిడిగా చూపిస్తే, మాతృభాషకే 90% మంది మొగ్గు చూపారు. ఆంగ్లంలో ప్రకటనను దాటవేసి, మాతృభాషలో ప్రకటనని కనీసం ఒక సారైనా చదివారు. ప్రస్తుతం ఐదు శాతం వాణిజ్య ప్రకటనలు మాత్రమే ప్రాంతీయ భాషలలో ఉన్నాయి, ఇవి 2021 కి 35% పెరగనున్నాయి.

8. మొబైల్‌లో బ్యాంకింగ్ సేవలు కేవలం ఆంగ్లంలో ఉండటం వలన గల ఇబ్బంది, భారతీయ భాషలలో మొబైల్ బ్యాంకింగ్ రావడంతో సమసిపోనుంది. భారతీయ భాషలలో మొబైల్ బ్యాంకింగ్ చేయనున్న వారి సంఖ్య వందలో 73 కానుంది. మిగిలిన 27% ప్రజలు కూడా సరళ భాషలో బ్యాంకింగ్ ఉంటే అటే మొగ్గు చూపుతారని సర్వేలో తెలిసింది.

9. భాషపై ఆధారపడని విధంగా గూగుల్ మ్యాప్స్, లాంటి అప్లికేషన్లు పరిణితి చెందనున్నాయి, అలా జరిగితే ఆంగ్లం స్థానంలో తెలుగులో మనం గూగుల్ మ్యాప్స్ వాడగలుగుతాం. ఇందుకు మనిషి గొంతు(వాయిస్) అనువాదాలు, వాయిస్ గుర్తుపట్టే సామర్థ్యాలు పెరగాలి. ఆ సాంకేతికాలలో మరింత పరిశోధన జరగాలి.

10. భారతీయ భాషలలో వలగూడు వాడేవారి అలవాట్లు, వలగూడులో వారు చేసే కార్యాచరణకు సంబంధించిన సమాచారం వేల కోట్ల రూపాయల్లో ధర పలకనుంది. వ్యక్తిగత సమాచారం కాని కార్యాచరణ భాగం వాణిజ్య ప్రకటనలు రూపొందించటంలో పెద్ద పాత్ర పోషిస్తుంది. అందువలన భారతదేశంలో భారతీయ భాషలలో వలగూడు వాడుకరులు ఏం చేస్తున్నారా అన్న విషయమై ఆసక్తి అన్ని ప్రముఖ వాణిజ్య సంస్థలకు ఉంది.

మొత్తం మీద వలగూడులో మనం ఆంగ్లానికి ధీటుగా నిలబడాలంటే కావాల్సిన సాంకేతికత ఏనాడో వచ్చి చేరింది. కానీ ఆంగ్లమంత విషయ సమాచారం తెలుగులో వలగూడులో లేదు. పుస్తకాలలో, పత్రికల్లో, క్యాసెట్లలో ఉండిపోయి కుళ్ళి నష్టపోతోంది. అలా దాక్కున్న తెలుగు సమాచారాన్ని తెచ్చి వలగూడుకు చేరిస్తే ఇప్పుడున్న సాంకేతికాల వలన ఇంగ్లీష్‌కు ఏ మాత్రం తీసిపోని భాషగా తెలుగు నిలుస్తుంది. మనకున్న అపార విజ్ఞాన-సాహిత్య సంపదల వలన ఇంగ్లీష్ మన భాష ముందు తెల్లపోవాలి!



ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి

గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

బోధనా మాధ్యమంగా మాతృభాషలు
తూర్పు ఆసియా దేశాల అభివృద్ధి - భారతదేశం

జులై 13-16 మధ్య జరిగిన 13వ అల్టాయిక్ భాషలపై అంతర్జాతీయ సమావేశంలో పాల్గొని ద్రావిడ భాషలూ మంగోలు భాషల జన్య సంబంధాలపై పత్ర సమర్పణ చేయడానికి హైదరాబాదు నుండి తూర్పు ఆసియా దేశాలగుండా వెళ్లవలసివచ్చింది. ఒక విచిత్రం ఏమిటంటే- మన దేశం అభివృద్ధి సాధించాలంటే మన కొంత మంది నాయకుల ప్రకారం మనం కేజీటూపీజీ ఇంగ్లీషులోనే చదవాలి అనే కురచ ఆలోచనలు అక్కడ కానరాలేదు. ఆ సందర్భంలో థాయిలాండ్, తైవాన్, చైనా, కొరియా, మంగోలియా దేశాలు సాధించిన అభివృద్ధిని ప్రత్యక్షంగా చూశాను. ఆయా దేశాలు సాధించిన ప్రగతి ప్రశంసనీయం. 70 ఏండ్ల కిందట ఈ దేశాలు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నవే. పేద దేశాలే. అక్షరాస్యతలో అట్టడుగున ఉన్నవే. పారిశ్రామికీకరణకు నోచుకోనివే. అప్పటికి, పరదేశ దురాక్రమణలకు గురై, వలసవాద ఫ్యూడల్ వ్యవస్థనుండి బయటపడే ప్రయత్నం చేస్తున్న దేశాలే. నేటి ఆ దేశాల ప్రగతి మన భారత దేశ ప్రగతితో పోల్చి చూసుకోవలసినదే. ఈ దేశాలను మనతో పోల్చుకోవడానికి మరో రెండు కారణాలు కూడా చెప్పవచ్చు. ప్రత్యేకంగా, చైనాను కాసేపు పక్కనబెడితే, మిగిలినవాటిని -థాయి లాండ్ (వైశాల్యం 5,13,000 చ.కిమీ., జనాభా 6 కోట్ల 72 లక్షలు), తైవాన్ (35 వేల చ.కిమీ., జనాభా 2 కోట్ల 35 లక్షలు), ద.కొరియా (వైశాల్యం 1,00,210 చ.కిమీ., జనాభా 5 కోట్ల15 లక్షలు) మంగో లియా (వైశాల్యం 15 లక్షల చ.కిమీ., జనాభా 30 లక్షలమంది) తెలుగు రాష్ట్రాలతో (ఆం.ప్ర. వైశాల్యం 1,62,970 చ.కిమీ., జనాభా 4,93,86,799 మంది కాగా తెలంగాణా వైశాల్యం 1,12,077 చ.కిమీ., జనాభా 35,193,978 మంది) పోల్చిచూడడంలో కొంత వరకు సమంజసం అనిపిస్తుంది. దక్షిణ కొరియా, థాయిలాండ్ దేశాలు జనాభాలోనూ భౌగోళికంగాను చారిత్రకంగానూ తెలుగు రాష్ట్రాలతో పోల్చదగినవి. మంగోలియా భౌగోళికంగా పెద్దదేశమైనా జనాభాలో అతి చిన్నదేశమే. ఇక తైవాన్ భౌగోళికంగా చిన్నదైనా జనాభాలో చెప్పుకోదగ్గ దేశమే. అటూ ఇటుగా సమానంగా అంటే, చైనా (135 కోట్ల జనాభా), ఇండియా (125 కోట్లతో) కలిసి ప్రపంచ జనాభాలో 35 శాతంతోనూ భౌగోళికంగా సుమారు 96 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో చైనా, అందులో మూడింట ఒక వంతు భూభాగం గలిగిన ఇండియాలు పోల్చదగినవే.

ఇక అసలు విషయానికి వస్తే ఈ దేశాలు సాధించిన అభివృద్ధి ఏమిటి? వాటితో మనకు పోలిక ఎందుకు? ఇవి 95 శాతం పైగా అక్షరాస్యత సాధించిన దేశాలు: కొరియా (97.90%), థాయిలాండ్ (97.60%), మంగోలియా (97.30%), తైవాన్ (97.15%), చైనా (95.90%), ఇండియా (74%, ఆం.ప్ర. 67.41%, తెలంగాణ 66.46%). ఈ దేశాల అక్షరాస్యత ఆ దేశాల విద్యారంగంలో సాధించిన విప్లవా నికి ప్రతీక. ఇది వాటి పారిశ్రామికీకరణానికీ, ఆర్థికాభివృద్ధికీ, ఎగుమతులే ప్రాధాన్యంగా నడుస్తున్న వాణిజ్యానికీ, హైటెక్, ఎలెక్ట్రానిక్ పరికరాల నిర్మాణానికి నిదర్శనం. ఈ అభివృద్ధికి ప్రధాన కారణం ఏమిటని ప్రశ్నించుకుంటే మనకు వచ్చే జవాబు స్థానిక భాషలలో నడుస్తున్న విద్యావిధానమేనని వారు గర్వంగా చెప్పుకుంటారు. 1940-50 మధ్య ఈ దేశాల అక్షరాస్యత 25% కంటే తక్కువే ఉండేది. అంటే ఆనాడు ఆ దేశాలు మనకంటే తక్కువ అక్షరాస్యతా స్థాయిలోనే ఉన్నాయన్నమాట. **అయితే 1960-90 మధ్య ఆ దేశాలలో వచ్చిన నిశ్శబ్ద అక్షరాస్యతా విప్లవం ఆ దేశాలను ఆర్థికంగా నిలదొక్కుకోటానికి తిరుగులేని పునాది వేసింది. ఐతే, భారతదేశంలో అలాంటి నిశ్శబ్ద అక్షరాస్యతా విప్లవానికి ఉనికీ ఊసూ లేనేలేదు. కారణం రాజ్యాంగం విధించిన విద్యాహక్కును నిర్వీర్యం చేశాం, చేస్తూనే ఉన్నాం. విద్యాబోధనలో మాతృభాషా మాధ్యమాలను పక్కనబెట్టి ఇంగ్లీషు మాధ్యమ విద్యాబోధనతో అందరికీ అందు బాటులో ఉండాల్సిన విద్యను అటకెక్కించేస్తున్నాం.** ఇంగ్లీషు మాధ్యమం తప్పనిసరి, మాతృభాషను ఒక విషయంగా నేర్చుకోవచ్చు అనేవారికి ఈ దేశాలు మాతృభాషలను బోధనా మాధ్యమంగా నిల్పి సాధించిన ఆర్థిక పురోగతి ఒక కనువిప్పు కావాలి.

ఈ రచయిత పైన చెప్పిన అల్టాయిక్ భాషలపై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఆయా దేశాల ప్రొఫెసర్లను 'మీరు మీ యూనివర్సిటీలో మీ స్టూడెంట్సుకు ఇంగ్లీషులో బోధిస్తారా లేక మీ స్థానిక భాషలలో బోధిస్తారా?' అనే ప్రశ్న వేసినపుడు 'కొరియను', 'మంగోలియను' అనో, 'థాయి' అనో లేక 'మాండరిన్' అనో సమాధానం. ఐతే, తరగతి గదిలో విదేశీ విద్యార్థులు ఉన్నప్పుడూ, ప్రొఫెసర్లు విదేశీయు లైనప్పుడూ, ఇంగ్లీషులో బోధన జరుగుతుంది. ఇది ప్రొఫెసర్లకు ఇంగ్లీషు రాక కాదు. ఈ దేశాలలోని చాలా యూనివర్సిటీలలో ఎందరో ప్రొఫెసర్లు విదేశాలలో చదువుకొని వచ్చినవారుగానీ, అక్కడ పనిచేసి వచ్చినవారుగానీ కావటం సర్వసాధా రణమే.ఈ దేశాలన్నింటా ఇంగ్లీషును ఒక ప్రముఖ విదేశీ భాషగా, జ్ఞాన సంధాన భాషగా గుర్తించి ప్రత్యేకంగా నేర్పటం జరుగుతోంది. ఐతే బోధనా మాధ్యమంగా మాతృభాషలనూ స్థానిక భాషలనూ తోసిరాజనడానికి మనవారు పేర్కొన్న కారణాలు వారి అవగాహనా లేమినీ, ఆ వాదనలో కొరవడిన తర్కాన్ని ఎత్తి చూపుతాయి. కొందరు పేర్కొన్నట్లు ఆంగ్ల భాష, ఒక అంతర్జాతీయ భాషగా, బహుభాషలు మాట్లాడే సందర్భా లలో శాస్త్రీయ సమాచార భాషగానూ, 'ఆధునికీ కరణకు చిహ్నం' గానూ వాడుతుండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాల యాల్లో బోధనా మాధ్యమంగా

వాడటంవలననూ, ముఖ్యంగా ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాల్లో భవిష్యత్తులో శాస్త్రీయ జ్ఞానాన్ని పొందే దృష్టితోనూ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో సాంకేతిక పురోగతికి గానూ వాడటంవలన అన్ని దేశాలలోనూ స్థానిక భాషలకు బదులు ఇంగ్లీషును బోధన మాధ్యమంగా అన్ని స్థాయిలలోనూ వాడవలసిన అవసరం కనిపించదు.

ఇక కొందరి వాదన– ఇది విదేశీ విద్యకు వీలు కల్పిస్తుంది. ఏ దేశంలోనైనా ఎంతమంది విద్యకోసం విదేశాలకు వెళుతున్నారు. మరికొంతమంది వాదన, ప్రభుత్వ లేక ప్రభుత్వేతర సంస్థలలో ఉద్యోగ సంపాదన మొదలైనవాటి పురోగతికి సహాయపడుతుంది. ఏదైనా ఒక దేశంలో ఒక ప్రభుత్వ సంస్థలో లేదా ప్రభుత్వేతర సంస్థలో ఉద్యోగం చేయడానికి కావలసిన భాష ఆ సంస్థల స్థానిక అవసరాలను బట్టి ఉంటుంది. ప్రపంచమంతటా ఇంగ్లీషు వాడకాన్ని ప్రోత్సహిస్తున్న బ్రిటిష్ కౌన్సిల్ ఈ మధ్య తెచ్చిన వాదన, దేశాల మధ్య శాంతి భద్రతలకు కూడా ఇది ఉపయోగ పడుతుందట. ఇంతకంటే అశాస్త్రీయ ఆలోచన ఏముంటుంది. చివరిగా, బోధనా మాధ్యమంగా ఇంగ్లీష్ వాడకాన్ని అవలంబిస్తున్న విశ్వవిద్యాలయాలు వారి వ్యాప్తికీ పెరుగుదలకూ ప్రోత్సాహకంగానూ ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మార్కెట్లకు అవసరమైన రీతిలో స్థానీయ విద్యార్థుల శిక్షణావసరాలను తీర్చేందుకూ ఉపయోగ పడుతోంది. ఇది కూడా ఈ మధ్యనే ఇంగ్లీష్ బిజినెస్ మొదలెట్టిన ప్రైవేటు విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు చేస్తున్న వాదన. ఐతే, ఇలాంటి అశాస్త్రీయ ఆలోచనలకు తావివ్వకుండా దేశ ప్రజల మూకుమ్మడి విద్యాబోధనా, అక్షరాస్యతా సాధనే ప్రాతిపదికగా, ప్రజల జీవన అవసరాలను తీర్చేదిగా, ఆర్థిక ప్రగతే ధ్యేయంగా కొరియా, థాయిల్యాండ్, తైవాన్, చైనా, మంగోలియా, మొదలైన దేశాలు అవలంబించిన భాషావిధానాన్ని చూద్దాం :

కొరియా: విద్యారంగంలో భారీ పెట్టుబడులతో, కొరియా సామూహిక నిరక్షరాస్యత నుండి ఒక ప్రధాన అంతర్జాతీయ సాంకేతిక శక్తికి కేంద్రంగా తయారైంది. అత్యంత నైపుణ్యం గల ఉద్యోగులతో ఈ దేశపు జాతీయ ఆర్థిక ప్రయోజనాలు ముడిపడివున్నాయి. ప్రపంచం లోని అత్యంత విద్యావంతులున్న దేశాల్లో ఇది ఒకటి. తృతీయస్థాయి విద్యా డిగ్రీ కలిగిన పౌరులు అత్యధిక శాతం ఉన్న దేశం. ప్రపంచం లోని అధిక విద్యావంతులైన కార్మిక శక్తులు ఉన్న దేశాలలో ఇది ఒకటి. 1945 లో 22% ఉన్న అక్షరాస్యత స్థాయి నుంచి 1970 లో 87.60%కి, ఇక 2017 నాటికి 97.90%కి అక్షరాస్యత చేరుకోవటం కొరియా దేశపు ప్రత్యేకత. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో19.8% విద్యకు ఉపయోగించటం మరో ప్రత్యేకం. ఈ సంవత్సరం, దక్షిణ కొరియా తన 1 కోటి 10 లక్షల మంది విద్యార్థుల విద్యకోసం 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. చదువుకొనే వయసువచ్చిన వారిలో 99% పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందటం సర్వసాధారణం. ప్రాథమిక విద్యలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థీ మధ్య స్థాయికి చేరటమూ అంతే. ఇక ఇక్కడినుండి ఉన్నత పాఠశాలకు చేరేవారు 96.6%. ఆపైన తృతీయ విద్యకు చేరేది 82.8%. అయితే, ఈ విద్యార్థుల్లో 40% మాత్రమే తమ కళాశాల విద్యను పూర్తి చేస్తున్నారు. ఎందుకంటే, వీరిలో 36.50% మంది ఉద్యోగాలలో చేరటం జరుగుతోంది. ఉన్నత డిగ్రీలు లేని, గ్రాడ్యుయేట్లు కానివారి కోసం కూడా పెరుగుతున్న ఉద్యోగ నియామ కాలను ఇది ప్రతిబింబిస్తోంది.

ఎన్నో దక్షిణ కొరియా బ్యాంకులూ బహుళ–జాతీయ సంస్థలూ (శామ్సంగ్, ఎల్.జి, హ్యుందయ్, మరియు ఎస్.కే వంటివి) గ్రాడ్యుయేట్లు కానివారికి ఉద్యోగాల తలుపులు తెరిచాయి. ఉన్నత పాఠశాల విద్యాలయాలకు చెందిన విద్యార్థులకోసం 30,000 ఉద్యోగాలనూ వారు కేటాయించారు. కళాశాల డిగ్రీ లేకుండా అందుబాటులోకి వస్తున్న ఉద్యోగాలతో, దక్షిణ కొరియా తృతీయ విద్యా వ్యవస్థలో 60% డ్రాప్–అవుట్ రేటును చూడటం అసాధారణం కాదు. దక్షిణ కొరియా దేశంలో విద్య సాధారణంగా అన్ని స్థాయిల లోనూ కొరియను భాషలోనే జరపటం సాధారణం. ఐతే ఇప్పుడిప్పుడే అక్కడక్కడ మొదలైన ఇంగ్లీషు మాధ్యమ విద్య (కొన్ని విషయాలలో మాత్రమే) ఎన్నో విమర్శలకు దారితీసింది. కొన్ని చోట్ల ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన యూనివర్సిటీ వైస్–చాన్సలర్లను ప్రభుత్వం ప్రజలనుంచీ వచ్చిన విమర్శలకు తలవంచి పదవులనుండీ తప్పించ వలసి వచ్చింది.

ఇటీవలే, ప్రతిష్ఠాత్మక కొరియను యూనివర్సిటీలలో ఒకటి, ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 20 శాతం వరకు ఆంగ్లంలో బోధించే కోర్సుల శాతాన్ని పెంచాలంటే తన విశ్వవిద్యాలయానికి 10 సంవత్సరాలు పడుతుంది అని ప్రకటించింది. అంటే, ఆంగ్ల బోధన మాధ్యమంగా ఉపయోగించినట్లయితే చాలామంది విద్యార్థులూ, ఇంకా విద్యార్థుల కంటే ఆచార్యులే ఎక్కువ ఇబ్బందుల పాలవుతారని అక్కడ జరిపిన ఒక సర్వేలో తేలింది. ఒక కారణం, ఎవరికీ తగినంత ఆంగ్ల సామర్థ్యం లేకపోవటం. ఫలితంగా ఆంగ్ల మాధ్యమ తరగతుల నాణ్యత తక్కువగా ఉంటోందట.

ద.కొరియాలో టీవీ కార్యక్రమాలు కొరియనులో ఉండటం సర్వసాధారణమే. అయితే కొన్ని విదేశీ సినిమాలూ, నాటకాలూ డాక్యుమెంటరీలు కొరియను ఉపశీర్షికలతో ఇంగ్లీష్లో ప్రసారం చేయబడుతున్నాయి.

థాయిలాండ్: సామాజిక, ఆర్థిక అభివృద్ధి సూచికల ప్రకారం 'ఆసియాలో గొప్ప అభివృద్ధిని సాధించిన దేశంగా థాయిలాండ్ ఎన్నో విజయగాథల కీర్తి సంతరించుకున్న దేశాలలో ఒకటి' గా ప్రపంచ బ్యాంకుచేత గుర్తింపు పొందింది.

ప్రస్తుతం, థాయిలాండ్లో పెద్ద సంఖ్యలో విద్యాసంస్థలు ఆంగ్ల భాషా బోధనను మొదలుపెట్టాయి. ద్విభాషా పాఠశాలలు ప్రపంచ స్థాయిలోని విదేశీ భాషా నైపుణ్యాల కోసం పెరుగుతున్న డిమాండుకు ప్రతిస్పందనగా వివిధ స్థాయిలలో ఇవి పనిచేస్తున్నాయి.

విద్యా వ్యయం: స్థూల జాతీయోత్పత్తిలో 4.1 శాతం (2009). ప్రతి ఒక్కరూ 12 సంవత్సరాల పాటు ప్రాథమిక విద్యను ఉచితంగా పొందటానికి హక్కు కలిగి ఉంటారని రాజ్యాంగం హామీ ఇస్తుంది, దీన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

తన సొంత భాషనూ లిపినీ నిలుపుకోడానికి, థాయిలాండ్ నిరంతరం అధికారికంగానూ అనధికారికంగానూ థాయి భాషను నేర్చుకోవడాన్ని ప్రోత్సహిస్తోంది. థాయ్లాండ్, ఆసియా దేశాలలో కెల్లా అత్యధిక స్థాయిలో క్రియాత్మక అక్షరాస్యత గలిగిన దేశాలలో ఒకటి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోకెల్లా అత్యధిక తలసరి ప్రచురణ ఖర్చు చేస్తున్న దేశం. 1982 లో 5,645 పుస్తకాలు ప్రచురించబడ్డాయి. 70 లక్షలకు పైగా రేడియో రిసీవర్లు, 8,30,000 టెలివిజన్లు, 69 రోజువారీ వార్తాపత్రికలూ 175 పత్రికలూ ఉన్నాయి. ఆంగ్ల-భాషా బెస్ట్-సెల్లర్స్ లేదా 'ఏది ఎట్లా' లాంటి పుస్తకాలకు తరచూ థాయి-భాషలో అనువాద పాఠకులు విస్తృతంగా ఉండటం సాధారణమే. దేశీయ మార్కెట్‌లో 60 శాతం ఉన్న కేల్డ్ థాయ్ అనే ప్రచురణ సంస్థ, ప్రతి నెలా 80,000 మరియు 1,20,000 ప్రతులను పంపిణీ చేసింది.

థాయి భాష, థాయిలాండ్ దేశపు అధికారిక భాష. దైనందిన సమాచార ప్రసార మాధ్యమాలలోనూ, విద్యా బోధనలోనూ ప్రతి ఒక్కరూ వాడేది ఉపయోగించేది థాయినే. ఆంగ్ల భాష ప్రాభవం పెరుగుతున్నప్పటికీ, మొదటినుంచీ ఉపయోగిస్తుండడంవలన థాయి భాషే విశ్వవిద్యాలయాలలో బోధనామాధ్యమంగా ప్రాధాన్యతా స్థానంలో ఉంది. ఐతే, ఆధునిక అవసరాలకు తోడుగా థాయిలాండ్ పాఠశాలల్లో ప్రధాన అంశంగా ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించి వివిధ స్థాయిలలో తప్పనిసరి విషయంగా నేర్పేందుకు అన్ని రకాల వ్యవస్థలనూ సమకూర్చుతోంది.

చైనా: చైనాలో ఇంగ్లీషు వాడకంపై చేసిన పరిశోధనా వివరాలను బట్టి చూడగా చైనాలో, అవసరమైన కొద్ది మంది మాత్రమే కొన్ని సందర్భాలలో మాత్రమే ఇంగ్లీషు వాడుతున్నట్లు తెలుస్తోంది.

2000 సంవత్సరంలో వెలువరించిన చైనా జనాభా లెక్కల ప్రకారం షుమారు 39 కోట్ల మంది ఇంగ్లీషు నేర్చినవాళ్లు ఉన్నారు. చైనాలో సెకండరీ స్థాయి విద్య చదివేవారు తప్పనిసరిగా ఇంగ్లీషు, రష్యను, జాపానీ, స్పానిషు, అరబిక్, ఫ్రెంచి లాంటివాటిలో ఏదో ఒక విదేశీ భాషను చదవాలి. వీరిలో ఇంగ్లీషు చదివినవారు 85-90% వరకూ ఉంటారు. అలా ఇంగ్లీషును చదివినవాళ్లే ఈ 39 కోట్లమంది. అంటే చైనాలో ఇంగ్లీషును మౌలికంగా ఒక విదేశీ భాషగా, సెకండరీ స్థాయిలో చదవాలి.

ఐతే వీరి ఇంగ్లీషు ప్రావీణ్యాన్ని అంచనా వేయగా వీరిలో ఇంగ్లీషును ధారాళంగా మాట్లాడగలిగినవారు 5.30% మంది కాగా 15% మంది మాత్రమే కొంత మేరకు ఇంగ్లీషును మాట్లడగలిగిన వారు. ఇక ఇంగ్లీషులో గ్రంథాలూ పత్రికలూ చదివి అర్థం చేసుకో గలిగినవారు 3.25% మాత్రమే. ఇక పోతే, వీరిలో దాదాపు 15% మంది మాత్రమే తరుచుగా ఇంగ్లీషును వాడేవాళ్లు, 60-70% మందికి ఎప్పుడోగానీ ఇంగ్లీషువాడే అవసరం కలగదు.

తైవాన్: 2003 లెక్కల ప్రకారం తైవాన్ అక్షరాస్యత 97.15%. అక్కడి చదువులన్నీ మాండరిన్ భాషా మాధ్యమం ద్వారానే. అది సాధించిన పారిశ్రామిక ప్రగతి స్థానిక భాషలతోనే జరిగింది. ఐతే ఆధునిక ప్రపంచీకరణలో భాగంగా స్కూలు బైట 'బుషిబన్లు' అనే పేరుతో ప్రైవేటుగా ఇంగ్లీషును ట్యూషన్లద్వారా నేర్చుకోవడం సర్వసాధారణం. అంటే సంగీతం, చిత్రలేఖనం లాంటి ఇతరత్రా కౌశలాలను నేర్చుకోవడంలో ఇదీ ఒక భాగమైంది. 1960 తర్వాత త్వరితగతిన పారిశ్రామికీకరణం చెందుతూ, ఆర్థిక ప్రగతికి బాటలు పరుచుకున్న తైవాన్ 1980-90 సంవత్సరాలమధ్య హైటెక్ ఎలక్ట్రానిక్ పరికరాల నిర్మాణంద్వారా విశ్వవ్యాప్తంగా గొప్ప ఆర్థిక శక్తిగా నిలిచింది. ఇదంతా స్థానికభాషల వాడకంద్వారానే సాధ్యమయింది.

మంగోలియా: 30 లక్షల జనాభా కలిగిన దేశం, 97.30% అక్షరాస్యతతో స్థూల జాతీయోత్పత్తి సుమారు లక్ష కోట్లకు పైమాటే. విశ్వవిద్యాలయాలలో ప్రత్యేకంగా తప్పించి అన్నింటా మంగోలియను మాధ్యమమే. ప్రతిచోటా వినపడేదీ కనబడేది మంగోలియనే. సాలుసరి వ్యక్తిగత ఆదాయం 2,66, 044.37.

మనలో కొంతమంది అనుకొనేటట్లు, మనదేశం చాలా పెద్ద దేశం, అధిక జనాభా గలిగిన దేశం, అందుకనే మనం అక్షరాస్యత లోనూ అభివృద్ధిలోనూ వెనుకబడి ఉన్నాం అనే వాదనలలో పసలేదు. 70 సంవత్సరాలపాటు దేశాన్ని నడిపించిన నాయకులదీ పాలకులదే ఈ పాపం. వారే ఇంకొక అడుగు ముందుకేసి అనాలోచితంగా స్థానిక, ప్రాంతీయభాషలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. వీరు తూర్పు ఆసియా దేశాల విజయగాథలను అవలోకిస్తే అక్షరాస్యతనూ అభివృద్ధినీ సాధించే ప్రక్రియ మళ్లీ మొదలెట్టవచ్చు.

ఆసియా దేశాలలో అక్షరాస్యత

తూర్పు ఆసియా దేశాలు-భారతదేశం

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

1. ఇంటర్నేషనల్ మానిటరీఫండ్ అంచనా-2016.
2. యునెస్కో య2015 లెక్కలప్రకారం అంచనా
3. 2015-16 స్థూలజాతీయోత్పత్తి లెక్కలప్రకారం అంచనా
4. 2011 జనాభా లెక్కల ప్రకారం
5. 2013 లెక్కల ప్రకారం

అంతర్జాలం వాడకంలో ఆంగ్లంపై ప్రాంతీయ భాషలు విజయం

అంతర్జాలం వాడకంలో ఆంగ్లంపై ప్రాంతీయ భాషలు విజయం సాధించాయి అని ఈ మధ్యనే గూగుల్ నిర్వహించిన ఒక సర్వేక్షణలో వెల్లడయింది. ఎక్కువ మంది భారతీయులు తమ కార్యకలాపాల నిర్వహణకు ఆన్ లైన్ లోకి మళ్ళడంతో హిందీ తదితర ప్రాంతీయ భాషలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ధోరణి మరింతగా లభ్యమౌతున్న ప్రాంతీయ సమాచారం, పడిపోతున్న సమాచార సేవల ధరలూ ఇంకా చౌకైన స్మార్ట్‌ఫోన్ల ఉత్పాదనతోనూ విస్తరిస్తున్న అంతర్జాల సేవలవలనా సాధ్యమవుతోంది.

ఇంటర్నెట్లో ఇంగ్లీష్ భాష యొక్క ఆధిపత్యం ముగిసింది.

తల్లిగర్భంలోనే మాతృభాష నేర్చేది



తల్లి గర్భంలో ఉన్నపుడే అభిమన్యుడు పద్మవ్యూహం గురించి నేర్చుకున్నాడన్నది పుక్కిటి పురాణం కాదేమో. ఎందుకంటే తల్లి గర్భంలో ఉండగానే శిశువు భాష నేర్చుకోవడం ప్రారంభిస్తాడని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కన్సాస్ పరిశోధకులు అంటున్నారు. శిశువులు పుట్టేకంటే ముందు నెలలో మనం ఏవేని రెండు భాషలు మాట్లాడినప్పుడు తేడాను గమనిస్తారట. బయట మనం మాట్లాడుకునే మాటల్ని, ధ్వనుల్ని వింటారట. అలా వేర్వేరు ధ్వనిని విన్నపుడు శిశువు హృదయ స్పందన వేర్వేరుగా ఉంటుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మాగ్నెటోకార్డియోగ్రామ్ (ఎమ్‌సీజీ) ను ఉపయోగించి 24 మంది నిండు గర్భిణులను పరీక్షించామని తెలిపారు.

ఇప్పటకీ ఇంగ్లీష్ భాషను ఉపయోగిస్తున్న కోట్లాది మంది భారతీయులు ఉన్నారు. గూగుల్ ఇండియా, ఆగ్నేయ ఆసియా కార్యకలాపాల ఉపాధ్యక్షుడు రాజన్ ఆనందన్, భారతదేశంలో అంతర్జాలం వినియోగపు తదుపరి దశ గురించి మాట్లాడుతూ 'అంతర్జాలంలోకి వస్తున్న దాదాపు ప్రతి కొత్త వినియోగదారుడూ ఇంగ్లీషేతర వినియోగదారుడే', అంటే సుమారుగా ప్రతి పదిమంది లోనూ తొమ్మిది మంది ఇంగ్లీష్‌లో నైపుణ్యం లేనివారు కాబట్టి అంతర్జాలం వాడుకలో పెరుగుదల అంటే దాదాపుగా ప్రాంతీయ భాషల వాడకంలో పెరుగుదలగా ఉంటోంది.

గూగుల్ అంచనా ప్రకారం 2021 నాటికి, హిందీలో సమాచార వినియోగం ఇంగ్లీష్‌లో వినియోగం కంటే పెద్దదిగా ఉంటుంది. హిందీ ముందుండి నడిపిస్తున్న స్థానిక భాషల అంతర్జాల వినియోగ వేగం, ప్రజలని ఆన్‌లైన్‌లో ప్రపంచానికి పరిచయం చేయడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.

గూగుల్ నిర్వహించిన మరొక అధ్యయనంలో కూడా ఇలాంటి ధోరణే వెల్లడైంది. భారతదేశంలో నేడు 23.40 కోట్ల మంది భారతీయ భాషల వినియోగదారులు ఉండగా, 17.50 కోట్ల మంది మాత్రమే ఆంగ్ల వాడుకదారులు ఉన్నారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో, స్థానిక భాషా వినియోగదారుల సంఖ్య 53.4 కోట్లకు చేరుకోవడానికి సంవత్సరానికి 18% చొప్పున పెరుగుదల కొనసాగుతుంది.

స్థానిక భాషల ఇంటర్నెట్ వాడుకలో సందేశ సేవ (16.90 కోట్లు), డిజిటల్ వినోదం (16.70 కోట్లు), సోషల్ మీడియా (11.50 కోట్లు) ఇంకా ఆన్‌లైన్ వార్తల (10.6 కోట్లు) వంటి సేవలతో నడుస్తోందని అధ్యయనంలో తేలింది.

మొబైల్ పరికరాల ద్వారానే 99 శాతం మంది స్థానిక భాషలను అంతర్జాలం ద్వారా యాక్సెస్ చేస్తారని ఆ అధ్యయనం వెల్లడించింది. మొబైల్ ద్వారా అంతర్జాలంలో సమాచారాన్ని పొందేవారి సంఖ్య 78 శాతం, అని ఆనందన్ అన్నారు.

ఈ పెరుగుదలను కొనసాగించడానికి 3,000 రూపాయలకే మంచి నాణ్యత గలిగిన స్మార్ట్‌ఫోన్లు అవసరమవుతాయి. ఐతే, ఇవి 2,000 రూపాయల కంటే తక్కువకు కూడా దిగిరావాల్సిన అవసరం ఉంది.

హిందీ, తెలుగు, బెంగాలీ, మరాఠీ, తమిళం, కన్నడ, గుజరాతీ ఇంకా మలయాళ భాషల్లో అంతర్జాల వినియోగం ఎక్కువగా ఉంది. బెంగాలీ, తెలుగు, మరాఠీ ఇంకా తమిళ భాషలను కలుపుకొని దేశంలో మొత్తం స్థానిక భాషా వినియోగదారుల సంఖ్య 30% ఉన్నట్లు అంచనా.

స్థానిక భాషలలో అంతర్జాల వినియోగం పేలిపోనున్నది. అయితే ప్రస్తుతం సృష్టించబడుతున్న సమాచారమే తగినంతగా ఉండడంలేదు. అ

కవిత

ఎందుకీ వ్యామోహం

- మందరపు హైమవతి
94410 62732

ఇప్పుడు
పుట్టిన పాపాయిలు
"అమ్మా" అని ఏడిస్తే
ఒప్పుకోరు అమ్మలు
"మమ్మీ" అనే ఆరున్నొక్కరాగం
ఆలపించమంటారు
ఘనత వహించిన
ఆంగ్లమాధ్యమ వ్యాపార పాఠశాలల
యాజమాన్యాలు
మాతృభాషలో మాట్లాడితే
శిక్షిస్తామని భయపెడతారు
అందమైన తెలుగుమాటలున్నా
ఆంగ్లపదాలే ముద్దు
అప్పు చేసైనా
ఆస్తులు తాకట్టు పెట్టయినా
ఆంగ్లమాధ్యమ బడుల్లోనే చేరుస్తారు
"వానల్లు కురవాలి వానదేవుడా" లాంటి
మన సంస్కృతి గీతాలకు స్వస్తిచెప్పి
"రైన్ రైన్ గో అవే" అని
పాశ్చాత్య సంస్కృతికి పట్టం గడతారు.
ప్రవహించే
బాధలనదులకు బొమ్మ కట్టాలన్నా
అర్థవమైన ఆనందాలకు
సంతోషం రంగు అద్దాలన్నా
గుండెల్లో గుచ్చుకొన్న గాయాలకు
అక్షర రూపమివ్వాలన్నా
మనసొక సీతాకోక చిలుకై
ఆనందంగా ఎగిరిపోయే దృశ్యాలకు
వాక్యరూపమివ్వాలన్నా
అమ్మభాషే గదా శరణ్యం
మరెందుకు ఆంగ్లభాషా వ్యామోహం!
ఇరుగు పొరుగు తమిళులు మలయాళీలు
అమెరికాలో అడుగుబెట్టినా
ఆస్ట్రేలియాకే వలస వెళ్ళినా
పొరపాటుననైనా పరభాషలో పలకరు

-డా॥వేదగిరి రాంబాబు
9391343916

ఈ కథానికకు కాళ్ళు లేవు... కళ్ళున్నాయి!

పాఠశాలలో పిల్లల్ని నిశ్శబ్దంగా ఉంచలేని ప్రధానోపాధ్యాయుడు పరంధామయ్య ఆ కోపమంతా తన సెల్‌మీద చూపించి దాన్ని నిశ్శబ్దంచేసి జేబులో పడేసుకున్నాడు.

పడేసుకోగానే అది హఠాత్తుగా జేబులో కదులుతున్నట్లనిపించిందాయనకు.

ఎవరినుంచో పిలుపు వస్తోంది.

ఆ జలగ కదలికకు కారణం అర్థమైంది పరంధామయ్యకు. జేబులోంచి దాన్ని తీసేలోపే "నమస్కారం...." గట్టిగా వినిపించింది.

అది నమస్కారమో, తిరస్కారమో అర్థంచేసుకునే లోపు "నన్ను రమ్మన్నారట" మళ్ళీ గర్జించాడు ఆ తండ్రి.


ప్రక్కనే ఉన్న అతని కొడుకుని చూసిన తర్వాత ఆ తండ్రి ఎవరో? ఆయనను రమ్మని ఎందుకు పిలిచాడో అర్థమైంది పరంధామయ్యకి. ఆ పిల్లవాడిని ఒకటో తరగతిలో తెలుగు మాధ్యమంలో చేర్చడానికి తల్లి తీసుకొచ్చింది.

వెంటనే ధైర్యం తెచ్చుకుని "మీవాడు ఆంగ్ల మాధ్యమమంటే భయపడిపోతున్నాడు" అన్నాడు.

"అవునండి పాఠశాలలో చేరీచేరకముందే వణికిపోతున్నాడు. నేనూ పెద్ద చదువుకున్నవాణ్ణి కాదు, ఆడిని ఆంగ్లమాధ్యమానికి సిద్ధంచేయడానికి.."

అతని మాటల్ని మధ్యలో తుంచివేస్తూ "మీకన్నా మీవాడు ఇంకా ఎక్కువ చదవాలి. వాడి భవిష్యత్తు ఇంకా బాగుండాలనే, వాణ్ణి ఆంగ్ల మాధ్యమంలో చేర్చమని చెప్పాను" అలా ఆయన నోటి నుంచి అప్రయత్నంగా మాటలు వచ్చినా ఎందుకో గుండె బద్దలవుతున్నట్లనిపించింది. ఆయన మాటలు ఆయనకే వెగటు వేసాయి.

"మీరు ఆంగ్లం... ఆంగ్లం అనేసరికి వాడు భయపడిపోయాడు సారూ! పాఠశాలకి వెళ్ళనని మొరాయిస్తున్నాడు.



బలవంతాన లాక్కొచ్చా. వాడి తల్లి కూడా పిల్లాడు భయపడిపోతున్నాడు. పంతులు గారితో కాస్త నచ్చజెప్పి తెలుగు మాధ్యమంలోనే చేర్చమంది...." కొడుకు అప్పజెప్పాల్సిన పాఠాన్ని బట్టీపట్టి తండ్రి అప్పజెప్పినట్లు అనిపించింది పరంధామయ్యకి.

కావాలనుకున్నా బద్దలవ్వని ఆయన గుండె ఆయనకి ఎదురు తిరిగింది. దానిని జోకొట్టడానికి "మీ ఇష్టం" అన్నాడు అయిష్టంగా... కాదు, ఇష్టంగా.

"నాదో చిన్న సందేహం. పంతులుగారూ పిల్లలందర్నీ ఆంగ్ల

మాధ్యమంలో చేరమని మీరు పోరుతుంటే మీ పాఠశాలకు పిల్లలు రావడం తగ్గిపోదూ? దాంతో మీరు పాఠశాలను మూసేసుకోవలసిన పరిస్థితులు రావూ?" ఆ తండ్రి ప్రశ్నతో పరంధామయ్యకి భవిష్యత్తు తల్లక్రిందులవుతున్నట్లు, తమ పాఠశాల మూతపడుతున్నట్టు భయమేసింది.

జేబులో మళ్ళీ జలగ వేగంగా కదులుతున్నట్లనిపించింది. అది జేబులో కాక తన మెదడులో తిరుగుతున్నట్లు కంగారు పడుతూ "వెళ్ళండి. ఫీజు కట్టేయండి. మీవాణ్ణి తెలుగు మాధ్యమంలోనే చేర్చండి" ఈసారి పాఠం తను అప్పజెప్పినట్లనిపించింది పరంధామయ్యకి.

ఆ తండ్రి తన పిల్లవాడితో వెళ్ళిపోవడం, జేబులో జలగ కదలికలు ఆగిపోవడంతో తెప్పరిల్లాడు పరంధామయ్య.

ఇంతలోనే మరో తండ్రి తన పిల్లవాణ్ణి తెలుగు మాధ్యమంలోనే చేర్చుకొమ్మని బ్రతిమాలడానికి వచ్చాడు.

మళ్ళీ జేబులో జలగ కదులుళ్ళు!

ఆ తండ్రిని సమాధానపరచి పంపేలోపే జేబులో జలగ కదలడం ఆగిపోయింది.

తెలుగువాడైపుట్టి తెలుగు దేశంలో తెలుగు మాధ్యమంలో మీ పిల్లల్ని చేర్చవద్దని చెప్పినప్పుడల్లా అమ్మని ఇంట్లోంచి తోసివేస్తున్నట్లే అనిపించసాగింది పరంధామయ్యకి.

మళ్ళీ ఆయన జేబులో జలగ కదలసాగింది.

సెల్ తీసాడు.

దానిమీద కనిపించిన నెంబరుని చూడగానే గుండె ఝల్లుమంది.

చటుక్కున దాన్ని నొక్కబోయి నాలుక కరుచుకున్నాడు. ఆ పిలుపుని ధైర్యంగా స్వీకరించాలనుకున్నాడు. అధైర్యంగానే చెవిదగ్గరకి సెల్‌ని చేర్చి "హల్లో..." అన్నాడు నీరసంగా.

"ఏమయ్యా! ఏమిటి నీ ధైర్యం! ఎంతసేపటి నుంచి నేను ఫోన్ చేస్తున్నాను... ఎత్తవెందుకు?"

ఫోన్లోనే పిడుగులు పడుతున్నట్లు వణికిపోసాగాడు పరంధామయ్య.

"మాట్లాడేటప్పుడే అతి వినయాలెందుకు? ఫోన్ రాగానే ఎత్తు. చాలు!"

"ఎవరో..." ఆయనేదో చెప్పేలోపే "పాఠశాలన్న తర్వాత పిల్లల్లో, తల్లిదండ్రులలో వస్తూనే ఉంటారయ్యా... ప్రధానోపాధ్యాయుడివి వాళ్ళనీ సమర్థించుకోవాలి, నాలాంటివాళ్ళు చేసే ఫోన్లని ఎత్తాలి. ఫోన్లోంచి పిడుగులుపడుతూనే ఉన్నాయి. తన కర్ణభేరి పగిలి తను చెవిటివాడెందుకు కావడంలేదో అర్థంకావడంలేదు పరంధామయ్యకి.

"అవునూ! ఇంకా మీ పాఠశాలలో తెలుగు మాధ్యమంలో అంతమంది పిల్లల్ని చేర్చుకుంటున్నావెందుకు?... ఎదురు జవాబు చెప్పకు. తెలుగు మాధ్యమంలో చేరాలని వచ్చిన వాళ్ళందరితోనూ 'తెలుగు మాధ్యమంలో చదివితే భవిష్యత్తు శూన్యమ'ని నచ్చజెప్పి ఆంగ్లమాధ్యమంలోకి మార్చు.... ఏంటయ్యా అమ్మభాషని అంత మాటలనలేవా? అయితే రెడీగా ఉండు. దేనికంటావేమిటయ్యా... నీ చేతగానితనానికి బహుమతిగా వచ్చే బదిలీకోసం ఎదురుచూడు... నన్ను బ్రతిమాలితే కుదరదయ్యా.... గురజాడ అన్నట్లు వట్టి మాటలు కట్టిపెట్టు..." చెవిలో పిడుగులు పడడం ఆగింది.

పరంధామయ్య మండిపడ్డాడు ఆ అధికారిమీద. ఫోన్లో కాదు–

"తెలుగులో పుస్తకాలెప్పుడు వస్తాయండి?"

"అతి త్వరలోనే! కానీ వాటిని పిల్లలకివ్వకూడదు. స్కూల్‌లోనే ఉంచాలి" అవతల నుంచి..

"అదేమిటండి..." అర్థంకాలేదు పరంధామయ్యకు.

"ఏముంది? ఇంగ్లీష్ పుస్తకాలని అర్థంచేసుకోలేని పిల్లలకు తెలుగు పాఠాలు చూపించి అర్థమయ్యేట్టు చెప్పాలి. తెలుగు మాధ్యమంలో చేరాలనుకునేవాళ్ళకి కౌన్సిలింగ్ జరిపి ఆంగ్లమాధ్యమంలోకి మార్చాలి. లేకపోతే ట్రాన్స్‌ఫర్" ఫోన్ పెట్టేసిన చప్పుడు.

పరంధామయ్య జావకారిపోయాడు.

ఈ ట్రాన్స్‌ఫర్ బెదిరింపులేమిటి? తనే రాజీనామా చేయాలనుకున్నాడు.

కనిపించని ఫోన్ బయట! తెలుగు భాష పనికిరాదు గాని తెలుగు కవులమాటలు కావాలిట!

"ఏంటి జవాబు లేదు... మనసులో నన్ను తిట్టుకుంటూ మాట్లాడడం మరచిపోయేవా?"

"కాదండి..." నసిగాడు పరంధామయ్య.

మళ్ళీ ఉరుములు, పిడుగులు....!!

"పిల్లలు ప్రయివేట్ స్కూళ్ళలో చేరకుండా మనస్కూళ్ళలో చేరాలంటే ఇంగ్లీష్ మీడియమ్ లాంటి హంగామా మనకీ తప్పవు... అవునూ! పొద్దున స్కూల్ వేళలకు ఓ గంటముందు సాయంత్రం స్కూలైపోగానే మరో గంట కెరీర్ ఫౌండేషన్ కోర్స్‌లను నిర్వహిస్తున్నారా? అందుకు తగ్గ పారితోషికం ఉంటుందని ఉపాధ్యాయులకు ఆశ చూపించండి. మెరికల్లాంటి విద్యార్థుల్ని మరింత సానబట్టి 'అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్స్ స్కూల్'లో చేర్పిద్దాం. అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేసే శిక్షణని అప్పుడు తేలికగా పొందవచ్చని తల్లిదండ్రులకు ఆశ చూపండి... ఏంటి గొణుగు తున్నావ్? ఇందుకు మన దగ్గర సమర్థులు లేరంటావా? అప్పుడు సమర్థుల దగ్గరికే పంపిద్దాం. లేకపోతే ఆ సమర్థులనే మన స్కూల్‌కు పిలిపించి మన ఉపాధ్యాయులకు శిక్షణనిద్దాం. అనవసరమైన సందేహాల్ని నువ్వే లేవదీయక. చెప్పినట్లు నడుచుకో... లేకపోతే ట్రాన్స్‌ఫర్ అర్డర్సే నీ దగ్గరకు నడుచుకుంటూ... కాదు పరుగెత్తు కుంటూ వస్తాయి. ఫోన్ కట్ చేసాడు, కట్ అయిందో లేదో అర్థంకాలేదు పరంధామయ్యకి! వెంటనే మళ్ళీ మోగకుండా చటుక్కుని దాన్ని ఆపేశాడు.

ఆ కంగారు పాఠశాలలోను, ఇంటికి వచ్చిన తర్వాత కూడా తగ్గలేదాయనకు.

"మీ ఫోన్ ఆఫ్ చేసి ఉందట. అబ్బాయి ఇంటికి ఫోన్‌చేసాడు..."

"నేను ఉద్యోగం మానేసి ఇద్దరం వాళ్ళింటికే వచ్చి ఉంటామని చెప్పాల్సింది..." అధికారిమీది కోపాన్ని భార్య మీద చూపించాడు పరంధామయ్య.

"ఏడ్చినట్లే ఉంది. మనవణ్ణి వచ్చే సంవత్సరం బడిలో వేస్తారట. అందుకు వాడికి ఇంగ్లీష్‌లో మాట్లాడడానికి వీలుగా ఓ చిన్న బడిలో

వేసారట. కోడలు కూడా ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్‌లో చేరిందిట! "బుగ్గలు నొక్కుకుంటూ రాగాలు తీస్తూ చెప్పుకుపోతున్న భార్యమీదా ఆయనకి కోపం వచ్చింది.

"నాకు ఆకలిగా లేదు. తలనొప్పిగా ఉంద"ని అన్నంకూడా తినకుండా పడుకున్నాడు పరంధామయ్య.

చాలాసేపటివరకూ నిద్ర పట్టలేదు. ఎప్పుడో, ఏ అర్ధరాత్రో కునుకు పట్టింది.

"ఏమండీ! మనవడితో మాట్లాడడానికి నేనూ ఇంగ్లీష్ నేర్చుకుంటానండి. వాడికి 'చందమామ రావె' చెప్పగూడదట... 'రెయిన్ రెయిన్ గో ఎవే' అని చెప్పాలిట" కలలో భార్య బ్రతిమ లాటలతో ఉలిక్కిపడిలేచాడు పరంధామయ్య.

"ఏంటండీ... మీ పరిస్థితి చూసి నేను నిద్రపోకుండా కూర్చున్నాను... ఎందుకిలా ఉలిక్కిపడి లేచారు?" భర్త వంకే చూస్తూ భార్య బాధగా అంది.

"రేపే నేను నా ఉద్యోగానికి రాజీనామా చేస్తాను. అబ్బాయి దగ్గరకు వెళ్ళిపోదాం"

"అలాగే పడుకోండి" అంటూ వాగ్వివాదంలోకి దిగకుండా భార్య సముదాయించేసరికి పరంధామయ్యకి భయం తగ్గి నిద్రపోయాడు పరంధామయ్య.

మళ్ళీ సూర్యుడితోబాటే లేవడం...

ఉరుకులు, పరుగులు...

ఎనిమిది గంటలకల్లా పాఠశాల చేరుకున్నాడు. శుభవార్త!

"మాస్టారూ... స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, టెక్స్ట్‌బుక్ ప్రెస్ డైరెక్టర్‌కి తెలుగు మాధ్యమ పుస్తకాలు త్వరగా కావాలని రాసారట. బహుశా ఆంగ్లమాధ్యమంతోబాటు తెలుగు మాధ్యమాన్ని ఉంచుతా రేమో!" పిల్లలకు పాఠాలు చెప్పడంకన్నా తమ శ్రేయస్సుకి పాటుపడే ఓ యూనియన్‌లో చాలా హుషారుగా పనిచేసే రాజారావు మాస్టారు చెప్పిన మాట మధుర సంగీతంలా వినిపించింది పరంధామయ్యకు. కొడుకు దగ్గరకు వెళ్ళిపోనక్కర్లేదు అనుకున్నాడు.

ఇంతలో జలగ జేబులో కదిలింది.

చటుక్కున బయటకు తీసేసాడు.

నెంబరు చూడగానే చెవిదగ్గరకు చేర్చాడు ఫోన్‌ని. హుషారుగా తనే ముందు మాట్లాడడం మొదలుపెట్టాడు పరంధామయ్య "తెలుగులో పుస్తకాలెప్పుడు వస్తాయండి?"

"అతి త్వరలోనే! కానీ వాటిని పిల్లలకివ్వకూడదు. స్కూల్‌లోనే ఉంచాలి" అవతల నుంచి..

"అదేమిటండి..." అర్థంకాలేదు పరంధామయ్యకు.

"ఏముంది? ఇంగ్లీష్ పుస్తకాలని అర్థంచేసుకోలేని పిల్లలకు తెలుగు పాఠాలు చూపించి అర్థమయ్యేట్టు చెప్పాలి. తెలుగు మాధ్యమంలో చేరాలనుకునేవాళ్ళకి కౌన్సిలింగ్ జరిపి ఆంగ్లమాధ్యమంలోకి మార్చాలి. లేకపోతే ట్రాన్స్‌ఫర్" ఫోన్ పెట్టేసిన చప్పుడు.

పరంధామయ్య జావకారిపోయాడు.

ఈ ట్రాన్స్‌ఫర్ బెదిరింపులేమిటి? తనే రాజీనామా చేయాలను కున్నాడు.

జేబులో జలగ కదిలింది. అధికారేమోనని చటుక్కున ఎత్తాడు. కొడుకు!

"నాన్నా అనుకోకుండా మీ కోడలు ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్‌లో చేరడం, అబ్బాయిని నర్సరీలో చేర్చడంతో ఈ నెల ఖర్చెక్కువైంది. ఓ రెండు వేలుంటే పంపుతారా? దీనంగా కొడుకడిగేసరికి కాదనలేకపోయాడు.

"అలాగే పంపిస్తాను" అన్నాడు, రిజైన్ చేయాలనే కోరికని తాత్కాలికంగా వాయిదా వేసుకుంటూ. మనసులోనే మాతృభాషకి క్షమాపణలు చెప్పుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు పరంధామయ్య!

వారం తిరక్కుండానే అధికారి నుంచి మరో వర్తమానం "ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులందరూ వెంటనే మీ దగ్గరున్న తెలుగు మాధ్యమ పుస్తకాలను మాకిచ్చి ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు పట్టుకెళ్ళండి" అంటూ.

ఇంతలోనే ఆయన దగ్గరకు కొందరు ఉపాధ్యాయులు వచ్చారు "అక్షరాలు నేర్వని ఒకటో తరగతి విద్యార్థులకు ఆంగ్లంలో అర్థమయ్యేట్టు పాఠాలు చెప్పాలి" అంటూ.

అయోమయంతో కళ్ళు మూసుకున్నాడు పరంధామయ్య. పిల్లలందరూ గొర్రెలుగా మారి పాఠశాలకి వస్తుండడం.... తామంతా కసాయి వాళ్ళలా కత్తులు పుచ్చుకుని కనిపించడంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఉపాధ్యాయులందరూ ఆశ్చర్యంగా తననే చూస్తున్నారు. "రేపు మీటింగ్ పెట్టుకుందాం" నీరసంగా కుర్చీలో కూలబడ్డ తర్వాత అర్జంటుగా రాజీనామా చేసేయాలనే ఆలోచన తిరిగి ఆయన మెదడుని తొలవసాగింది....

రానున్న సంచికలో చదవండి:
బతుకు బడి భాషోద్యమకథ.
రచన: కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్

తెలుగులో రిపబ్లిక్ టీవీ వారి వలగూడు

ఇటీవల అర్నబ్ గోస్వామి మొదలుపెట్టిన వార్తావాహిని (సద్దుల వెల్లువ) – రిపబ్లిక్ టీవీ, తెలుగు – ఇతర భారతీయ భాషలకు విశేష గౌరవాన్ని ఇచ్చింది. ఆంగ్ల పత్రికలు, ఆంగ్ల న్యూస్ ఛానళ్ళు భారతీయ భాషలకు ముందునుంచే మర్యాద నివ్వలేదు. జాతీయస్థాయి వార్తైతే అసలు ఇక్కడి వార్తలను పట్టిం చుకోరు కూడా! అలాంటి తరుణంలో ఒక జాతీయ ఆంగ్లన్యూస్ ఛానల్ (సద్దుల వెల్లువ) తెలుగులో కూడా వార్తలను వలగూడు ద్వారా అందిస్తోంది.

ప్రస్తుతానికి అనువాదం కొంచెం ఇబ్బందిగా ఉన్నా, ఇది నిజంగా మెచ్చుకోదగ్గ విషయం. తెలుగువారు తెలుగులో వలగూడును ఎంత ఎక్కువ వాడితే తెలుగు అంత మెఱుగవుతుంది.

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

ఏ వెలుగులకీ ప్రస్థానం?


కన్నడభాషకొచ్చినన్ని జ్ఞానపీఠ బహుమానాలూ, సరస్వతీ సమ్మాన్ పురస్కారాలూ, కన్నడ సినిమా కొచ్చినన్ని జాతీయ బహుమతులు తెలుగు సాహిత్యానికీ, తెలుగు సినిమాకు రాలేదని మనం వాపోతూ వుంటాం. తెలుగులో దాదాపు 10మంది గొప్ప సాహితీమూర్తులకు జ్ఞానపీఠాలు వచ్చివుండాలి. రాకపోవడం జ్ఞానపీఠ, సరస్వతీ సమ్మాన్‌లకే లోటని మనల్ని మనం వూరడించు కుంటూ వుంటాం. జాతీయ పురస్కార స్థాయిని మన చలన చిత్రాలు ఎప్పుడూ చేరలేదు. వీటికున్న అనేక కారణాలతో సరైన పాఠక వర్గమూ, ప్రేక్షకులూ తెలుగులో లేరనే వాస్తవాన్ని గూడా మనం గుర్తించితీరాలి. తమిళ, కన్నడ, మలయాళీ ప్రజలకున్నంతగా భాషపైనా, సంస్కృతిపైనా, సాహిత్యంపైనా మన తెలుగు వాళ్ళకు గౌరవాభిమానాలు లేకపోవడానికి కారణాలేమిటో తెలుసుకోగలగాలి.

గత మూడునెలలుగా నేను కన్నడ నవలలు, సినిమాలూ, టీవీ సీరియల్లుగా మారిన కన్నడ నవలల ప్రపంచంలో మునిగి తేలుతున్నాను. యీ వుత్సుకతను నాకు కలిగించిన నవలపేరు 'పర్వ'. రచయిత పేరు యస్.యల్. భైరప్ప.


తెలుగువాళ్ళకు, అందులోను వొకప్పటి వుత్తర ఆర్కాటు జిల్లాకు చెందిన నాబోటివారికి, మహాభారతానికి సంబంధించిన సర్వమూ ఆత్మీయమైన వుత్సుకతను రేకెత్తించే అంశమే! భైరప్ప రాసిన 'పర్వ' 1979లోనే వచ్చిన కన్నడ నవల. అయితే తెలుగులోకి తర్జుమా అయి, కేంద్రసాహిత్య అకాడమీ చేత ప్రచురించబడి, నాబోటివారికి దగ్గరకావటానికి దాదాపుగా మూడు దశాబ్దాలకాలం పట్టింది. గంగిశెట్టి లక్ష్మీనారాయణగారి తెలుగు అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీవాళ్ల అనువాద పురస్కారం రావడం అరుదుగా జరిగే మంచి పనుల్లో వొకటి. ఆ నవల అంతా బాగా తెలుగువాళ్లకు దగ్గరవడానికి లక్ష్మీనారాయణగారి కృషికూడా కారణమే!

దాదాపుగా రెండేళ్ల క్రితమే 'పర్వ'ను చదివాను. దాని శైలీ, శిల్పం, పాత్ర చిత్రణ వంటి అంశాలను జాగ్రత్తగా అధ్యయనం చేయడం కోసమన్నట్టుగా, ఆ నవలను గడచిన వేసవి సెలవుల్లో మళ్లీ చదివాను. వుద్దేశం లోనూ, దాని ఆవిష్కరణలోనూ 'పర్వ' లాగా విజయవంతమైన నవలలు చాలా తక్కువ. మహాభారత కాలాన్నిగురించిన రచనలను (ముఖ్యంగా చరిత్రను) అధ్యయనం చేసి, భారతం జరిగిన స్థలాలనంతా సందర్శించి, నిజంగా మహాభారతం యిలాగే జరిగి వుంటుందనిపించేలా రాసిన సాంఘిక చారిత్రక నవలగా భైరప్ప దాన్ని రూపొందించాడు.

ఆ నవలను చదివాక భైరప్పగారి యితర రచనల్ని గూడా చదవాలనిపించింది. కేంద్ర సాహిత్య అకాడమీవాళ్లే అనువదింపజేసి ప్రచురించిన 'దాటు' అందుబాటులోనే వుంది. అదెందుకో అంతగా రుచించలేదు. అప్పుడే "వంశవృక్షం" అనే పాత సినిమా గుర్తు కొచ్చింది. దాని మూలకథ భైరప్పగారిదేనని గూడా జ్ఞాపకం వచ్చింది. సరిగ్గా అదే సమయంలో యేదోపనిపైన విజయవాడ వెళ్ళినప్పుడు అక్కడి ప్రసిద్ధమైన పాత తెలుగు పుస్తకాల అంగడిలో అదృష్టవశాత్తు 'వంశవృక్షం' పాతపుస్తకం దొరికింది. 1971లో సనగరం నాగభూషణం



యస్.ఎల్.భైరప్ప



పర్వ(కన్నడ)

గారనే మదనపల్లెలోని బిసెంట్ తత్వజ్ఞాన కళాశాలలో భౌతికశాస్త్ర వుపన్యాసకుడు అనువాదం చేసిన పుస్తకమది. ఆ పుస్తకం చదివాక 'వంశవృక్షం' సినిమాకోసం ప్రయత్నం చేశాను. యూట్యూబ్‌లో కన్నడ మాతృక మాత్రమే దొరికింది. తెలుగు సినిమా దొరకలేదు. కన్నడ సినిమానే చూశాను.

భైరప్ప 'వంశవృక్ష' నవల కథాకథనంలోనూ, పాత్ర చిత్రణలోనూ ఆనాటి సంప్రదాయ మౌఖిక లక్షణాలతో రాసిన నవల. అయితే దాన్ని బి.వి. కారంత్, గిరీశ్ కర్నాడ్ దర్శకులుగా చిత్రీకరించిన తీరు అద్భుతంగా వుంది. వొక నవలను చిత్రంగా మలచడమనే ప్రక్రియ ఎలావుండాలో ఆ సినిమాను చూస్తే అర్థమవుతుంది. సినిమాకోసం వాళ్ళు చేసిన మార్పులు మూలకథకు మెరుగులు దిద్దేలా వున్నాయి.

తర్వాత భైరప్పగారిని గురించి తెలుసుకుందామని ప్రయత్నంచేస్తే యూట్యూబ్‌లోనే చాలా యింటర్వ్యూలు దొరికాయి. అవన్నీ పూర్తిగా సాహిత్య ధోరణులను గురించిన యింటర్వ్యూలు. 'వంశవృక్ష' నిర్మించి 50 సంవత్సరాలు గడచినప్పుడు, ఆయనకు 'సరస్వతీ సమ్మాన్' వచ్చినప్పుడు, 'ఆవరణ' అనే ఆయన సంచలన నవల వెలువడినప్పుడు, యిటీవలే 'వుత్తరాయణ' అన్న ఆయన రామాయణ ఆధునీ

కరణ నవల ప్రచురించబడినప్పుడు జరిగిన యింటర్వ్యూలవి. ఆ 'ముఖాముఖి'లలో భైరప్పగారు నిర్ద్వంద్వంగా మార్క్సిస్టులనూ, కమ్యూనిజాన్నీ వ్యతిరేకించిన తీరూ, ఆయన సాహిత్య వ్యక్తిత్వమూ ఆశ్చర్యాన్నే కలిగించింది. మొదటి నుంచీ కమ్యూనిస్టు ప్రభావంలో వుంటూ, పీడితులూ బాధితుల పక్షం వహిస్తూ, రకరకాల వామపక్ష వుద్యమాలతో స్ఫూర్తిని పొందిన నావంటి తెలుగు రచయితలకాయన అభిప్రాయాలు చీకాకును కలిగిస్తాయి. యిప్పుడు నేను చెప్పబోతున్నది ఆ నవల వస్తువుల్ని గురించీ, ఆ రచనల తాత్త్విక నేపథ్యాన్ని గురించీ కాదు.

భైరప్పగారి సాహిత్య జీవితాన్ని గురించి యింటర్నెట్ ద్వారా, కన్నడ మిత్రుల ద్వారా నేను తెలుసుకున్న విషయాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. భైరప్పగారి నవలలన్నీ పెద్దవే! ఆయనకు సరస్వతీ సమ్మాన్ తెచ్చిపెట్టిన 'మంద్ర' నవల 654 పేజీల నవల. దాటు, ఆవరణ, తంతు మొదలైన నవలలన్నీ దాదాపుగా అంతే పెద్దవే. ఆయన నవలలన్నీ దాదాపుగా 10 ముద్రణలకు పైగానే వచ్చాయి. ఆయన నవల రాబోతోందీ అన్న వార్త వచ్చాక, ప్రచురణకు ముందే రెండు ముద్రణల ప్రతులు అమ్ముడైపోతాయట! ఆయన నవలలు కొన్ని సినిమాలుగా గూడా వచ్చి కన్నడ భాషకు జాతీయ బహుమతులను గూడా తెచ్చిపెట్టాయి.

ఆయన నవల 'గృహభంగ'ను ప్రముఖ కన్నడ దర్శకుడు గిరీష్ కాసరవెల్లి టీవీకోసం 75 భాగాల సీరియల్‌గా నిర్మించాడు. ఆ నవలలోని ప్రధాన వస్తువు వో గ్రామంలో, వో గ్రామకరణం కుటుంబంలో గయ్యాళి అత్తగారు, బుద్ధిమాంద్యపు భర్త, పోకిరి మరిదీ వున్న యింట్లో, కోడలుగా వచ్చిన అమ్మాయి సంసారాన్ని వుద్ధరించడంకోసం పడ్డపాట్లు. కూలిన గోడలు, చెదలుపట్టిన తావులూ వుండే యిండ్లు, తిండీ గుడ్డలకు ముఖం వాచిపోయే గ్రామీణులు, నాగరికత ఆనవాళ్లే తెలుసుకోలేని గ్రామాలూ– యిటువంటి జీవితాన్ని నవలగా రాయడమే కష్టం. అటువంటి జీవితాన్ని టీవీకోసం సీరియల్‌గా రూపొందించడం మరీ సాహసం.అయితే గిరీష్ కాసరవెల్లి ఆసీరియల్‌ను రసవత్తరంగా రూపొందించారు. పాత్రధారులంతా తమతమ పాత్రల్లో జీవించారు. నవలకంటే సీరియల్ గొప్పగా వుందని విమర్శకులన్నారట! అందులో అతిశయోక్తి లేదు. (ఆ సీరియల్ నిర్మాత ప్రముఖ కన్నడ, తెలుగు చిత్రాల నటి సౌందర్య). ప్రముఖ కన్నడరచయిత కుం. వీరభద్రప్ప గారు అభిమానంతో రంగనాధ రామచంద్రరావుగారు తెలుగీకరించిన తన నవల 'అరమనె' (రాజభవనం)ను నాకు ప్రచురణకు ముందే పంపారు. దానికే ఆయనకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. అది దాదాపు 550 పేజీలపెద్ద నవల. తనదైన మాంత్రిక వాస్తవికత పద్ధతిలో ఆయన సర్‌తామస్ మన్రో కాలపు రాయలసీమ జీవితాన్ని చిత్రించిన నవల అది. కుం. వీరభద్రప్పగారు ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో వుండే కన్నడ ప్రాంతమైన బళ్లారికి దగ్గరలో పల్లెటూర్లలో బడిపంతులుగా పనిచేసి కొన్ని సంవత్సరాలక్రితం పదవీ విరమణ చేశారు. ఆయనకు తెలుగు బాగా వచ్చు. తన ప్రాంతపు మాండలికంలో కన్నడ రచనలు చేసే వీరభద్రప్పగారిని కన్నడ విమర్శకులు విశిష్టమైన రచయితగా గుర్తిస్తారు. ఆయన గూడా దాదాపు 20 నవలలు రాశారు. అవి గూడా భైరప్పగారి నవలల్లాగే చాలా పెద్దవి (500 పేజీలకుపైగా వుంటాయి కొన్ని)

కన్నడంలో అటువంటి నవలలు ప్రచురించే సంస్థలున్నాయని వీరభద్రప్పగారన్నారు. నవలలకు దాదాపుగా 50వేల రూపాయల పారితోషిక ముంటుందట. నవల మంచిదైతే రెండు మూడు నెలలకే పునర్ముద్రణలుంటాయిట. ప్రసిద్ధమైన నవలలు పది, యిరవై ముద్రణల వరకూ ముద్రించబడుతూనే వుంటాయట!

యీ విషయాలన్నీ తెలుసుకున్నప్పుడు తెలుగు రచనలకు, రచయితలకూ యెదురవుతున్న దుర్భర పరిస్థితులను చూసి కలవరపడక తప్పదు. అప్పుడెప్పుడో ప్రక్రియగా 'నవల' చచ్చిపోయిందని చెప్పి ప్రముఖ భారతీయాంగ్ల నవలా రచయిత సల్మాన్ రష్దీ సంచలనం సృష్టించారు. యితర భాషల సంగతేమో గానీ తెలుగులోమాత్రం అట్టి పరిస్థితే తయారవుతూవుంది. నవలలకు ఆలంబనగా వుంచిన పత్రికలు చాలా మూతబడ్డాయి. మిగిలిన పత్రికలు శృంగార, నేర పరిశోధన రచనల పేరుతో చవకబారు నవలలనే సీరియల్‌లుగా ప్రచురిస్తున్నాయి. వొకప్పుడు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి వారపత్రికల్లో గొప్ప నవలలు వెలువడ్డాయి. ఆనాటి సంపాదకులు పాఠకుల అభిరుచిని తీర్చిదిద్దారు. శారద, తెన్నేటిసూరి, కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, వడ్డెర చండీదాస్, ఆర్.ఎస్. సుదర్శనం, డాక్టర్ కేశవరెడ్డి, పతంజలి వంటివారి నవలలు సీరియల్‌లుగా వచ్చాయి. వాళ్ల నవలలను ప్రచురించే సంస్థలుండేవి. యిప్పుడు విశాలాంధ్ర ప్రచురణాలయం, యెమెస్కో వంటివాళ్లు తప్ప మిగిలిన ప్రచురణకర్తలందరూ మాయమై పోయారు. తెలుగులో మంచి రచనలను ప్రచురించే ప్రాచుర్యమున్న పత్రికలన్నీ మూతబడిపోయాయి. కేవలం రెండు, మూడువేల ప్రతులు అమ్ముడయ్యే సాహిత్య పత్రికలు రెండుమూడు అతి కష్టంపైన కాలాన్ని లాగుతున్నాయి. రచయితలకు పారితోషికాలనే మాటను రచయిత లెప్పుడో మరచిపోయారు. మంచి రచనలకు యిటీవల వరకూ ఆలంబనగా వుండిన దినపత్రికలు ఆదివారం అనుబంధాలు గూడా క్రమంగా వ్యాపార దోరణిలోకే వెళ్లిపోయాయి.

తెలుగులో యిప్పుడు పట్టుమని పదిపేజీల కథరాస్తే ప్రచురించే పత్రికలేదు. వెబ్ పత్రికలు కొన్ని అలా వచ్చి యిలా వెళ్లి పోతున్నాయి. యిక నవలలను రచయితలు తమకు తామే ప్రచురించుకోవలసి వస్తోంది. బాగా పేరు ప్రఖ్యాతులున్న రచయితలు గూడా 500 ప్రతులే వేసుకుంటుంటే చాలదా అనుకుంటున్నారు. పాత పాఠకులు రచయితలు యెదురైనప్పుడు "యింకా రాస్తూనేవున్నారా?" అని ప్రశ్నిస్తున్నారు. తాము చదవడం మరచిపోయిన సంగతి వాళ్లకసలు జ్ఞాపకంలేదు.

తెలుగు సాహిత్యంలో భైరప్ప, అనంతమూర్తిలతో పోల్చదగిన నవలారచయితలు లేకపోలేదు. అయితే వాళ్ల రచనల్ని కన్నడ పాఠకులు చదువుతున్నంతగా, యిప్పటి మన పాఠకులు మన గొప్ప రచయితల రచనల్ని చదవడంలేదు. యిప్పుడుగూడా పెద్ద నవలలు కన్నడంలో విరివిగా వస్తున్నాయి. పాఠకులూ, ప్రచురణకర్తలూ వాటికోసం యెదురు చూస్తూనే వున్నారు. అయితే తెలుగు రచయితలు మాత్రం స్వంత ప్రచురణకర్తలుగా మారి, కొద్దిసంఖ్యలో ప్రతుల్ని ప్రచురించి, అవి పాఠకులకు చేరేదారికోసం అన్వేషిస్తున్నారు. తమిళంలో జయకాంతన్ వంటి రచయితలు రచనే వుపాధిగా జీవించారు. తెలుగులో అటువంటి పరిస్థితి యెప్పుడూలేదు. శ్రీపాద

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తన రచనల్ని తానే ప్రచురించుకుని, చివరి వరకూ దారిద్ర్యంలోనే జీవించారు. (ఈ విషయంలో రంగనాయకమ్మ గారొకరే మినహాయింపు. ఆమె తనకు కావల్సిన పాఠకుల్ని తయారు చేసుకోగలిగారు. యిటీవల ఎవరో పాఠక అభిమాని సౌజన్యంతో తన పుస్తకాలను పాఠకులకు అందుబాటు ధరలో కూడాతీసుకొచ్చారు)

కన్నడభాషకొచ్చినన్ని జ్ఞానపీఠ బహుమానాలూ, సరస్వతీ సమ్మాన్ పురస్కారాలూ, కన్నడ సినిమా కొచ్చినన్ని జాతీయ బహుమతులు తెలుగు సాహిత్యానికీ, తెలుగు సినిమాకు రాలేదని మనం వాపోతూ వుంటాం. తెలుగులో దాదాపు 10మంది గొప్ప సాహితీమూర్తులకు జ్ఞానపీఠాలు వచ్చివుండాలి. రాకపోవడం జ్ఞానపీఠ, సరస్వతీ సమ్మాన్‌లకే లోటని మనల్ని మనం వూరడించు కుంటూ వుంటాం. జాతీయ పురస్కార స్థాయిని మన చలన చిత్రాలు ఎప్పుడూ చేరలేదు. వీటికున్న అనేక కారణాలతో సరైన పాఠక వర్గమూ, ప్రేక్షకులూ తెలుగులో లేరనే వాస్తవాన్ని గూడా మనం గుర్తించితీరాలి. తమిళ, కన్నడ, మలయాళీ ప్రజలకున్నంతగా భాషపైనా, సంస్కృతిపైనా, సాహిత్యంపైనా మన తెలుగు వాళ్ళకు గౌరవాభిమానాలు లేకపోవడానికి కారణాలేమిటో తెలుసుకోగలగాలి.

చలం, కుటుంబరావు, రావిశాస్త్రి, బుచ్చిబాబు, శ్రీపాద, గోపీచంద్, బలివాడ కాంతారావు వంటి వారి రచనలెన్నో సినిమాలు గానూ, టీవీ సీరియల్లుగానూ వచ్చివుండాలి. మధురాంతకం రాజారాంగారి కథలనూ, వడ్డెర చండీదాస్‌గారి నవలలనూ టీవీకోసం అనుమతులు తీసుకెళ్ళిన నిర్మాతలు ఆ తరువాత ఫక్తు వ్యాపార సీరియల్‌లే నిర్మించారు. కేశవరెడ్డిగారు చివరివరకూ తన నవలలకు తానే చిత్రానువాదం గూడా చేయాలని యెదురుచూశారు. బెంగాలీ, తమిళం, కన్నడం, మలయాళం వంటి భాషలలో గొప్ప రచనలన్నీ చిత్రాలుగానూ, టీవీ సీరియల్‌లుగానూ వచ్చాయి.

యు. ఆర్. అనంతమూర్తిగారి నవల 'సంస్కార'ను కన్నడంలో చిత్రంగా నిర్మించినవారు ప్రఖ్యాత తెలుగుకవి పఠాభిగారు. వో తెలుగుకవి నవీన పంథాలో చిత్రాన్ని నిర్మించాలనుకున్నప్పుడు తెలుగులో కాకుండా కన్నడంలో యెందుకు నిర్మించారు? యిదీ మనమే జాగ్రత్తగా ఆలోచించాల్సిన ప్రశ్న. మన సాహిత్యమూ, మన సంస్కృతీ, యేదిశలో ప్రయాణిస్తోంది?


జనవాణి

అమ్మనుడి మనది

అమ్మ ఆది గురువు
అమ్మమ్మ –నాన్నమ్మ
వదినమ్మ –చెల్లెమ్మ
అత్తమ్మ + మాతృత్వపు ప్రతీకలు.
అమ్మ భాషను, నుడికారపు తీయదనాన్ని
పండించాలనేదే 'అమ్మనుడి' తాపత్రయం.
మనభాషపై పట్టు సాధిస్తూ,
ఇతర భాషలను గౌరవించాలి.
న వ యు వ త -- నాటి– నేటి
భాషా కృషీవలుర ఆశయాలతో,
ప్రాచీన,ఆధునిక
సాహితీ, సంస్కృతీ వారధులు కావాలి.

–రామానుజం, 8500630543

తెనుగులెంక సూక్తులు-23



మకుటములు దక్కలేదని
తికమకపడి దారి తప్పి తిరిగెడి తమ్ముల్
సుకపడరింతయు నకటా
సిక పెంచిన యతి కెవర్త సేసలు వోయున్॥

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
తుమ్మల సీతారామమూర్తి.

రాజకీయ నాయకుల వ్యక్తిత్వాలను విశ్లేషిస్తేనాలుగు రకాలుగా కనిపిస్తారు. వారిలో మొదటిరకం ప్రజలకోసం జీవించేవారు. ప్రజల సుఖం కోసం తపించేవారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేసేవారు. ప్రజల కష్టనష్టాలు భరించడానికి వెనుకాడనివారు. ప్రజలకోసం ఎలాంటి త్యాగాలకయినా సిద్ధపడేవారు. వీరికి స్వార్థం తెలియదు. మోసం తెలియదు. దోచుకోవడం, దాచుకోవడం తెలియదు. పరహితం కోసం ఉన్నదంతా వెచ్చిస్తూ నిరాడంబరంగా, నిజాయితీగా నిబద్ధతతో పనిచేస్తారు. ఇలాంటివారే ఉత్తములు అనిపించుకుంటారు.

రాజకీయ నాయకుల్లో రెండోరకంవారు మధ్యములు. వీరు పదవులకోసం ఆరాటపడరు. పదవి వస్తే వద్దనరు. పదవిలో ఉన్నంతకాలం ప్రజాహితం కోసం పాటుపడతారు. పదవిని అడ్డం పెట్టుకొని ఆదాయం సమకూర్చుకోవడం వీరికి తెలియదు. పదవిని నిజాయితీగా నిర్వహిస్తూ, సమర్థుడని పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తారు. తన వలన ప్రజలకెటువంటి నష్టం వాటిల్లినా పదవిని వదులుకోవడానికి సంకోచించరు. ఉత్తములలాగానే వీళ్ళుకూడా ప్రజల మనసులు గెలుచుకొంటారు.

మూడోరకంవారు నీచులు. వీరికి పదవే ముఖ్యం. పదవులద్వారా ప్రజాసేవ చేసినా చేయకపోయినా, పదవులను అడ్డంపెట్టుకొని లంచాలు, కమీషన్లరూపంలో వెనకేసుకుంటారు. పదవులద్వారా తనవాళ్ళకు లబ్ధి చేకూర్చిపెడతారు. వీరికి పదవిలేకపోతే నిద్రపట్టదు. తమపార్టీ ఎన్నికల్లో ఓడిపోతే వెంటనే అధికారపార్టీలోకి చేరి రకరకాల ఎత్తుగడలతో మళ్ళీ పదవులను పొందుతారు. పదవికోసం ఎంతటి నీచకార్యాలు అయినా చేయడానికి సిద్ధపడే వీరు రాజకీయ నాయకుల్లో అధికంగా కనిపిస్తారు.


రాజకీయ నాయకుల్లో నాలుగోరకం రాక్షసులు. వీరికి పదవే పరమార్థం. పదవికోసం ఎన్నిపాట్లయినా పడతారు. ప్రజలు ఛీత్కరించి ఓడించినా తామే అధికారంలో ఉన్నట్లు భ్రమపడుతూ ఉంటారు. వీరికి ప్రజల సమస్యలు పట్టవు. ప్రజాసంక్షేమం పట్టదు. వీరి లక్ష్యం అధికార సాధనే. అలాంటి వారికి సుఖం ఉండదు. ప్రభుత్వం చేసిన మంచినికూడా చెడుగా ప్రచారం చేస్తూ, తాము మాత్రమే ప్రజలకు మేలు చేసేవారమని ప్రచారం చేసుకునే వీరు ప్రగతి నిరోధకులు.

అందుకే తుమ్మల 'పదవులు రాలేదని తికమకపడి, కాని కార్యాలు చేస్తూ, కాని మాటలు మాట్లాడుతూ తిరిగేవారు సుఖపడరు. ప్రజలకు సుఖం కలుగనీయరు. శిఖలు పెంచిన యతిని యువతులు వివాహమాడనట్లే, అలాంటివారికి ప్రజలు అధికారం అందివ్వకూడదు' అన్నారు. కాని నేడు అలాంటివారికే ప్రజలు పట్టంకట్టడం శోచనీయం. ఇప్పటికయినా ప్రజలు ఎన్నికలలో సరైన నిర్ణయం తీసుకొంటే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది.

–డా॥నాగభైరవ ఆదినారాయణ
చరవాణి: 98497 99711

చదువతగిన
పుస్తకం

–కాళిదాసు పురుషోత్తం
98497 99711



అభివృద్ధికై లదాకీలు చెల్లిస్తున్న మూల్యం

హెలీనా నోర్‌బెర్గ్ లదాక్ ప్రజల జీవితాన్ని, "ఏన్షియంట్ ఫ్యూచర్స్" పేరుతో చాలా ఆసక్తికరంగా రచించారు. 1974-75లో భారత ప్రభుత్వం విదేశీ పర్యాటకులను లదాక్‌లోకి అనుమతించిన తొలి రోజుల్లోనే భాషా శాస్త్రజ్ఞురాలైన నోర్‌బెర్గ్ లదాకి ప్రజల భాషను అధ్యయనం చెయ్యడానికి స్వీడన్ నుంచి వచ్చారు. అప్పణ్ణుంచి ఆమె ప్రతి సంవత్సరం ఆరునెలలు లదాక్‌లో ఉండి అక్కడి ప్రజల జీవితం, సంస్కృతి, భాషలమీద పరిశోధించారు. మానవులు జీవించడానికి ఏమాత్రం అనుకూలంగా లేని ప్రతికూల వాతావరణంలో, చాలా పరిమితమైన ప్రకృతి వనరులతో జీవించే లదాకీలు ఎప్పుడూ సాపేక్షంగా సౌఖ్యంగా, ప్రశాంతంగా, ఆనందమయ జీవితం గడపడం ఆమెను అబ్బుర పరచింది. 1978లో 'లదాక్ ప్రాజెక్ట్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి లదాక్ పర్యావరణ పరిరక్షణకు పూనుకున్నారు. ఆమె కృషికి గుర్తింపుగా పలు అంతర్జాతీయ గౌరవాలతో పాటు నోబెల్ పురస్కారానికి పరిగణించబడే "Right to livelihood award"తో గౌరవించబడింది. నోర్‌బెర్గ్ తన గ్రంథంలో చెప్పిన ప్రధాన విషయాల సారాంశాన్ని ఈ వ్యాసంలో వివరించడం జరిగింది.

జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో లదాక్ ఒక భాగం. లదాక్ కార్గిల్, లే జిల్లాలుగా విభజించబడింది. కార్గిల్ జిల్లాలో అత్యధిక సంఖ్యాకులు షియా ముస్లింలు. లే జిల్లాలో ప్రజలు టిబెటియన్ మహాయాన బౌద్ధమతానుయాయులు. లదాక్ ముఖ్యపట్టణం లే టౌన్‌లో మాత్రం ముస్లిములు గణనీయంగా, కొద్దిమంది క్రైస్తవులు ఉన్నారు.

శ్రీనగర్‌నుంచి లే కు రోడ్డుమార్గంలో వెళ్తే జోజిలా పాస్ వరకు మెలికలు తిరిగే రోడ్డులో పర్వత సానువుల మధ్య, సతత హరితా రణ్యాలు దాటుకుంటూ ప్రయాణం సాగుతుంది. అక్కణ్ణుంచి వర్షా భావం వల్ల ఎండిన శుష్క ప్రదేశాలు- వర్షచ్ఛాయా ప్రాంతంలో ప్రవేశిస్తాము. ఎటుచూసినా మంచుతో కప్పబడిన పర్వత శిఖరాలు, వినీలాకాశం, మొక్కా మోడూ కన్పించని బోసిపోయిన రంగురంగుల భూమి, భయదమైన ఎడారి ప్రాంతం. ఏనుగుచర్మం ముడతల్లాగా అలలు అలలుగా కన్పించే ఎడారి, కొండలు, గుట్టలు, పర్వతాల మధ్య వంకర టింకరగా సాగే బస్సు మార్గం. అక్కడక్కడా బార్లీ పంట పొలాలు, అంతస్తులుగా పేర్చినట్లు పుష్పించిన అడవిచెట్లు, స్ఫటికంలా స్వచ్ఛంగా ప్రవహించే హిమానీనదాలు, వాగులు, వంకలు, సెలయేళ్ళు. పొలాలకు ఎగువన ఎత్తుగా, తెల్లగా, వెల్లవేసిన మూడంతస్థుల ఇళ్లు పెద్దపెద్ద బాల్కనీలతో, లదాక్‌ను 'Land of mountain passes" అంటారు!

లదాకీల సంస్కృతి టిబెట్ సంస్కృతికి దగ్గరగా ఉంటుంది. లదాక్‌ను "లిటిల్ టిబెట్" అని కూడా అంటారు. ధర్మస్థలలోని దలైలామా లదాకీలకు ఆధ్యాత్మిక గురువు. ఉత్తరభారతం నుంచి వెళ్లిన మాన్‌జాతివారి, ఆర్యజాతుల, గిల్‌జిత్‌లోని దార్ద్‌ల, మంగోలియా, టిబెటన్ సంచార జాతుల వారసత్వం లదాకీల జీన్స్‌లో ఉన్నట్లు శాస్త్రవేత్తల అభిప్రాయం.

లదాకి ప్రజల జీవితాన్ని అక్కడి రుతువులే నియంత్రిస్తాయి. మండువేసవి మూడునెలల్లో గబ్బిలాల్లా మలమల మాడుతారు, తర్వాత ఎనిమిదినెలలు మైనస్ 40 సి డిగ్రీలవరకు వెళ్లే భయంకరమైన శీతాకాలం. ఎడారులవంటి బయళ్లలో శీతపవనాలు, సుడి గాలులు. అక్కడ వాన ఎంత అరుదంటే దాని ప్రస్తావనే వాళ్ల జీవితాల్లో రాదు.

పదివేల అడుగులు, మరింత ఎత్తైన ప్రదేశాల్లో నాలుగు నెలలకు పరిమితమైన కాలంలో బార్లీ పండిస్తారు. తక్కువ సమయంలో పండే గోధుమ కొద్దిగా సాగుచేస్తారు. ఉర్లగడ్డలు, బటానీలు వంటి పంటలు కొంచెం కొంచెం పెట్టారు. 11వేల అడుగుల కంటె తక్కువ ఎత్తులోని లోయ ప్రాంతాల్లో ఆప్రికాట్, వాల్‌నట్ వంటి ఫలవృక్షాలు పెంచుతారు.

ఆవు, యాక్‌కు పుట్టిన సంకర జంతువు dzo (జొ). వ్యవసాయ పనులకు, పాడికి, పిడకలకు అన్నిటికి జొ మీద ఆధారపడతారు. లదాకీల జీవితంలో ప్రతి అంశం మతంతో ముడిపడి ఉంటుంది. విత్తడం, కోతలు అన్ని పనుల్లో పాటలు పాడుతారు. సంగీతం లేకుండా లదాకీలకు జీవితమే లేదు. మత విషయాలు చెప్పే సన్యాసికి, గ్రామీణ వైద్యుడికి లదాకి సమాజంలో చాలా ప్రాధాన్యం ఉంటుంది.

మితంగా జీవించడం, ఏవస్తువునైనా మితంగా వాడు కోవడం, దేన్నీ పనికిరాదని పడేయకుండా మళ్లీ మళ్లీ ఏదోరకంగా ఉపయోగించుకోవడం- ఇవే లదాకీలు వేల సంవత్సరాలుగా బతికి బట్టకట్టడంలోని రహస్యం. ఇది పరిమితమయిన ప్రకృతి వనరులను మితంగా, పొదుపుగా వాడుకొంటూ జీవించడమేగాని, పిసినిగొట్టు తనం మాత్రం కాదు. స్వాధీనత, స్వయం సహకారం ఇవే లదాకీల జీవన సూత్రాలు. ఉప్పు, టీపొడి, కొన్ని లోహవస్తువుల కోసం వీళ్లు బయటి ప్రపంచంమీద ఆధారపడతారు.

ప్రకృతి, భూమి, పశువులతో శతాబ్దాలుగా లదాకీ ప్రజల జీవితం పెనవేసుకొని పోయింది. చలి, మంచుకాలంలో లదాకీలు మేక, యాక్, జో జంతుమాంసం తిని జీవిస్తారు. ఒక పూట భోజనానికి అనేక ప్రాణులను చంపడం కన్న, ఒక పెద్ద జంతువును చంపి అనేకమంది క్షుధార్తిని తీర్చుకోడం మంచిదని లదాకీలు భావిస్తారు కనుక వాళ్లు చేపలు తినరు.

లదాకీలు తూర్పుముఖంగా ఇళ్లు కట్టుకుంటారు. కింది భాగంలో పశువుల కొట్టంగా వాడుతారు. మెట్లెక్కి సూటిగా పైభాగానికి వెళ్తే వంటగదిలోకి వెళ్లొచ్చు. దానికి అనుబంధంగా సామాన్లు భద్రపరచుకొనే గది. మేడపైనే పూజగది, అతిథులకు ఏర్పాట్లు. ఇంట్లో చాలాభాగం పాతసామాన్లు పెట్టుకొనేందుకే సరిపోతుంది. ఆహార పదార్థాలు, పళ్లు, పశుగ్రాసం, వెన్న, యాక్ ఉన్నితో చేసిన దుప్పట్లు, బార్లీతో తయారుచేసిన మద్యం నిలవ చేస్తారు.

వ్యవసాయం చేసుకొనే నాలుగు నెలలు లదాకీలకు విశ్రాంతి దొరకదు. మతసంబంధమైన కార్యక్రమాలు, పండుగలు, పెళ్లిళ్లు అన్నీ శీతాకాలం విరామ సమయంలోనే. స్థూలకాయులైన లదాకీలు కన్పించరు. ఎప్పుడు ఎదురైనా స్త్రీ పురుషులు కదురు వడుకుతూ కన్పిస్తారు. పిల్లలు కాస్త పెద్దయ్యేదాకా కష్టమేగాని, తర్వాత ఆరోగ్యంగా జీవిస్తారు. వాళ్ల దేహాలు అతిశీతల వాతావరణానికి అలవాటు పడతాయి. శాస్త్రజ్ఞుల లెక్కల ప్రకారం లదాకీల భోజనం సంతులితమైనది కాదు. అందులో అనేక పోషక పదార్థాలు ఉండవు.వాళ్లు తినే కొవ్వు పదార్థాన్ని బట్టి, ప్రతి లదాకి హృద్రోగం పాలుకావాలి. కాని అందరూ ఆరోగ్యంగా ఉంటారు. కాలుష్య రహితమైన గాలి, నీరు, ఆహారం వాళ్ల అసలు ఆరోగ్య రహస్యం.

లదాకీల సామూహిక జీవనం, ఉమ్మడి సంసారాలే వాళ్లలో కన్పించే గొప్ప భద్రతాభావానికి మూలకారణ మనిపిస్తుంది. 95% లదాకీలు మధ్యతరగతి ప్రజలు. ఎక్కడ ఎదురైనా "జూలే, జూలే" అని పలకరిస్తారు చిరునవ్వులతో. అపరిచితులను కూడా ఇట్లాగే పలకరిస్తారు. 'కోపం' అనేమాట బూతుతో సమానం. పల్లెల్లో గ్రామపెద్దలను ప్రజలే ఎన్నుకొంటారు. సాధారణంగా పది పన్నెండు కుటుంబాలవాళ్లు ఒక సమూహంగా, బృందంగా మెలుగుతారు. మంచికీ చెడ్డకూ అన్నిటికి ఈ కుటుంబాలు పరస్పరం సహకరించు కొంటూ అండగా ఉంటాయి. ప్రతి యింటికీ నీటితో పనిచేసే వాటర్ మిల్ ఉంటుంది.

1947 నుంచీ బహు భర్తృత్వం (పాలియాండ్రి) చట్టవిరుద్ధ మైనా, లదాక్‌లో చాలాచోట్ల ఇది వాడుకలో ఉంది. పెద్దకుమారుడు, కుమారులు లేకపోతే పెద్దకుమార్తె కుటుంబపెద్దగా వ్యవహరిస్తుంది. సాధారణంగా ఆఖరి కుమారుడు సన్యాసం తీసుకోడం ఆనవాయితి. పెద్దవాడిభార్య తన మరుదుల్ని కూడా భర్తలుగా అంగీకరించడం, భర్త తన మరదల్ని, ఇతర స్త్రీలను భార్యలుగా చేసుకోడం కూడా పరిపాటే. లదాకి సమాజం అక్రమ సంబంధాలను ప్రోత్సహించదు కాని, అక్రమ సంబంధంతో జన్మించిన పిల్లల్ని మాత్రం చిన్నచూపు చూడదు.

లదాక్‌లో స్త్రీలు కూడా సన్యసిస్తారు. బహు భర్తృత్వం, సన్యాసం స్వీకరించడం వల్ల లదాకీ జనాభా నియంత్రణలో ఉంటుంది. వ్యవసాయ పనులు, గృహ కృత్యాల్లో సన్యసించిన వ్యక్తులు పాల్గొంటారు.

బౌద్ధమతం లదాకీల జీవిత విధానంతో పెనవేసుకొని పోయింది. ఎక్కడ చూసినా రంగురంగుల గుడ్డలతో చేసిన తోరణాలు గాలికి రెపరెపలాడుతూ కన్పిస్తాయి. 'శూన్యం' అనే పదాన్ని పాశ్చాత్యులు పొరపాటుగా అర్థం చేసుకొని "Buddhism is nihilistic" అని భావిస్తారు, సరైన అవగాహనలేక.

బౌద్ధం మానవ వ్యక్తిత్వ వికాసానికి, పరిణతికి దోహదం చేస్తుంది. ఆ అవకాశం క్రైస్తవంలో లేదు. లదాకీలు దేనికీ బంధింపబడరు. పరిస్థితులను, వస్తువులను యథాతథంగా స్వీకరించడం లదాకీల ప్రవృత్తి. అకాల వర్షానికి పంటపాడైపోయినప్పుడు కూడా లదాకీలు హాస్యంగా మాట్లాడుకోడం ఆశ్చర్యం అన్పిస్తుంది. "The Ladakhi concept of life is circular, one of a constant returning"

పాశ్చాత్య పర్యాటకులు రావడంతో వస్తున్న మార్పులు

ఇటీవల విదేశీ భావజాలం, ప్రభావాలు హిమ ప్రవాహం ముంచెత్తినట్లు, లదాకీల జీవితాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. లదాకీ జనాభాలో 70% లే టౌన్‌లో, చుట్టుపక్కల ఉన్నారు. లభివృద్ధికూడా ఆ చుట్టుపక్కలే జరిగినా, ఈ 'అభివృద్ధి' ప్రభావం మొత్తం లదాక్‌మీద పడింది. అభివృద్ధంటే పాశ్చాత్యదేశాల అభివృద్ధి నమూనానే. ఇప్పుడు ఇంగ్లీషుబోధించే స్కూళ్లు, వైద్యం, కోర్టులు, బ్యాంకులు పరిమితంగా అయినా లదాక్‌లో కాలూనాయి. లదాకీ భౌతిక సంస్కృతిమీద పర్యాటక పరిశ్రమ ఆందోళనకరంగా ముద్రవేసింది. ఈ విదేశీ పర్యాటకులు తమ దేశాలలో జీవించడానికి ఎంత పోరాటం చేస్తారో లదాకీలు ఎరుగరు. ఈ విదేశీయులతో పోల్చుకుని లదాకీలు తమను తాము పేదలుగా భావించారు.

'అభివృద్ధి'తో పాటుగా పాశ్చాత్య, హిందీ సినిమాలు లదాకీల జీవితంలో చొరబడ్డాయి. విదేశీయుల సుకుమారమైన చేతులు, వేషభాషలతో పోల్చుకొని లదాకీలు ఆత్మన్యూనతాభావానికి లోన య్యారు. శతాబ్దాలుగా కలసిమెలసి సుహృద్భావంతో జీవించిన లదాకి సమాజం సమూలమైన మార్పు చెందుతోంది. కొత్త అభివృద్ధి నమూనా అమలు పరచడంతో వాణిజ్య పంటలు పండించవలసిన దుస్థితికి లదాకీలు నెట్టబడ్డారు బీహారు తదితర రాష్ట్రాలనుంచి వ్యవసాయ కూలీలు రావడం మొదలైంది.

కొత్త విద్యావిధానం లదాకీ పిల్లలను వాళ్ల సంస్కృతినుంచి, ప్రకృతినుంచి దూరంచేసింది. పిల్లలు సంప్రదాయ విజ్ఞానాన్ని తిరస్కరించే విధంగా, న్యూయార్కులో విద్యార్థులు చదువుకొనే పాఠ్యాంశాలకు నాసిరకం అనుకరణలు తయారుచేసి పాఠశాలల్లో బోధిస్తున్నారు. అభివృద్ధంటే యూరోప్‌లో సాధించిన అభివృద్ధే అని లదాకీల మనస్సుల్లో బలంగా నాటుకొంది. యాక్, జోల బదులు జెర్సీ ఆవుల దిగుమతి ఇందుకొక ఉదాహరణ. కొత్తబళ్లలో చదివిన వాళ్లలో కొద్దిమందికి ఉద్యోగాలు వస్తే, పదింతలమంది నిరుద్యోగులుగా మిగులుతున్నారు.

శతాబ్దాలుగా లదాక్‌లో స్థానిక వనరులపై ఆధారపడిన "sustainable economy" వేళ్లూని ఉండేది. ఇప్పుడు దాని స్థానంలో నిరంతరం లదాకీలను ఆర్థికవ్యవస్థలోకి ఆకర్షించే నూతన విధానం విస్తరిస్తోంది. ఈ ఆధునికీకరణ గ్రామీణ లదాకీలను బతుకు పోరాటంలోకి, లే టౌన్‌వైపు గుంజుతోంది. ఏ తెగుళ్లు ఎరుగని లదాక్ వ్యవసాయంలో రసాయన క్రిమి సంహారక మందులు ప్రవేశించాయి. ఆహారం కలుషితమైపోయింది. భూమి కమోడిటీగా, ఒక విలువైన వస్తువుగా మారిపోయింది. ఇప్పుడు ఒక వాగో, వంకో తెగిపోతే గ్రామీణులు సామూహిక శ్రమతో దాన్ని బాగు చేసుకోకుండా ప్రభుత్వం ఆపని చెయ్యాలని ఎదురుచూస్తూ, నిర్లిప్తంగా ఉంటున్నారు.

ఇప్పుడు లదాక్ ప్రపంచీకరణలో భాగస్వామి. వార్తాప్రసార

మాధ్యమాల ద్వారా, సినిమాల ద్వారా ప్రపంచీకరణ 'కల్ట్' కొనసాగుతోంది. రేడియో రావడంతో లదాకీలు పాడుకోడం, కథలు చెప్పుకోడం పోయింది. సినిమాల్లోని ప్రతి మేనరిజం, మాటతీరు, వేషభాషలు, సిగరెట్ వేళ్లమధ్య పట్టుకోడంతో సహా లదాకీల జీవనవిధానంలో ప్రవేశించాయి.

సాంస్కృతిక కాలుష్యం చాపకింద నీరుమాదిరి జొరబడి మనుషులు తమ సహజమైన వ్యక్తిత్వాలను పోగొట్టుకొంటున్నారు. లదాకీల జీవితాల్లో అభద్రతాభావం ప్రవేశించి మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఆధునిక జీవితానికి అలవాటుపడని పాత తరం వారిని యువతరం తక్కువగా చూడడం, ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన విద్యార్థులు లదాకీ మాతృభాషమీద పట్టు పోగొట్టుకోడం వంటి విషాద పరిణామాలు ప్రపంచీకరణ తొడిగిన కుక్కమూతి పిందెలే. "న్యూక్లియర్ ఫ్యామిలీ"భావన లదాకీల జీవితంలో ప్రవేశించడంతోపాటు, తెగల మధ్య, భిన్నమతస్థుల మధ్య విభేదాలు రాజకీయస్థాయికి వెళ్లాయి. 1989లో లే టౌన్‌లో బౌద్ధ, షియా మతస్థులకు మధ్య జరిగిన ఘర్షణలు, సమాజాన్ని, మతాల వారీగా చీల్చివేశాయి.

పంచదార, బియ్యం, ప్లాస్టిక్ వస్తువుల మోజులో లదాకీలు కూరుకొనిపోయారు. కొత్త 'అభివృద్ధి' సువార్త దూతలు పర్యాటకులే. ఇన్‌స్టెంట్ నూడుల్సు వడ్డించలేక సంప్రదాయ టిబెటియన్ నూడుల్సు పెట్టి లదాకీ గృహిణులు అతిథులకు క్షమాపణలు చెప్పుకొంటున్నారు. 'అభివృద్ధి' పేద, ధనిక లదాకీల మధ్య తేడాను పెంచడమేకాక, కుటుంబాలు, సమూహాలు విచ్ఛిన్నమయి, భూమినుంచి, స్వాధీనత నుంచి, స్వయంసమృద్ధి నుంచి దూరమవుతున్నాయి. పాశ్చాత్యదేశాల మార్గదర్శకత్వంలో ఇప్పుడు లే టౌన్ అంతటా, లదాక్‌లో ఇతరచోట్లా పుట్టగొడుగుల మాదిరి బహుళ అంతస్థుల కాంక్రీట్ భవనాలు తెల్లారేటప్పటికి మొలుస్తున్నాయి. ప్రాంతీయ వైవిధ్యాలకు, స్వయంసమృద్ధికి ప్రత్యామ్నాయంగా, ఏకశిలా సదృశమైన ఆర్థిక విధానం వేరూనుతోంది. ఈ నమూనాలో న్యూయార్క్‌లో ఇల్లూవాకిలి లేని వ్యక్తికి, లదాకీ, భూటాన్ రైతుకూ తేడా ఉండదు. ఈ ఏకముఖ అభివృద్ధి స్థానిక ఉత్పత్తులమీద, వస్తువులమీద ఆధారపడి వాడుకలో ఉండే ఆర్థిక విధానాన్ని, మనం పట్టించుకోకుండా గుడ్డివాళ్లను చేస్తుంది; రకరకాల పంటలు పెట్టుకొని, కొద్ది జంతువులమీదే ఆధారపడి బ్రతికే రైతును ఒకేఒక వాణిజ్య పంటను వెయ్యమని ప్రోత్సహిస్తుంది.

వికేంద్రీకరించిన ఆర్థికవ్యవస్థ మెరుగైనదని వాదిస్తే, సోలార్ దీపాలు, సోలార్ పొయ్యిలు, గ్రామస్థాయి జలవిద్యుత్ కేంద్రాలు గ్రామీణుల జీవితాలను మెరుగుపరుస్తాయంటే, వాటిఖర్చు ఎవరు భరిస్తారు? గ్రామీణులు భరిస్తారా? అని కొందరు వితండవాదానికి దిగుతారు. ప్రభుత్వం ఇచ్చే భారీ సబ్సిడీలతో నెలకొల్పే పెద్దపెద్ద ప్రాజెక్టులు నిరుపేద, చిన్నరైతుల్ని వ్యవసాయానికి దూరం చేస్తాయని, పరిశ్రమస్థాయికి అభివృద్ధి చెందిన వ్యవసాయ స్థానిక వంగడాలను, విత్తనాలను, మొక్కలను నిర్మూలించి, కొత్త హైబ్రీడ్ వంగడాలను ప్రవేశపెట్టుందనడం నిర్వివాదాంశం.

రైతులు ఉత్సాహంగా బంధుమిత్రులతో కలిసి ఆనందంగా పొలంపనులు చేసుకొనే దృశ్యాలు ఇప్పుడు కనిపించవు. అపరిచితులైన నేపాలి, లేదా మైదాన ప్రాంతాలనుంచి వచ్చిన శ్రామికులతో



రైతులు పొలంపనులు జరుపుకొంటున్నారు. లదాక్‌లో సంప్రదాయ విజ్ఞాన ఆధారిత జల యాత్రలు లేదా పిండి మరలు కనుమరుగై విద్యుత్ మరలు వచ్చాయి. లదాకీలకు ఒకప్పుడు బియ్యం, చక్కెర అపురూపమైన విలాస వస్తువులు, ఇప్పుడు నిత్యావసరాలు.

లదాక్‌లో జరుగుతున్న 'అభివృద్ధి' సరైనదేనా అని పరీక్షించు కోడానికి ప్రజాసంక్షేమం, పర్యావరణాన్ని కాపాడుకోడం, sustainability వంటి కొన్ని కొలమానాలున్నాయి. గ్రామీణ సమాజాలు చీలి, చిన్నవై, విచ్ఛిత్తికావడం, వ్యక్తి వైయక్తిక గుర్తింపు మాయమయి, 'గుంపులో గోవింద' కావడం వంటి అంశాలు కూడా అభివృద్ధి నిజమైనదేనా అని పరీక్షించుకోడానికి పనికొచ్చే అంశాలే. తమదేశాల్లో లాగా పేద, ధనిక వర్గాలమధ్య ఉన్న అంతరం లదాకీ సమాజంలో లేదనే వాస్తవం పాశ్చాత్య ఆర్థిక వేత్తలకు తెలియదు. లదాకీల చైతన్యంలో ఆధునిక ప్రపంచం భాగమయిన తర్వాతే, వాళ్లలో ఆత్మన్యూనతాభావం పొటమరించింది.

అభివృద్ధి అంటే వినాశనమేనా? మీడియాలో ప్రకటనలు లదాకీల సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను వెనుకబడిన దురాచారాలుగా చిత్రిస్తున్నాయి. పరిమితమైన లదాక్ ప్రకృతి వనరులను అపరిమితంగా కొల్లగొట్టి, ధ్వంసంచేసి లదాక్‌ను పునర్నిర్మిస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. ఆరోగ్యం, వైద్యం, శిశువుల బరువు, పొడవు, ఎత్తు అన్నీ పాశ్చాత్య ప్రమాణాలతో పోల్చి లదాకీల పోషకాహారాన్ని నిర్ణయించడం, పాశ్చాత్యదేశాల బొమ్మలు, ఇళ్లు సినిమాలు వంటి అవాస్తవిక భావనలను లదాకీలు ఇప్పుడు అలవాటుగా మార్చుకొంటున్నారు. ఈక్రమంలో లదాకీ జీవనం ఊహించలేనంత వేగంగా కనుమరుగవుతోంది. ఈ కొత్త అభివృద్ధి విధానంలో లదాక్‌కు సహజమైన పక్షులు, జంతువులు కూడా నశించిపోగలవు. **"సంక్షేమాన్ని జిడిపి సూచించదు, Gross National Happiness మాత్రమే సంక్షేమాన్ని సూచిస్తుంది"** అని భూటాన్‌రాజు అన్నమాట అక్షర సత్యం.

లే టౌన్‌లో దిగుమతి చేసుకొన్న కట్టెలు, బొగ్గుతో శీతాకాలంలో కొందరు తమ ఇళ్లను వెచ్చగా ఉంచుకొంటున్నారు. పిడకలతో గదులను వేడిచేసుకొనే పాత పరిస్థితులమీద ఇది అభివృద్ధే. ఇంధనాన్ని దిగుమతి చేసుకోడం ఖర్చుతో కూడినపని. లదాకి ప్రాంతంలో సూర్యరశ్మి సంవత్సరంలో 300 రోజులైనా పడుతూ ఉంటుంది. సౌరశక్తితో ఇళ్లను వెచ్చగా ఉంచుకోడం తక్కువ ఖర్చుతో ఒనగూడుతుంది.

(హెలీనా నోర్‌బర్గ్ తొలిరోజుల్లో 'అభివృద్ధి'కి లదాకీలు చెల్లిస్తున్న మూల్యాన్ని వివరిస్తూ అనేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి రాజకీయ, ఆర్థిక వికేంద్రీకరణ తక్షణ కర్తవ్యమనే సందేశాన్ని జనంలోకి తీసుకొని వెళ్లగలిగింది. పర్యావరణ అనుకూలమైన, సౌరశక్తితో పనిచేసే ఉపకరణాలను ప్రవేశపెట్టడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టింది.)

Ancient Futures, Learning from Ladakh- Helena Norberg- Hodge.

Oxford India paper backs, 1991.

–చలసాని నరేంద్ర
98495 69050

తెలుగు రాష్ట్రాలలో పెనుదుమారం రేపుతున్న మాదకద్రవ్యాల సునామి

హైదరాబాద్‌లో యాదృచ్ఛికంగా కెల్విన్ అనే వ్యక్తి పట్టుబట్టడంతో హైదరాబాద్ నగరం కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ అనుసంధానంతో జరుగుతున్న మాదకద్రవ్యాల విచ్చలవిడి సరఫరా, వినియోగం గురించిన విభ్రాంతి కలిగించే పలు విషయాలు వస్తున్నాయి. సుమారు నెల రోజులుగా దర్యాప్తు అధికారులు దృష్టి అంతటిని చలనచిత్ర రంగంలోని ప్రముఖులపై ప్రసరింప చేస్తున్నారు. అయితే ఈ జాఢ్యం కేవలం సినిమా వారికి మాత్రమే పరిమితం కాదని, రెండు, మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా వ్యాపిస్తూ ఉన్నట్లు తేలుతున్నది.

ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు కేంద్రంగా హైదరాబాద్‌లో ఈ జాడ్యాన్ని అక్రమ సరఫరాదారులు వ్యాపింప చేస్తుండటం బహిర్గత మైనది. ఇటువంటి దుర్భర పరిస్థితి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాదని రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలలో, ముఖ్యంగా పేరు పొందిన విశ్వవిద్యాలయాలు, వృత్తివిద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలు యధేచ్ఛగా సరఫరా అవుతున్నాయని, వేలాది మంది యువత వీటికి బానిస అవుతున్నారని తెలుస్తుండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశం.

కొంతమంది విదేశీయులు సైతం వివిధ పేర్లతో తరచు ఇక్కడకి వస్తూ మాదక ద్రవ్యాల సరఫరా జరుపుతున్నట్లు వెల్లడైనది. ఇదివరలో పలువురు సినీ ప్రముఖులు, ఇతరులు ఇటువంటి లావాదేవీలలో పట్టుబట్టిన ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించక పోవడంతో దర్యాప్తులు ముందుకు సాగలేదు. కొద్దిరోజులు మీడియాలో సంచలనాలు సృష్టించిన తరువాత ఆయా సంఘటనలు తెరమరుగవడం చూశాము.

వీటి సరఫరా వెనుక పేరొందిన సినీ తారలే కాక రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తల కుటుంబాలకు చెందిన వారితో పాటు పోలీస్, రెవిన్యూ అధికారులు సహితం ఉన్నట్లు తెలుస్తున్నది. అందుచేతనే ఇప్పటివరకు ప్రభుత్వాలు పెద్దగా చూపు సారించలేదు. కొందరు పోలీసుల అండదండలతోనే ఇటువంటి వ్యవహారాలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ డిజిపి ఎన్ సాంబశివరావు పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం.

ఇటువంటి విష సంస్కృతి వ్యాప్తి చెందడానికి పబ్‌లు కీలక కేంద్రాలుగా ఉంటున్నట్లు ప్రస్తుతం సిట్ జరుపుతున్న విచారణలతో వెల్లడి అవుతున్నది. దాదాపు అన్ని పబ్‌లు రాజకీయ, పారిశ్రామిక, సినీ రంగాలలోని ప్రముఖుల అండదండలతోనే నిర్వహిస్తూ ఉండటం అందరికి తెలిసిందే. ఎవ్వరికీ తెలియకుండా ఈ తతంగం యధేచ్ఛగా ఇంతకాలం జరగడానికి అవకాశం లేదు.

యువతను మాదక ద్రవ్యాలకు బానిసలుగా చేయడంలో పబ్‌లే కీలక భూమిక వహించడమే కాకుండా పలువురు సెలబ్రెటీలకు సహితం డ్రగ్స్ అందుబాటులో ఉండేటట్లు చేస్తున్నట్లు వెల్లడైనది. తెల్లవారుజాము వరకు తెరచి ఉండే పబ్‌ల నుండి మత్తులో ఇంటి దారి పట్టిన పలువురు సంపన్న కుటుంబాలకు చెందిన వారు రోడ్ ప్రమాదాలలో మృతి చెందటం కూడా జరుగుతున్నది.

"హైదరాబాద్ నగరంలోని పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు డ్రగ్స్ అడ్డాలుగా మారాయి, మా దగ్గర సమాచారం ఉంది. మీ ప్రమేయం ఉందా లేదా అన్నది అప్రస్తుతం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇక ఏమాత్రం సహించేది లేదు" అని పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశం లో సిట్ అధికారులు చేసిన హెచ్చరిక ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరింప చేసుకొంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ పట్టుదలతో లభించిన చిన్న ఆధారంను పట్టుకొని లోతైన దర్యాప్తు జరుపుతూ ఉండడంతో ప్రస్తుతం అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అయితే మాదక ద్రవ్యాల జాడ్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వాలకు ఏమాత్రం శ్రద్ధ, నిజాయితి ఉందో అనుమానాస్పదమే. ఒక్కో పబ్ గురించి చెబుతూ హెచ్చరికలు జారీచేస్తూ ఇకనుంచి ఎక్సైజ్‌శాఖ పర్యవేక్షణ ఉంటుందని పబ్‌ల్లో డ్రగ్స్‌ను అనుమతిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని సబర్వాల్ హెచ్చరించినా ఆచరణలో ఏమాత్రం విజయం సాధిస్తారో చూడవలసి ఉంది.

ఎటువంటి అదుపు, అజమాయిషీ లేకుండా కేవలం లాభార్జన ధ్యేయంగా పబ్‌లు, మద్యం షాప్‌లు మారుతున్నాయి. ప్రభుత్వం సహితం వీటి ద్వారా లభించే ఆదాయం పట్ల చూపుతున్న శ్రద్ధను వీటి కారణంగా సమాజంలో చెలరేగుతున్న అశాంతిని పట్టించు కోవడం లేదు. ఉన్నతాధికారులు, సంపన్నులు, రాజకీయ ప్రముఖులు చదివే పేరొందిన విద్యాసంస్థలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతూ ఉండడం తల్లితండ్రులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

గతంలో ఆఫ్రికా దేశాల నుండి కొందరు యువకులు చదువు కోసం అంటూ వచ్చి మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు పలు పర్యాయాలు పట్టుబడినా వారి స్థానిక మూలాలను శోధించే ప్రయత్నాలు జరగలేదు. హైదరాబాద్‌లోని పలు పబ్బుల్లో మాదక ద్రవ్యాల వినియోగం సాధారణమేనని హీరో తరుణ్ ఎక్సైజ్ సిట్ అధికారుల విచారణలో వెల్లడించినట్లు కథనాలు రావడం ఈ

సందర్భంగా గమనార్హం.

నగరంలో 15 పెద్ద పబ్బుల్లో ఈ దందా నడుస్తోందని, డ్రగ్స్ తీసుకునేందుకు ఈవెంట్ మేనేజర్లు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తారని, తరచూ పబ్‌లకు వచ్చే వారిలా కాకుండా సెలబ్రిటీలకు ప్రత్యేక గదుల్లో డ్రగ్స్ సరఫరా చేస్తుంటారని వెల్లడించినట్లు కూడా తెలుస్తున్నది. పబ్‌ల నిర్వహణ పట్ల పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేయవలసి ఉంది. పైగా నగర శివారులలో తరచూ ప్రముఖులు జరుపుతున్న రేవ్ పార్టీలపైనా దృష్టి సారించాలి.

సినిమా వాళ్లకు పబ్‌లు, వారాంతరపు పార్టీలు సర్వ సాధారణం అంటూ ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ విచారణ సందర్భంగా చెప్పటం ఈ పరిశ్రమలో నెలకొన్న నిర్లక్ష్య పూర్వక ధోరణినే వెల్లడి చేస్తుంది. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారితో వాట్సప్ సంభాషణలు వందల సార్లు ఎందుకు జరిపారంటే "మాకు అనేకమందితో సంబంధాలు ఏర్పడుతూ ఉంటాయి. మా వ్యక్తిగత అంశాలలోకి వెళ్లవద్దని" ఒక ప్రముఖ తార దర్యాప్తు అధికారులకు చెప్పినట్లు కూడా వార్తలు వచ్చాయి.

ఇప్పటికే, ఈ కేసులో ప్రధాన నిందితుడైన కెల్విన్ ముఠా నెదర్లాండ్, ఐరోపాలోని పలు దేశాలు, అమెరికాలోని షికాగో నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకున్నట్లు నిర్ధారించుకున్న పోలీసులు కెల్విన్ ద్వారానే అంతర్జాతీయ మాఫియా డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు స్పష్టమైంది. మరోవంక నెదర్లాండ్స్‌కు చెందిన కామింగో అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతను ఇక్కడ ఒక ఐటి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు ఆధారాలు సమకూర్చుకొని తన కార్యక్రమాలు సాగిస్తున్నాడు.

ఈ కేసులో అరెస్టయిన జాక్ సినిమా రంగానికి చెందిన మరి కొందరి పేర్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. కెల్విన్‌తోపాటు అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న జీషన్ అలీ అలియాస్ జాక్‌ను సిట్ అధికారులు తమ అదుపులోకి తీసుకొని ప్రశ్నించిన్నప్పుడు కొత్తగా పలువురు సినీ ప్రముఖుల పేర్లు వెల్లడించినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా ఇద్దరు యువ నటులు ఉన్నట్లు తెలుస్తోంది. జాక్ వెల్లడించిన విషయాల ఆధారంగా త్వరలోనే సినిమా రంగానికి చెందిన మరికొందరికి నోటీసులు జారీ చేయనున్నారు.

అంతకు ముందే జాక్ ఫోన్‌ను విశ్లేషించి విలువైన సమాచారం సేకరించారు. కెల్విన్ మాదిరిగానే జాక్ వాట్సప్ గ్రూపుల ద్వారా మత్తుమందుల కొనుగోలుదారులతో సంభాషణలు జరిపినట్లు గుర్తించారు. ఈ జాబితాలో ఇద్దరు యువ నటులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ సినీ పరిశ్రమలో మంచి పట్టున్న పెద్దమనుషుల పిల్లలు కావడం గమనార్హం. వీరిలో ఒకరు యువతలో మంచి క్రేజ్ ఉన్న హీరో కాగా మరో నటుడు హీరో, ప్రతినాయకుడిగానూ పాత్రలు పోషించారు.

ఈ నటుడి పేరు గతంలో హైదరాబాద్ పశ్చిమ మండలంలో మత్తుమందుల ముఠాను పట్టుకున్నప్పుడు కూడా వినిపించింది. వీరితోపాటు ఇంకా కొంతమంది సినీ పరిశ్రమకు చెందిన వారి పేర్లు కూడా జాక్ వెల్లడించినట్లు సమాచారం. డ్రగ్స్ కేసులో విచారణ చేపట్టేందుకు ఎక్సైజ్ శాఖకు అన్ని అధికారాలు ఉన్నాయని అంటూ 1985 నార్కోటిక్ డ్రగ్స్ చట్టం ప్రకారమే విచారణ కొనసాగుతోందని అకున్ సబర్వాల్ స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత దానికి సంబంధించిన జీవోను 2016లో విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.

అయితే రాజకీయ వత్తిడులు ఇటువంటి దర్యాప్తులను నీరు కార్చడం కోసం ఎదుర్కోవలసి రావడం సహజమే. సినీ ప్రముఖుల పేర్లు వెలుగు లోకి రాగానే సబర్వాల్ సెలవుపై వీడుతున్నట్లు చెప్పారు. ముందుగా పర్వత ప్రాంతం విహారానికి వెడుతున్నట్లు చెబితే, ఆ తరువాత సొంత ఊరు వెడుతున్నాను అన్నారు. ఈ విషయమై మీడియాలో విమర్శలు చెలరేగడంతో వెంటనే ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు జోక్యం చేసుకొని ఆయనను సెలవుపై వెళ్లకుండా చేశారు.

విచారణకు పిలవడానికి ముందు సినీ ప్రముఖుల పేర్లను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ పెద్దలకు ఇచ్చారని, వారు అభ్యంతరం లేదని చెప్పిన వారినే పిలిచారని, ప్రముఖుల కుటుంబాలకు చెందిన వారి పేర్లను పిలవలేదని కథనాలు వెలువడ్డాయి. అసలు మాకు ఈ జాబితా చూపవలసిన అవసరం ఏమొచ్చింది? అదేవిధంగా జాబితాలను ముందుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిద్వారా ప్రభుత్వం ముందు ఉంచి, అక్కడి నుండి అనుమతి లభించిన తరువాతనే ముందుకు వెడుతున్నట్లు కనిపిస్తున్నది.

దర్యాప్తు సందర్భంగా పలు పేరొందిన ఐటి కంపెనీల క్యాంటీన్‌లలో బహిరంగంగా మాదక ద్రవ్యాలు లభ్యం అవుతున్నట్లు తెలియ వచ్చింది. అయితే అంతర్జాతీయంగా ఐటి కేంద్రంగా పేరొందిన హైదరాబాద్‌లో ఈ కంపెనీలపై దాడులు జరిపితే కొత్త కంపెనీలు రావడానికి భయపడవచ్చని ప్రభుత్వంలో కొందరు ప్రముఖులు సందేహాలు వ్యక్తం చేయడంతో దర్యాప్తు అధికారులు ఈ విషయంలో నెమ్మదిగా వెడుతున్నట్లు తెలుస్తున్నది.

హైదరాబాద్ నగరం అంటేనే కార్పొరేట్ స్థాయిలో భారీ పార్టీలు జరిగే కేంద్రంగా ఇప్పుడు పేరొందింది. అటువంటి పార్టీలలో మద్యం, మాదక ద్రవ్యాలు, మగువల సాహచర్యం విచ్చలవిడిగా లభించేటట్లు చేస్తున్నారని కూడా చెబుతున్నారు. పేరున్న స్టార్ హోటళ్లు సహితం అటువంటి కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉన్నాయి. ఇటువంటి విష సంస్కృతిని నిరుత్సాహ పరచే ప్రయత్నాలు జరిగితే తప్ప మాదక ద్రవ్యాల ప్రభావం నుండి మన యువతను కాపాడుకోలేము. ❁

-గోవిందరాజు చక్రధర్
98498 70250

యువనేతలు నేర్వాల్సిన పాఠాలు

తెలియచెప్పాలంటే ముందు తెలుసుకోవాలి. జర్నలిస్టులకైనా, నాయకులకైనా వర్తించే సూత్రమిది. విషయంమీద పట్టు ఉన్నప్పుడు, స్పష్టత ఉన్నపుడు తడబాట్లు ఉండవు. ఎదుటివారి ముందు తేలికైపోవటం ఉండదు. ఇతరులు విమర్శించటానికి ఏమాత్రం అవకాశం చిక్కదు. విమర్శించినా తిప్పికొట్టగల నైపుణ్యం అబ్బుతుంది.

వ్యక్తులు, పార్టీల పేర్ల ప్రస్తావన అనవసరం. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక యువనేతకు స,శ,షలకు తేడా తెలీదు. శాసనసభ, వారి పలుకుబడిలో సాషన సభో, శాషన సభో అవుతుంది. ఒకనేత బికామ్‌లో ఫిజిక్స్ చదివానని సగర్వంగా ప్రకటించి ఉచిత వినోదం అందించారట. ఘనత వహించిన మరొక యువనేతకు వర్ధంతికీ జయంతికీ తేడా తెలీదు. ఆంధ్రప్రదేశ్‌లోని నియోజకవర్గాల సంఖ్యపై పెద్దగా పట్టింపు ఉండదు. లెక్కతగ్గితే కష్టంగానీ ఎక్కువైతే నష్టమేమిటన్నది వారి ఫిలాసఫీ కాబోలు. వారు వీరనే తేడా లేకుండా ఈ కాలపు నవతరం నేతలెవరూ తెలుగులో రాసింది తడబడకుండా గడగడా చూసి చదవలేకపోతున్నారు.

చదవేస్తే ఉన్నమతి పోయిందన్నట్లు, అమెరికా చదువుల మహాత్మ్యమో ఏమో గానీ మనసులో చెప్పాలనుకునేది ఒకటైతే నోట్లోంచి ఉబికి వచ్చేది మరొకటి. అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని చెప్పాలనుకుంటారు. దానికి విరుద్ధంగా తాగునీటి సమస్య ఏర్పాటే లక్ష్యమంటారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా ప్రజాసమస్యలు పక్కదారిపట్టి, ఇంగ్లీషు ఉచ్చారణలకు సంబంధించి పరస్పరం దెప్పి పొడుచుకునే స్థాయికి పరిస్థితి దిగజారింది.

పత్రికలు, తామరతంపరగా పుట్టుకొచ్చిన టీవీచానళ్లు గిరులు గీసుకున్నాయి. బాహాటంగానే పార్టీల రంగులు పూసుకున్నాయి. బాహాబాహీ తలపడుతున్నాయి. ఈ జనమాధ్యమాలకు జండాలు, నిర్దిష్ట ఎజెండాలు ఉన్నాయి. పాఠకులకు, ప్రేక్షకులకు ఏ పత్రిక గోత్రమేమిటో, ఏ చానల్ వైనమేమిటో, ఏ రాత అంతరార్థమేమిటో ఏ వ్యాఖ్యానం పరమార్థమేమిటో క్షుణ్ణంగా తెలుసు. తమ ప్రత్యర్థి పార్టీకి చెందినవారు ఎవరు, ఎప్పుడు అడుసులో కాలు పెడతారా అని చకోర పక్షుల్లా ఆయా జనమాధ్యమాలవారు ఎదురు చూస్తున్నారు. ఏ అవకాశం దొరికినా పదేపదే చూపిస్తూ చిత్ర, విచిత్ర వ్యాఖ్యానాలతో రంగులు పులుముతున్నారు.

ఇది చాలదన్నట్లు మరోపక్క వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వగైరా సామాజిక మాధ్యమాలూ తెరమీదకొచ్చి తమవంతు రచ్చను తాము చేస్తున్నాయి. జనమాధ్యమాలకు సమాంతరంగా, ప్రత్యర్థులను తూర్పార పట్టడంలో, అనుకూల వ్యతిరేక అభిప్రాయకల్పనలో పథకం ప్రకారం సామాజిక మాధ్యమాలను వేదికలుగా ఉపయోగించు కుంటున్నారు. ఈ రంగంలో ప్రతిభ, పరిజ్ఞానం, తమ పార్టీపట్ల అభిమానం ఉన్నవారిని వేతనాలపై నియమించుకుని నానాయాగీ చేస్తున్నాయనే ఆరోపణలు పార్టీలపై ఉన్నాయి. ఆయాపార్టీలవారు సామాజిక మాధ్యమ విభాగాలపేరిట వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీన్నిబట్టే సామాజిక మాధ్యమాలను శక్తిమంతమైన ప్రచార వేదికలుగా పార్టీలు ఉపయోగించుకుంటున్నా యని స్పష్టమవుతోంది. ఈ క్రమంలో ఉచితానుచితాలను మరచి చెలరేగి పోవటమే సమస్యను జటిలం చేస్తోంది. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ తీసిపోవడంలేదు. తమలపాకుతో నువ్వొకటంటే తలుపుచెక్కతో నే రెండంటా అనేదాకా పరిస్థితి వెళ్లింది.

చంద్రబాబు, లోకేశ్‌లపై అభ్యంతరకర ఫోటోలు, వ్యాఖ్యలు ప్రచారం చేస్తున్నారంటూ పొలిటికల్ పంచ్ ఫేస్‌బుక్ పేజి నిర్వాహ కుడు ఇంటూరి రవికిరణ్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టుచేసి ఆ తర్వాత విడిచిపెట్టారు. వైసీపీ అభిమానులు నలభైమంది సోషల్ మీడియాలో ఉన్నారని, వారిఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రవికిరణ్‌ను అరెస్టుచేశారని ఆపార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆరో పించారు. తమపై లోగడ తెలుగుదేశం వారు అంతకంటే నీచంగా కామెంట్లు చేసినపుడు పోలీసులు చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోయారెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. సోషల్ మీడియా అస్త్రంతోనే చంద్రబాబుపై పోరాటం కొనసాగిస్తానని వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రకటించారు. ఈ వ్యాఖ్యలను బట్టి ఎవరూ వెనక్కి తగ్గే సూచనలు కన్పించటం లేదు. కేసులు పెట్టడం వల్ల సమస్య కొలిక్కి రాకపోగా ఆయా విషయాలపై మరింత రచ్చజరిగి నష్టతీవ్రత పెరిగే ప్రమాదమూ పొంచి ఉంది.

హద్దులు దాటితే: పత్రికాస్వేచ్ఛకూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే. మన భావాలను వ్యక్తంచేసే స్వేచ్ఛ ఉందికదా అని చెప్పి నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎదుటివారు సహించరు. మాటలైనా, విమర్శలైనా, ఫోటోలైనా హుందాతనం కోల్పోనంతవరకు, ఎదుటివారి పరువుకు భంగం కలిగించనంతవరకు ఎవరైనా ఆమోదిస్తారు. సామాజిక మాధ్యమాలు కూడా ఈ పరిమితులు, పరిధులకు లోబడి నడుచుకోక తప్పదు. ఫేస్‌బుక్ పేజీల నిర్వాహ కులు, ఆయాపార్టీలవారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

ప్రజాజీవితపు దారుల।
పయనించే వారలు
రకరకాల విమర్శలకు
తలయొగ్గక తప్పదు!

వ్యక్తుల ప్రైవేటు బ్రతుకు
వారి వారి సొంతం
పబ్లికులో నిలబడితే
ఏమైనా అంటాం!!

అని మహాకవి శ్రీశ్రీ ఏనాడో చెప్పారు. ప్రజాజీవనంలో ఉన్నవారు ఈ సత్యాన్నుంచి చాలాదూరం జరిగారు. విమర్శించడ మంటే ఏదో కాని పని అన్నట్లు చూస్తున్నారు. ఆ విమర్శలోని సత్యాసత్యాలను పక్కనబెట్టి విమర్శకుల నోళ్లు నొక్కాలని ప్రయత్నిస్తున్నారు. విమర్శలను సానుకూలంగా తీసుకున్నప్పుడు, లోటుపాట్లను సరిదిద్దుకోవాలని చిత్తశుద్ధితో కృషి చేసినపుడు వ్యక్తిగత ఎదుగుదలకు అవకాశం లభిస్తుంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వానికి, తద్వారా ప్రజలకు మంచి జరుగుతుంది. పదిరకాల భావాలు, అభిప్రాయాలు చర్చకు వచ్చినపుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లు తుందన్న స్పృహ ఈ కాలపు నేతల్లో రానురాను కొరవడుతోంది.

ఈ రోజుల్లో సినిమానటుల మాదిరే రాజకీయ వేత్తలనూ ప్రజల నెత్తిన బలవంతంగా రుద్దుతున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో అనువంశిక పాలన సాగుతోంది. ఢిల్లీనుంచి గల్లీవరకు ఈ పోకడలను చూడవచ్చు. ఈ క్రమంలోనే 'రాచ' కుటుంబాలకు చెందిన యువ నాయకులనేకమంది దిగుమతి అవుతున్నారు. ప్రజాసేవకోసం తహతహలాడుతున్నారు. ఈ కాలంలో ప్రజాసేవా క్షేత్రంలో పనిచేస్తూ పలు అనుభవాలతో రాటుదేలినవారు అరుదు. ఏదో ఒక దొడ్డిదారిన నూనూగు మీసాల ప్రాయంలోనే అమాత్యులై తెరముందుకొస్తున్నారు.

రాజకీయాల్లో మాదిరే సినిమా పరిశ్రమలోనూ నటవారసత్వాలు విరాజిల్లుతున్నాయి. తమ కుటుంబంలో ఎవరినైనా తెరంగేట్రం చేయించడానికి ముందుచాలా శిక్షణ ఇప్పిస్తున్నారు. జిమ్ముల్లో ఒంటిని అరగదీస్తున్నారు. అవసరమనుకుంటే దవడ ఎముకలనుంచి ముక్కు, మూతి వరకు శస్త్రచికిత్సలు చేయించుకుని కనువిందుకు సన్నద్ధులవుతున్నారు. ఇక ప్రేక్షకుల అలరింతకు నటన, నృత్యం, పోరాట కళల్లో ప్రత్యేక తర్ఫీదు తీసుకుంటున్నారు. నవయువ హీరోను ప్రేక్షకలోకంచేత మెప్పించటానికి ఈ శిక్షణకు తోడు భారీ హంగామా లు చేస్తున్నారు. అవసరంలేకున్నా విదేశాల్లో చిత్రీకరిస్తున్నారు. అగ్రశ్రేణి కథానాయిక అందాలు ఆరబోస్తుంది. నంబర్‌వన్ కమెడి యన్లు, విలన్లు తమ రసపోషణలో భళీ అనిపిస్తారు. వెరశి ఏదో ఒక రకంగా ఆ సినిమా ప్రేక్షకాదరణ పొందేలా నానాతిప్పలు పడుతున్నారు.

ఇంతా చేస్తే ఆ హీరోను ప్రేక్షకులు ఆదరిస్తారన్న హామీ ఏమీలేదు. దమ్ముంటే హీరో నిలబడతాడు, లేదంటే లేదు. ఈ సూత్రాలనే రాజకీయ రంగానికీ అన్వయించు కోవచ్చుగదా?

నిరంతర విద్యార్థులు: ఎన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత కొన్ని ప్రాంతాల్లో హిందీలో ప్రసంగించాల్సి వచ్చింది. అప్పుడు పట్టుబట్టి ఆభాషను నేర్చుకున్నారు. విషయాసక్తి ఉంటే రాజకీయ నేతలు వివిధ పద్ధతుల ద్వారా ఆకళించుకోవచ్చునని చెప్పటానికి డాక్టర్ ఎన్. తులసిరెడ్డిని ఉదహరించుకోవచ్చు. కొన్నేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌లో జరిగిన ఒక శిక్షణ కార్యక్రమంలో పాల్గొనటానికి ఆయనతో కలిసి కారులో ప్రయాణించవలసి వచ్చింది. కారు ప్రయాణం మొదలయ్యాక ఆయన జనమాధ్యమాలపైకి దృష్టి సారించారు. మీడియా ఆర్థిక విషయాలు, పాలసీలతో మొదలుపెట్టి ఒక్కో విషయం గురించి తులసిరెడ్డి నన్ను ప్రశ్నిస్తూ వచ్చారు. మా గమ్యస్థానం చేరేవరకు నేను మీడియా విషయాలను వివరిస్తూనే వచ్చాను. మధ్యలో ఎక్కడా అడ్డు తగలకుండా ఆయన ఓపిగ్గా, ఆసక్తిగా వింటూ వచ్చారు. మూడు దశాబ్దాల అనుభవంతో నేను పొందిన విషయ పరిజ్ఞానాన్ని నామాటల ద్వారా తులసిరెడ్డి మూడు గంటల్లో గ్రహించగలిగారు. ఎంబీబీఎస్ చదివి రాజకీయాల్లో ప్రవేశించిన తులసిరెడ్డి ఇప్పటికీ టీవీచర్చల్లో పాల్గొనేముందు క్షుణ్ణంగా అధ్యయనం చేసి నోట్సు రాసుకుని వస్తారు. యువనేతలు తులసిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవచ్చు.

శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి ఉదంతాన్ని కూడా ఇక్కడ చెప్పుకో వాలి. ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్న రోజులవి. ఒకరోజు ఆర్టీసీ ప్రజాసంబంధాల అధికారి నుంచి ఫోను వచ్చింది. శ్రీమతి శోభానాగిరెడ్డి చేసే ఉపన్యాసాలకు స్క్రిప్టు రాసిపెట్టే జర్నలిస్టు కావాలన్నది ఆ ఫోను సారాంశం. ఆర్టీసీ కార్యాలయంలో ఆమెతో నేను ఇలా చెప్పాను– "జర్నలిజంలో ఈమధ్యే ప్రవేశించిన వారి సేవలు పొందవచ్చు. కానీ అన్ని సబ్జక్టులపై వారికి గట్టిపట్టు ఉండక పోవచ్చు. సీనియర్లకు విషయావగాహన ఉన్నా ప్రత్యేకించి ఉపన్యాసాల స్క్రిప్టులు రాసిపెట్టటానికి సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరిపై ఆధారపడకుండా స్వయంగా ఆయా అంశాలపై అధ్యయనం ద్వారా పట్టు పెంచుకుంటే ధాటీగా మాట్లాడ గల నైపుణ్యం పొందగలరు."

దాంతోపాటు మరో సూచన కూడా చేశాను. ఏ విషయం మన ముందుకు వచ్చినా దానికి సంబంధించి వివిధ కోణాల్లో ప్రశ్నలు గుప్పించాలి. ఇలా ప్రశ్నిస్తూ వెళితే ఎదుటివ్యక్తికి ఆ విషయమై ఎంత అవగాహన ఉందో తేలిపోతుంది. వాస్తవం చెబుతున్నాడా, అరకొర అవగాహనతో తప్పు సలహా ఇస్తున్నాడా అనేది కూడా నిర్ధరించుకోవచ్చు. చివరకు సరైన నిర్ణయం తీసుకోవచ్చు. ఈ సలహాలు ఆమెకు ఎంతో కొంత ఉపకరించాయి.

ఏమిటి మార్గం? అలనాటి రాచరిక వ్యవస్థలోనే యువరాజుకు అస్త్రశస్త్ర విద్యల్లో శిక్షణ ఇప్పించేవారు. దాంతోపాటు రాజనీతి శాస్త్రాన్నీ బోధించేవారు. ధర్మాధర్మ విచక్షణ నేర్పేవారు.

ఈ కాలపు యువరాజకీయవేత్తలు కూడా ఎంబీఏలకే పరిమితమై తమకు అన్నీ తెలుసుననుకోకుండా అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకు ముందుగా కావల్సింది విషయాసక్తి. పొగిడే వారిని దూరంపెట్టి నిర్మాణాత్మక విమర్శలను చేసేవారిని ప్రోత్సహిం చాలి. తద్వారా లోటుపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం మళ్ళీ పుస్తకాలను పుచ్చుకుని కాలేజీలకు వెళ్ళనక్కరలేదు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్లు అధికారంలో ఉన్న వారు ఆహ్వానిస్తే అన్ని రంగాల నిపుణులు ఆగమేఘాలపై వచ్చి విషయావగాహన కల్గిస్తారు కదా! రోజుకో విషయ నిపుణుడితో సమావేశమై స్థూలంగానైనా ఆరంగం గురించి అవగాహనకు రావచ్చు. పాత్రికేయుల మాదిరే యువరాజకీయ వేత్తలకూ అవసరం లేని అంశమంటూ ఏదీ ఉండదు.

తమ పరిధిలో లోతైన అవగాహన ఏర్పరచుకోవలసిన విషయా లను ఎంచుకోవాలి. ప్రాథమిక అవగాహన చాలనుకునే వాటినీ గుర్తించాలి. ప్రసంగాలకు విషయాన్ని ఎలా సేకరించాలి, ఆసక్తి కరంగా పిట్టకథలతో ఎలా ఉపన్యసించవచ్చు, అందుకు ఎలా

కృషిచేయాలో ఆలోచించాలి.

పుస్తక పఠనం : పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకుంటే విషయావగాహనతోపాటు వాగ్ధాటి పెరుగుతుంది. విమర్శ పదును దేరుతుంది. మాటలకోసం తడబాట్లు ఉండవు. ఇతరులతో పోల్చిచూస్తే కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తల్లో పుస్తకాలు చదివే అలవాటు ఎక్కువ. ఒకసారి సి.పి.ఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి ఇంట్లో కూచుని దీక్షగా పుస్తకం చదువుతుండగా ఆయనతో మాట్లాడటానికి మరో కామ్రేడ్ వచ్చాడు. సురవరం చేతిలోని పుస్తకాన్ని చూసిన అతడు ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యాడు.

"ఇదేమిటి! మీరు ఆర్. ఎస్.ఎస్. సాహిత్యం చదువుతున్నారు?" అని సూటిగా ప్రశ్నించాడట.

దానికి సురవరం ఇలా జవాబిచ్చారు. "ఆర్.ఎస్.ఎస్. వారి సిద్ధాంతమేమిటో తెలుసుకుంటేనే గదా, ఆసిద్ధాంతంలోని లోటుపాట్ల గురించి మాట్లాడగలిగేది."

అలాగే, మీడియా వారితో మెలిగేటపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏయే ప్రశ్నలు ఎదురు కావచ్చు, వాటికి ఎలా సమాధానం చెప్తే బావుంటుందో హోంవర్క్ చేయాలి. ఎదుటివారు కవ్వించినా ఎలా నిగ్రహంగా ఉండాలో, పరిధిదాటితే వచ్చే పేచీలేమిటో గుర్తించాలి.

తెలియచెప్పాలంటే ముందు తెలుసుకోవాలి. జర్నలిస్టులకైనా, నాయకులకైనా వర్తించే సూత్రమిది. విషయం మీదపట్టు ఉన్నప్పుడు, స్పష్టత ఉన్నపుడు తడబాట్లు ఉండవు. ఎదుటివారి ముందు తేలికైపోవటం ఉండదు. ఇతరులు విమర్శించటానికి ఏమాత్రం అవకాశం చిక్కదు. విమర్శించినా తిప్పికొట్టగల నైపుణ్యం అబ్బుతుంది.

ఆయా పార్టీలు ఇప్పటికైనా శ్రద్ధపెట్టి రాజకీయ పునశ్చరణ తరగతులను నిర్వహించి ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తే యువనేతల పనితీరు కొంతయినా మెరుగు పడుతుంది. సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక ప్రచారం బెడదా ఆమేరకు తగ్గుతుంది.


యువనేతలూ! ఇప్పటికైనా కొంత సమయాన్ని మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవటానికి, నైపుణ్యాలను మెరుగుపరచుకోవటానికి వెచ్చిస్తారా?


కవిత

విశ్వరూపం

-పి.లక్ష్మణ్‌రావ్

అచ్చులతో అల్లికలు నేర్చి
హల్లులతో మాలికలు కూర్చింది
గుణింతాలతో సుగుణాలు చెక్కి
ద్విత్వాలతో శిల్పాలు మలిచింది.
సంధులతో సంబంధాలు పేర్చి
సమాసాలతో విశేషాలు చెప్పింది
సంయుక్తాలతో యుక్తాలు పన్ని
అలంకారాలతో అందలమెక్కింది
విభక్తులతో ఆకర్షణ చేసి
ప్రత్యయాలతో ప్రతిమచేసింది
యతులతో గతులు మార్చి
ప్రాసలతో ప్రతిభ చూపింది
ఛందస్సులతో ఉషస్సు నింపి
పద్యాలతో కదం తొక్కింది
అవధానాలతో వేదికలెక్కి
ఆశువుగా ధారణచేసింది
నుడికారాలతో నుదుటిబొట్టై
తలకట్టుతో అందాలు చిందింది
సామెతలతో వాసికెక్కి
జాతీయాలతో రాశి పెంచింది
ఏమని వర్ణింతును
నా తెలుగుభాష ప్రతిభా పాటవం
సుమధుర సుందర అక్షర విశ్వరూపం!





జులై సంచిక- 44వ పుటలో మహీధర జగన్మోహనరావుగారి ఫొటో వారిదికాదు. సరైన ఫొటోను ఇక్కడ ఇస్తున్నాం. జరిగిన పొరపాటుకు మన్నించగోరుతున్నాం. -సం॥

- సన్నిధానం నరసింహశర్మ
92920 55531

‘ఎరుకపీట’పై తెలుగువెలుగు
అమిత ప్రోత్సాహకశక్తి సి.నారాయణరెడ్డిగారు



జ్ఞానపీఠం సంస్కృతం. దానికి అమ్మనుడి ఎరుకపీట ఎంతకమ్మగా ఉందీ! ఏకచ్ఛత్రాధిపత్యానికి మధునాపంతులవారు ఆంధ్ర పురాణంలో ఒక్క గొడుగునీడ అన్నారు తెలుగు బాస జాడలో. సినారెగారి కైత కీరితి కడుంగడు గొప్పది. ఉభయభాషాపదాలూ ఆయన పెదాల్లోకి నిండు గుండె తెరచుకుని మరీవస్తాయి. ఆయన మృతి కాలధర్మమృతి అయినా మన అందరికళ్ళూ ఎన్.గోపీగారి కళ్ళయి వర్షించాయంటే ఆయనపట్ల మన ప్రేమ అంత నిలుకడకలదన్నమాట. తెలుగు నుడికారపు సొగసులు తెలిసిన సి.నా.రె. గిడుగు పిడుగుపై కవితలో– వడలివత్తలైన తెలుగు/ నుడులకు జీవముపోసిన/ గిడుగు రామమూర్తికి ఋణ/ పడియున్నది మన తెనుగుగడ్డ. అన్నారు. అంటూ ‘దిక్కుమొక్కులేని సవర/ వాక్కున కొక అక్షరమౌ/ గుడికట్టిన మహీసురుడు/ నుడికట్టని మహీసురుడు... బ్రతుకంతా తెలుగుదనం/ ప్రతినిధిగా వెలుగొందిన/ గిడుగు రామమూర్తి స్మరణం/ ఎదదకు నవ్యాభరణం– అన్నారు. ఈ గిడుగు శిల్పంలో భావ జీవం, బాస అందం రెండూ పెనవేసుకున్నాయి.

ఆయన కవిత్వ గ్రంథాలు, పుస్తక శక్తులు, భావుకతలు ఇక్కడ రాయబోవడంలేదు. పైయక్తికాలైన తీపిగురుతులను సమాజపరం చేయడానికి తాపత్రయం. హైదరాబాదులోని దక్షిణ భారత హిందీ ప్రచార సభవారు ‘స్రవంతి’ సాహిత్య పత్రికను సముదాత్తంగా నడిపారు. గిడుగు, కాటూరివంటి వారి ప్రత్యేక సంచికలు వేశారు. మోటూరు హనుమంతరావు వంటి వారితో మన సినారెగారు సంపాదకులు. ఆ వెనకటి రోజుల్లో స్రవంతి సంపాదకులుగా సి.నా.రె నుండి మీ కవిత అందింది వేస్తున్నాం అంటూ ముక్తసరిగా ఔచిత్య వంత పదప్రయోగంతో సౌజన్య లేఖలు వచ్చేవి. ఆయన నుండి లేఖ వచ్చినప్పుడల్లా పోస్టుమేన్‌కి ఏదో ముట్టజెప్పేవాడిని. ఆ పోస్టుమేన్ మీకు వచ్చింది మనిఆర్డర్ కాదుకదా. డబ్బులు ఇస్తున్నా రేంటి అనేవారు. ఇది సినిమాల్లో పాటలురాసే నారాయణ రెడ్డిగారు రాసిన ఉత్తరం అన్నాను. మీకు తరచు ఆయన్నుండి ఉత్తరాలు రావాలండి అని మేలు తలపులు పలికేవారు. యౌవనంలో చాపల్యాలు అనేకం సహజంగా ఉంటాయి. తరువాత ముదిరిపోతాం. ముత్యాల సరాల్లో గురజాడని అనుకరిస్తూ ‘దేశానికి నేనేమిటి/ చేశానని యోచించోయ్/ వీసమైన చేయకున్న నీ/ జీవితమెందులకోయ్?... జాజిపూల పందిరిపై/ విరబూసినపూలవలే/ వెదజల్లును పరిమళాలు నీ/ ఎదవెలిగెడు సుగుణాలే! నవభారత విద్యార్థీ నిజజ్ఞానపుటభ్యర్థీ.” వంటి కొన్ని నా కవితలు స్రవంతిలో వేసిన గురుదృష్టి ఆయనది. యువతరం భుజాలపై చేయితట్టడంలో సి.నా.రె ఒక అమిత సహృదయ ప్రోత్సాహకశక్తి. కులమతవర్గ విచక్షణలు లేకుండా తన అభిమానగణాన్ని నిండా ప్రేమతో చూసుకునే వారాయన అని వ్రాస్తే ఆయన చేతుల మీదుగా వచ్చిన ముచ్చట. ఆ సభలో ఆ ఎరుకపీట తెలుగు వెలుగు “నేను పి.హెచ్.డి. పరిశోధన సాగించడంలో సన్నిధానం పాత్రవుంది. అప్పట్లో నేను చదవతగ్గ 37 గ్రంథాల పట్టికను నాకు రాసిపంపాడు.” అని హర్షధ్వానాల మధ్య ప్రకటించి నప్పుడు నా ఈ చిరుగుండె తబ్బిబ్బయిపోయింది. మనం విమర్శను కోరుకుంటామని చెబుతాం. కానీ మన హృదయ స్థానంలో ప్రశంసనే కోరుకుంటామనే ఆంగ్లసూక్తి ఒకటి గుర్తుకు వస్తూ వుంటుంది. (ఇంటర్నేషనల్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ కొటేషన్స్‌లో అనిగుర్తు.)

కవులందరూ గొప్ప వక్తలు కాకపోవచ్చు. కానీ ఆయన గొప్ప కవీ, గొప్ప వక్త. ఇప్పుడు ఆధునిక తెలుగు కవిత్వంపై ఎన్నో గ్రంథా లున్నాయి. కానీ సినారె “ఆధునికఆంధ్రకవిత్వము, సంప్రదాయములు ప్రయోగములు” అనే పరిశోధనా గ్రంథం వచ్చేటప్పటికి తక్కువగా ఉండేవి. ఆ గ్రంథాన్ని పేర్కొనకుండా ఆధునిక కవిత్వ విశ్లేషణలు పరిపూర్ణం కావు. పూరిపాకలో ఉండే జానపద సరస్వతీరూపం నేదునూరి గంగాధరంగారికి ప్రముఖ దినపత్రికల్లో పడిన సినారె కవితలు (ముఖ్యంగా జవహర్‌లాల్ కీర్తి శేషులయినప్పటి వి) వినిపించేవాడిని. ఆ సంగతి గురువుగారు సినారెకి తెల్పగా ఆయన నాకు ‘అక్షరాలగవాక్షాలు’ పుస్తకం పంపారు. “పగలే వెన్నెలా జగమే వూయలా/ కదిలే వూహలకే కన్నులుంటే” పాట విని లేఖ రాస్తే వెంటనే స్పందించి ప్రేమాక్షరాలందించేవారు.

రాజమండ్రి శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగిన ఒక సభలో సినారె “సన్నిధానం గౌతమీగ్రంథాలయానికి అంకితం కాలేదు. అర్పితమై పోయాడు” అన్నారు. రాజమండ్రిలో గన్నివారు నిర్మించిన కేన్సర్ ఆస్పత్రికి ప్రారంభోత్సవ సభలో సి.నా.రె ఎండ్లూరి ప్రభృతుల సమక్షంలో ‘సన్నిధానం నా సహచరుడు; నా స్వరచరుడు’ అంటే ఈ హృదయానికి మరో కష్టం. ఆయన నాకు గురుతుల్యులు.

మధునాపంతులవారి అభినందన సంచిక ‘మధుకోశం’కి సమ్మాన సంఘంవారు సినారె కవితను కోరగా అదినాకు నేరుగా పంపుతూ ‘మధునాపంతులవారి గురించి అలవోకగా వ్రాస్తే ఎలా? అందుకే ఇన్నాళ్ళ మధనం. ఫలితం ఇదిగో ‘సుకృతీ!’ అని కవిత పంపారు. అందులో... జడలు కట్టినట్టి ఆంధ్ర చరిత్రమును దువ్విదువ్వి అరీణ శిల్పకధురీణ పురాణముగ తీర్చినావు... నిరుటి శతాబ్దమునకన్ను తెరచిన రచయితల సత్తాగుత్తకుగొని పెనుపొత్తము

తెలంగాణా ప్రపంచ తెలుగు మహాసభలు సాహిత్య అకాడమీ లోగోల ఆవిష్కరణ

తెలంగాణా ప్రపంచ తొలి తెలుగు మహాసభలు, తెలంగాణా సాహిత్య అకాడమీ లోగోలను రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జూలై 11న హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఈ దసరా నుండి వారంరోజులపాటు జరిగే తెలుగు మహాసభలకు నాందీగా ఈ లోగోల ఆవిష్కరణ జరిగింది. తెలుగు మహాసభల లోగోను చేర్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రవిశంకర్ తయారు చేయగా, తెలంగాణా సాహిత్య అకాడమీ లోగోను సిద్దిపేటకు చెందిన చిత్రకారుడు ఎం.వి.రమణారెడ్డి రూపొందించారు. మే మొదటి వారంలో నూతన తెలంగాణా సాహిత్య అకాడమీకి నియామకమైన ప్రముఖ సాహితీవేత్త డా.నందిని సిధారెడ్డి సిఎం కెసీఆర్ ఆదేశాలతో ఈ ప్రపంచ తెలుగు మహాసభలకు నేతృత్వం వహిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల లోగోలో కాకతీయ తోరణం, మధ్యలో తెలంగాణా చిత్రపటం, కాకతీయ సామ్రాజ్య చిహ్నాలైన గజరాజులను నకాశీ చిత్రరీతిలో రవిశంకర్ డిజైన్ చేశారు. లోగో పైభాగంలో తెలంగాణా రాష్ట్ర పక్షి పాలపిట్టను చిత్రీకరించారు. ప్రపంచ మహాసభలు–2017 అని అక్షరాలలో రాశారు. తెలంగాణా సాహిత్య అకాడమీ లోగోలో, లోగోమధ్యలో కరీంనగరానికి సొంతమైన ఫిలిగ్రీశైలిలో హంసను చిత్రీకరించి, హంస ముక్కు స్థానంలో పాళీని కనిపించేలా నైపుణ్యంతో మలిచారు. హంసకింద పుస్తకం పుటలను నీటి అలలుగా చిత్రీకరించారు. ఈ లోగో పైభాగంలో తెలంగాణా మ్యాపులో సాహిత్య వృక్షం శాఖోపశాఖలుగా విస్తరిస్తున్నట్లు చిత్రీకరించారు. లోగోలో తెలంగాణా సాహిత్య అకాడమీ అని హిందీలో, తెలుగులో రాసిన అక్షరాలు కనబడతాయి. ఈలోగోలను చిత్రీకరించిన ఇద్దరు కళాకారులను సిఎం కేసీఆర్ అభినందించారు. లోగోల ఆవిష్కరణలతో తెలంగాణా రాష్ట్రంలో ప్రపంచ తెలుగుమహాసభల సన్నాహాలు మొదలైనట్లేనని తెలంగాణా సాహిత్య అకాడమీ చైర్మన్ డా.నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణాకు సంబంధించిన యాభై రచయితల రచనలను, ప్రసిద్ధులైన వారి మోనోగ్రామ్‌లను ప్రచురిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా.కె.వి.రమణాచారి, అధికార భాషాసంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకరరావు, గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, సిఎంపేషిలో వోఎస్‌డి దేశపతి శ్రీనివాస్, తెలంగాణా పర్యాటక కార్యదర్శి బుర్రావెంకటేశం, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరిక్రిష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎస్.వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో తెలుగు ప్రపంచ మహాసభలను మనంగా నిర్వహిస్తామని, పుస్తకాల ప్రచురణలు తెస్తామని, త్వరలో సాహితీవేత్తలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తామని సిఎం అన్నారు.


కెక్కించినావు' అని ఆంధ్రపురాణం గురించి, ఆంధ్ర రచయితల గురించి వ్రాశారు. అలా మరొకరు వ్రాయగలరా? అభినవ పోతన వానమామలై వరదాచార్యులవారి గురించి రాస్తూ 'కృతులలోన బ్రతుకులోన/ యతిస్థితిని నిల్పుకున్న అన్నా వరదన్నా నీకందింతును తరుణ గేయ కల్హారం' అన్న కవితలో 'ఎంతటి పుణ్యమ్మును పండించుకొన్న దోరుగల్లు!/ పోతన్నకె కాదభినవ పోతన్నకు పురుడు పోసె' అన్నారు.

ఒక ఆశ్చర్యకర సంఘటన లేదా సందర్భం. సాహిత్యపత్రిక భారతిలో పెద్దాయన నోరి నరసింహశాస్త్రిగారు 'అరవై ఏండ్ల ఆంధ్ర సాహిత్యంలో నిలిచేవి, నిలవనివి' అనే ఓ సంచలనాత్మక వ్యాసం రాశారు. అందులో ఆంధ్రపురాణంలో ఆంధ్రాభిమానం ఎక్కువగా ఉంది అది నిలవదనీ, సినారె రచనలు మిగలవనీ ఏవేవో రాశారు. మల్లంపల్లి శరభయ్యగారు ఆంధ్రపురాణంలో ఆంధ్రాభిమానం కాక తమిళాభిమానం వుంటుందా అని పెదవి విరిచారు. అభిమానిగా నేను నేరుగా సినారెగారికి మీరు భారతి చూశారుకదా మీ రచనలు నిలవవని నోరి నరసింహశాస్త్రిగారు రాశారు. మరి మీ స్పందన ఏమిటండి అని రాశాను. వెంటనే రాసిన లేఖలో "సన్నిధానం నీ లేఖవలన తెలిసింది నోరివారి నోటితీరు. కానీ నీబోటి రసజ్ఞ హృదయ కోటికెక్కిన నాబోటివారి రచనలు మిగలకేం చేస్తాయి?" అన్నారు. తెలుగుజాతి సినారె పాటల్ని పాడుతూ తీయగా అంటోంది. చిన్నకవుల స్ఫూర్తి పొందారు. సమకాలీన కవులను గౌరవించు కున్నారు (ఆరుద్రగారనారోగ్యంగా ఉన్నప్పుడు, ఆర్థికంగా కొంచెం అవసరాలేర్పడిన సందర్భాన ఆయన వైద్య విషయంలో సినారె పట్టించుకున్నది చరిత్ర మరవదు) వాగ్దాన కవులకు అమిత ప్రోత్సాహకర శక్తినందించారు. మానవ కళ్యాణ వాంఛ ఆయన సారాత్మక భావజాలం.

ఈనాడు సినారె గురించి వ్రాయడం నిజానికి ఓ సమస్యే ఎందుకంటే ఆయన గురించి రాస్తూ ఎక్కడో మన గురించీ రాసుకొనే సంఘటనలు పైకి ఉబుకుతుంటాయి. అంతగా ఆయనతో వందలమందికి కవితాప్రేమ సంబంధాలున్నాయి. నిజానికి ఆయన ఆధునికకాలంలో ఒక 'మలయమారుతకవి'. అ

-సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650

సురవరం ప్రతాపరెడ్డికి తగిన స్మారక చిహ్నం



ఆగస్టు 25 : వర్ధంతి

తెలుగుభాషకు, సమైక్యతకు జవజీవాలు పోసిన మహామహులలో సురవరం ప్రతాపరెడ్డి గారికి నూతన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలని తెలుగు సాహిత్యకారులు, రచయితలు కోరుతున్నారు. నిత్య చిరస్మరణీయు లైన సురవరంప్రతాప రెడ్డిగారు 1930-50 మధ్య నిజాం ఆంధ్రలో చేసిన సాహిత్యసేవ అపారం. సురవరం 64వ వర్ధంతి ఈ ఆగస్టు 25న వస్తోంది. వారి జీవిత కాలంలో నాలుగు దశాబ్దాల సాహితీసేవ ఎవరెస్టు శిఖరం లాంటిది. జాతీయవాదిగా, లోతైన చారిత్రిక సామాజిక పరిశోధకుడిగా, రచయితగా, భాషోద్యమనాయకుడిగా, పాత్రికేయుడిగా, గ్రంధాలయోద్యమ కారుడిగా, విమర్శకుడిగా, స్త్రీజనోద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన చేసిన బహుముఖీన సేవా కార్యక్రమాలు నేటి తరానికి ఆదర్శాలే. ఆయన చేసిన అపారమైన సేవలకు ఆయన జన్మించిన నూతన తెలంగాణా రాష్ట్రంలో తగిన గుర్తింపుదొరకాలని ఉభయ రాష్ట్రాల సాహితీవేత్తలు కోరుతున్నారు. త్వరలో తెలంగాణలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగబోతున్న సందర్భంలోనైనా వారికి తగిన గౌరవాన్నివ్వాల్సివుంది.

నిజామాంధ్రలో ఆంధ్రమహాసభ ద్వారా చేసిన భాషాసేవ, గోలకొండ పత్రిక స్థాపన, సంపాదకత్వ బాధ్యతల నిర్వహణ, చైతన్య దీపికగా వెలువరించిన గోలకొండ కవుల సంచిక, ఇరవై ఏళ్ళపాటు పరిశోధించి, శ్రమించి తెలుగుజాతికి అమూల్య కానుకగా, వారసత్వ సంపదగా అందించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర ఉద్గ్రంథం, రామాయణ విశేషాలు, కొత్వాల్ రాజబహదూర్ వెంకటరామారెడ్డి జీవితచరిత్ర వంటివి తెలుగు సాహిత్య సంపదలే. గురజాడ, గిడుగు, కందుకూరి వీరేశలింగం పంతులు వలె తెలుగు భాషాభివృద్ధి వైతాళికులుగా ఊపిరి ఆగేవరకు శ్రమించారు. అందుకే **తెలుగుభాషోద్యమ సమాఖ్యవారు సురవరం జయంతి మే28ని తెలుగుజాతి వారసత్వ దినోత్సవంగా దశాబ్దం కిందటే ప్రకటించి, ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తూ, తెలుగుజాతికి ఆదర్శంగా నిలిచారు.**

సురవరం ప్రతాపరెడ్డి పేరును హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి నామకరణం చేయాల్సివుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన వల్లో మరెందుకో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. తెలంగాణా జాగృతి అధినేత్రి, నిజామాబాద్ ఎంపి కవిత, రాష్ట్ర ప్రభుత్వంలోని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు ఈమేరకు గతంలోనే వాగ్దానాలు చేశారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యా లయానికి ఆచార్య జయశంకర్, వరంగల్‌లో ఏర్పాటైన ఆరోగ్య విశ్వవిద్యాలయానికి పివి పేరు పెట్టారు. వరంగల్‌లోనే పెద్ద ఎత్తున కాళోజీ స్మారక కేంద్రాన్ని, ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారకంగా ఉద్యానవన విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించారు. తెలంగాణా వచ్చి మూడేళ్ళు గడుస్తున్నా సురవరం పేరును తెలుగు యూనివర్సిటీకి నామకరణం చేయడంలో జరుగుతున్న జాప్యానికి తెలుగు రచయితలు బాధపడుతున్నారు. తొలిసారిగా అధికారంలోకి వచ్చిన తెలంగాణా రాష్ట్రసమితి సాహితీ, సాంస్కృతిక రంగాలకు గత మూడేళ్ళనుండి పెద్దపీటే వేస్తోంది. బోనాలు, బతుకమ్మలను అధికారిక పండుగలుగా ప్రభుత్వం ప్రకటించి, తెలంగాణా సంస్కృతికి నీరాజనం పట్టింది. తెలంగాణాలో కాళోజీ పివి, దాశరథి, సినారే, ఆచార్య జయశంకర్, బసవేశ్వరుడు వంటి పేరిట అధికారిక జయంతులు, ఉత్సవాలు, స్మారక పురస్కారాలను నూతన తెలంగాణా ప్రభుత్వం ఘనంగా నిష్పాక్షికంగా నిర్వహిస్తోంది. ఈ దృష్ట్యా సురవరానికి రావాల్సినంత గుర్తింపురావాలని సురవరం అభిమానులు కోరుతున్నారు. తెలుగు రచయిత్రి ముదుగంటి సుజాతారెడ్డి మాట్లాడుతూ, సురవరానికి తగిన గుర్తింపురావాల్సిన సమయం ఆసన్నమైనదని, తెలుగు అకాడమీ, తెలంగాణా సారస్వత పరిషత్తు వంటివి సురవరం రచనల్ని అచ్చులోకి తెస్తున్నాయి. అలాగే తెలంగాణాలో నూతన జిల్లాల ఏర్పాటు విషయంలో సురవరానికి తగిన న్యాయం చేకూరలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆసిఫాబాద్ కొమ్రంభీం, జయశంకర్ భూపాపల్లి జిల్లా ఏర్పాటుకాగా, మహబూబ్ నగర్ జిల్లాలో కొత్తగా ఏర్పాటైన వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జోగులాంబ జిల్లాలకు సురవరం పేరును చేర్చలేదు. మరో నాయకుడు బూర్గుల రామక్రిష్ణారావు, పివి పేరిట జిల్లాలు ఏర్పాటు కావాలని డిమాండ్లు వచ్చినా అవి నెరవేరలేదు. మాతృభాషైన తెలుగు తిరిగి జీవించాలంటే, తెలంగాణాలో సురవరం, కాళోజీలాంటి పెద్దల ఆశయాలు ఆచరణలోనికి రావాల్సివుంది. ఆంగ్లభాష పెత్తన మేలుతున్న తెలుగునాట తెలుగు భాషా చైతన్యం, భాషోద్యమం ఉనికి చాటుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ స్ఫూర్తిని పొందదానికి సురవరం భాషోద్యమాన్ని స్మరించుకోవాల్సిందే. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇంటర్ స్థాయిలో రెండుసంవత్సరాల కోర్సులో 18 లక్షల మంది తెలుగు విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, కేవలం ఆరేడు లక్షల మందే ఆప్షనల్ సబ్జక్టుగా తెలుగు తీసుకుంటున్నారు. మిగతా పది లక్షల మంది సంస్కృతం, హిందీ ఇతర సబ్జక్టులను తీసుకుని మన మత్రుభాషైన తెలుగుకు మాయని మచ్చ తెస్తున్నారు. తెలుగు భాష ద్రోహం అరికట్టబడాలంటే సురవరం లాంటి ఉద్యమనాయకుల అవసరముంది. సురవరం పేరిట ఒక జాతీయ పురస్కారాన్ని తెలంగాణా ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

'తెలుగుదండు' తొలి సదస్సు





ఆంధ్రప్రదేశ్‌లో తెలుగును రక్షించుకోవడానికి 'తెలుగు దండు' ఉద్యమసంస్థ విశాఖపట్టణంలో ప్రారంభమైంది.

"తెలుగు దండు" కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతం. భాషాభిమానులు, కవులు, పండితులు, కళాకారులు.. ఇన్ని మాట లెందుకు ప్రపంచవ్యాపిత 18 కోట్ల తెలుగువారి గుండె చప్పుడు వినిపించే తప్పెట "తెలుగు దండు". ఈ ఉద్యమానికి స్ఫూర్తి.. సామల రమేశ్ బాబుగారు, వేదగిరి రాంబాబుగారు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు.

"తెలుగు దండు" మొదటి సమావేశం 23.07.2017 ఆదివారం విశాఖపట్టణంలో జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా భాషాభిమానులు, కళాకారులు, కవులు, పండితులు ఈ సభను సుసంపన్నం చేయడం కోసం వచ్చారు. వారి వారి అభిప్రాయాలను, సూచనలను తెలియజేసి మద్దతు ప్రకటించారు.

ప్రభుత్వాన్ని విమర్శించడమో, ప్రభుత్వంలోని వ్యక్తులను కించ పరచడమో "తెలుగుదండు" ఉద్దేశంకాదు. మన మాతృభాషను బలహీనపరచే చర్యలను విరమింపజేయడానికి, మాతృభాషలను కోల్పోతే జరిగే కష్టనష్టాలను ప్రభుత్వానికి తెలియజేసే ఒకమధ్యవర్తి "తెలుగు దండు" ప్రభుత్వం మొండిగా పెడచెవిని పెడితే న్యాయ పోరాటం చేసే ఒక సైన్యం "తెలుగు దండు"

ఈ కార్యక్రమంలో ఆహ్వానితులుగా డా.సూరపనేని విజయ కుమార్, 'పద్మభూషణ్' యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గురుసహస్రావధాని కడిమెళ్ళ వరప్రసాద్, ప్రముఖ సినీనటులు మిశ్రో, ఆచార్య కోలవెన్ను మలయవాసిని, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య బాలమోహన్ దాస్, ఆచార్య విశ్వేశ్వరం, కార్యనిర్వాహకులు పారుపల్లి కోదండ రామయ్య, జి.మధు, వై.వి.ఎన్.శర్మ, ప్రభాకర్ మున్నగు వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రాచీన హోదా పొందిన, ఎంతో చరిత్ర కలిగిన తెలుగు భాషను కూకటివేళ్ళతో పెకలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరి తాత్కాలిక ప్రయోజనాలకోసం చేస్తున్న ఈ పనులు తెలుగు భాషకు శాశ్వత నష్టాన్ని కలిగిస్తాయి. అందుకే ఇలాంటి చర్యలను మన మందరం కలిసి కట్టుగా ఎదిరించాలి. మన శ్రేయస్సుకోసం ఏర్పడ్డ ప్రభుత్వం మన 'నిక్కచ్చులను' మన్నించాలని కోరుకుందాం. ఇది ప్రజా ఉద్యమం. ఏఒక్కరి లాభంకోసం చేసేది కాదు. మన మాతృభాష ప్రాచీన వైభవాన్ని సాధించేవరకు విశ్రమించకూడదు.

నిక్కచ్చులు (డిమాండ్లు)

◆ మాతృభాషలోనే ప్రాథమిక విద్యాబోధన జరపాలి. ఆంగ్లాన్ని ఒక పాఠ్యాంశంగా నేర్పాలి.

◆ 2003 వ సంవత్సరంలో విడుదల చేసిన జి.ఒ.నెం.86 ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి పాఠ్యాంశంగా బోధించాలి.

◆ జి.ఒ. నెం.14 ను రద్దు చేసి మునిసిపల్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమములోనే బోధన జరిపి పూర్వస్థితిని పునరుద్ధరించాలి.

◆ అంగన్‌వాడి పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి.

◆ తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వంచే నియమించబడిన అధ్యయన కమిటీ ఇచ్చిన నివేదికలోని అంశాలను వెంటనే అమలు పరచాలి.

నాగరికజాతి మాతృభాషలోనే మాట్లాడుతుంది. సంస్కృతి అంటే మేధస్సు, చైతన్యాన్ని విస్తరించడమే. ఇది మాతృభాష బోధనతోనే సాధ్యం. డా.అశోక్ పంగారియా మాటలలో... మాతృభాషలో చదువుకుంటున్నప్పుడు మెదడులోని 'నియోకోర్టెక్స్' విశేషంగా స్పందిస్తుంది. ఫలితంగా చిన్నారుల్లో సూక్ష్మబుద్ధి, కొత్త ఆలోచనలను వ్యక్తీకరించగల సామర్థ్యం వృద్ధి చెందుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఎందరో పెద్దలు, మేధావులు మాతృభాషల అవసరాన్ని గుర్తించి పాఠం చెబుతున్నారు. అయినా మనం పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు! ప్రపంచమంతా మాతృభాషల అభివృద్ధికి కృషి చేస్తుంటే మనం గుంటపూలు పూయిస్తున్నాం.

ప్రభుత్వానికి మనవి.... "ఆగష్టు 29 తెలుగు భాషా దినోత్సవం (గిడుగు వారి జయంతి)" లోపల మా నిక్కచ్చులను మన్నించి అమలు చేస్తారని, ఆగౌరవాన్ని ప్రభుత్వమే దక్కించుకుంటుందని నమ్మకం. అలా జరగని పక్షంలో శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు సదస్సులు, నిర్వహించి భాషాభిమానులను ఏకత్రాటిపై నిల్పి పోరాటం చేస్తామని "తెలుగు దండు" విన్నపం.

-పరవస్తు ఫణిశయనసూరి,
సమన్వయకర్త, **"తెలుగు దండు."**

ధారావాహిక



4. మానవీయ సామాజిక సౌధం

బౌద్ధాన్ని శాస్త్రీయంగా ఇప్పటిదాకా బ్రతికించింది, ఇప్పుడు బ్రతికిస్తోంది, రాబోయే కాలంలో బ్రతికించేదీ ముఖ్యంగా రెండు విషయాలే.

ఒకటి: బౌద్ధంలోని మానవీయ నైతిక ప్రబోధాలు

రెండు: ప్రపంచం నిరంతరం మార్పు చెందుతోంది అనే 'ప్రతీత్య సముత్పాద" సిద్ధాంతం.

అసలు బౌద్ధసిద్ధాంతం మొత్తం "అనిత్యం, దుఃఖం, క్షణికం"– అనే మూడు కాళ్లమీద నిలబడిఉంది. ఉంటుంది. ఈ మూడే బౌద్ధానికి జవం.జీవం. ఈ మూడింటిలో అనిత్యం, క్షణికం అనేవి ప్రతీత్య సముత్పాదాన్ని తేటతెల్లం చేసేవే!

అనిత్యం: అనిత్యం అంటే నిత్యం, శాశ్వతం అయినదేదీ ఈ చరాచర జగత్తులో లేదు. సాధారణ గ్రామీణ భాషలో చెప్పుకోవాలంటే "ఏదీ శిలేసుకుని బతకదు". అంటే.. శిథిలం కాకుండా మనలేదు అని. శాశ్వతం, నాశనం లేనిది, అనంతం అని అప్పటిదాకా చెప్పు కొంటున్న "ఆత్మ" వాదాన్ని తన అనిత్య సిద్ధాంతంతో మొదలంటా నరికేశాడు బుద్ధుడు.

బుద్ధునికి ముందు– వేదకాలంలో పరమాత్మవాదం లేదు. చనిపోయిన 'జీవుడు' ఇక్కడినుండి పోయి అటు స్వర్గంలోనో, ఇటు నరకంలోనో సెటిలైపోతాడు. ఆ జీవాత్మ పరలోకంనుండి తిరిగి ఇహలోకానికి, ఇహలోకం నుండి పరలోకాలకి షటిల్‌సర్వీస్ యాత్రల్ని చేయదు. ఈ షటిల్ సర్వీస్ యాత్రల్ని ప్రవేశపెట్టింది ఉపనిషత్తులే. అవి పరమాత్మ, జీవాత్మ వాదాల్ని ముందుకు తెచ్చాయి. జీవన్ముక్తి అంటే జీవాత్మ పరలోక, ఇహలోక యాత్రలు జరపకుండా ఉండటమే అని తేల్చాయి– ఇలా ఇవి, ఆత్మ పరమాత్మల్ని శాశ్వతాలని ప్రచారం చేశాయి.

బుద్ధుడు ఖచ్చితంగా ఈ ఉపనిషత్తుల వాదం బలపడుతున్న కాలంలో పుట్టాడు.

మన మంచీ చెడుల్ని యజ్ఞయాగాలో, పరలోకాలో నిర్ణయిస్తే ఇక ఈలోకంలో మనం చేసేదేముంది? చేయాల్సిందేముంది? అంతా దైవనిర్ణయం లేదా పరమాత్మ ఆదేశం. అయితే, మానవులతోగానీ, మానవుడు చేసే పనులతోగానీ, ఆ పనులు తెచ్చిపెట్టే ఫలితాలతో కానీ పనేంటి?

మనిషి కేవలం కీలుబొమ్మేనా? మన సమాజం అనుభవించే సుఖదుఃఖాలకు, మంచీచెడులకు మనుషులకేమీ సంబంధంలేదా? హింస, క్రూరత్వం, కాఠిన్యం, వంచన, మోసం, దగా, దోపిడి, దౌర్జన్యం, దుర్మార్గం, ఈర్ష్య, అసూయా ద్వేషాలు– ఇవ్వన్నీ 'పరమాత్మ' నిర్ణయమా? లేదా దైవ నిర్ణయమా?

అలా అయితే, ఇవ్వన్నీ మనిషికి సహజాతాలే కావాలి. అలాంటప్పుడు మనుషులు చేసే కార్యాలకి మనిషి ఎలా కారకుడవుతాడు?

మనిషి ఎలా మారతాడు? పుట్టుకతోనే దుష్టుడు దుష్టునిగా పుట్టాలి. మోసగాడు మోసగాడుగా పుట్టాలి. – కానీ... నిజజీవితంలో అలాంటిది ఏమీ లేదు. కొంతకాలం మంచిగా ఉన్నవాడు, మరికొంత కాలానికి చెడ్డవాడనిపించుకుంటున్నాడు. చెడ్డవాడు కొంతకాలానికి మంచివాడుగా మారుతున్నాడు. హింసావాది అహింసావాదిగా మారుతున్నాడు. అహింసావాది హింసావాదీ అవుతున్నాడు.

ఈ మార్పులు సమాజంలోనే కాదు– ఒకే వ్యక్తిలో ఒకే జీవితకాలంలోనే స్పష్టంగా కనిపిస్తూ ఉన్నాయి–

కాబట్టి మన సుఖదుఃఖాలకి కారణం మన పూర్వజన్మకాదు. దేవుని రాత కాదు. మనిషి తను సమాజంలో నడుచుకొనే విధానమే' అని బుద్ధుడు గ్రహించాడు.

కాబట్టి "ఇది ఇంతే!" "ఈమె ఎప్పుడూ ఇలాంటిదే", "ఇతను ఎప్పటికీ మారనివాడే", ''ఇది విధిరాత అంతే''– అనేవన్నీ అవాస్తవాలని నిర్ణయించుకున్నాడు.

కాబట్టి మనిషిని 'మంచిగా మలచాలంటే అతని నడకని, నడతని, సామాజిక సంబంధాల్నే ప్రధానం చేసుకోవాలి గాని, దైవాన్నీ, ఆత్మల్నీ కాదు' అనే సత్యాన్ని కనుగొన్నాడు. ఎప్పుడైతే మానవుడు, మానవీయత, మానవ సామాజిక నిర్మాణం బుద్ధుని దృక్పథంలో ఆవిష్కరింపబడ్డాయో... అప్పుడే అతని ఆలోచనల్లోంచి దైవం, ఆత్మ, నిత్యం, శాశ్వతం అనే అంశాలూ అదృశ్యం అయ్యాయి.

అలా బుద్ధుని అనిత్యతావాదం మానవకేంద్రసిద్ధాంతంగా, మానవీయ సామాజిక సౌధంగా నిర్మించబడింది.

ఇలా...దైవకేంద్ర సిద్ధాంతాన్ని ప్రక్కకు నెట్టి మానవ కేంద్ర సిద్ధాంతాన్ని బుద్ధుడు ఆవిష్కరించాడు.

మరి... మారుతూ ఉండే ఈ ప్రపంచంలో మార్పు ఎలా జరుగుతుంది? ఎప్పుడు జరుగుతుంది? ఎందుకు జరుగుతుంది?

– ఈ మార్పుల్ని శాస్త్రీయంగా విశ్లేషించిందే ప్రతీత్య సముత్పాదం. అదే..బౌద్ధుల జ్ఞాన సిద్ధాంతం.



అనివార్యం కారణం: ప్రతీత్య సముత్పాదం అంటే ప్రతిదీ మరో దాన్నుండి పుట్టిందే అని. ఒక దాన్నుండి మరొకటి పొంది పుట్టింది అని. "అది" లేకుండా "ఇది" లేదు అని. అంటే "ఇదే అది, అదే ఇది" అని.– దీన్నే కార్యకారణ సిద్ధాంతం అంటాం. కారణం లేకుండా కార్యం జరగదు. ఉండదు. పుట్టదు.

ఇది బుద్ధుడు మాత్రమే ఆవిష్కరించిన సత్యం కాదు. బుద్ధునికి ముందుకూడా ఈ సిద్ధాంతం ఉంది. బుద్ధుని సమకాలీనులైన చార్వాక దర్శనకారుల్లో, ఇతర దర్శనకారుల సిద్ధాంతాల్లోకూడా ఈ సిద్ధాంతం ప్రముఖంగానే ఉంది.

ఒక కార్యం (పని) జరగడానికి ఏవో ఒకటోరెండో కారణాలు మాత్రమే కారకం కావు. అనేక కారణాల సమాహారమే కార్యం. ఒక కార్యం జరగడానికి **ఉపాదాన** కారణాలూ, **నిమిత్త** కారణాలు, **అసాధారణ** కారణాలు మాత్రమే కార్యం కావు. "అనివార్య కారణం" ఒకటుంది అని బుద్ధుడు ఆవిష్కరించాడు.–

ఉదా: కుండ.

కుండకు ఉపాదాన కారణం మట్టి. నిమిత్తకారణం కుమ్మరి. అసాధారణ కారణాలు..సారె, కత్తి, చెక్క, ఊక, నిప్పు మొదలైనవి. అనివార్య కారణం సామాజిక అవసరాల్నిబట్టి కుండ నిర్మాణంలో వచ్చే మార్పు. అంటే నిర్మాణ కౌశలం. సాంకేతిక నైపుణ్యం.

ఒక కాలానికీ, ఒక సమాజానికీ ఒక అవసరం వుంటుంది. ఆ అవసరాన్ని పూర్తిచేయడానికి పైన చెప్పిన ఉపాదాన, నిమిత్త, అసాధారణ కారణాలన్నీ ఉపయోగపడతాయి.

వైదిక కర్మకాండల వికృత...అమానవీయ... అనైతిక సంప్రదాయం లేకపోతే... బుద్ధునితో ఈ ప్రపంచానికి అవసరమే లేదు.

పెట్టుబడిదారీ దోపిడీ లేకపోతే, ఆ కాలానికీ, ఆ సమాజానికీ కార్ల్‌మార్క్స్‌తో పనీలేదు.

ప్రపంచంలో ఎక్కడా లేని అంటరానితనం అనే అమానుషం లేకపోతే, ఈ దేశానికి అంబేద్కర్‌తో అవసరమే లేదు.

ఇప్పుడు మళ్లీ గాంధీ పుట్టడు. పుట్టాల్సిన అవసరమూలేదు.

మట్టికుండ ఇత్తడి బిందెగా మారడానికీ ఒక కారణం, ఒక కాలం, ఒక అవసరం ఉంది.

ఉమ్మడి కుటుంబాలు, చిన్నచిన్న కుటుంబాలుగా మారడానికీ ఒక కారణం, ఒక కాలం, ఒక అవసరం ఉంది.

ఇప్పుడు వృద్ధాశ్రమాలు రావడానికీ ఒక కాలం, దాని అవసరం ఉంది.

ఇవ్వన్నీ ఒక చారిత్రక అవసరాలు. ఇలాంటి అవసరం లేకుండా ఏ కారణాలూ, కార్యాన్ని నెరవేర్చవు. ఈ చారిత్రక అవసరాల్నే "అనివార్య కారణం" అన్నాడు బుద్ధుడు. వీటన్నింటినీ కలిపి కారణ సమూహవాదంగా పేర్కొన్నాడు.

ఇలా చూస్తే ఏదైనా ఒక పనికి ఒకసంఘటనతోనో, ఒక వ్యక్తితోనో ఒక సమాజంతోనో ముడిపెట్టుకుని, సరిపెట్టలేం. ఆ పనికి (కార్యానికి) కారణాలు అనంతాలు–

వేదకాల దైవకేంద్ర సిద్ధాంతం, ఉపనిషత్తుల ఆత్మకేంద్ర సిద్ధాంతాలు రెండూ మొదటి మూడు కారణాల దగ్గరే ఆగిపోయాయి– వాటికి "అనివార్యకారణం" అనే ఆలోచన లేదు, రాదు. ఎందుకంటే అవి పరాధీనాలు, దైవాధీనాలూ, మానవరహితాలు.– దేవుడూ, ఆత్మా ఈ రెండూ ఈ లోకానికి సంబంధించినవి కావు. పరలోకాల విషయాలు. అందుకే వాటికి ఆ మూడు కారణాలు– ఉపాదాన, నిమిత్త, అసాధారణ కారణాలు– సరిపోతాయి. వాటితోనే సరిపెట్టుకొంటాయి.

కానీ, బౌద్ధం మానవ సామాజిక వికాస, విప్లవ సిద్ధాంతం. దీనికి మానవుడు, మానవ సమాజం కేంద్రం కాబట్టి, ఈ సమాజాలకి పరివర్తన, మార్పు, నియమావళి ఉంటుంది. కాబట్టి నాలుగో కారణమైన 'అనివార్య కారణం' అవసరం అవుతుంది. ఆ కారణం లేకుండా మాట్లాడ్డం అంటే చరిత్రను తెలియకుండా కొట్లాడ్డమే అవుతుంది. చారిత్రక పరిణామాన్ని గుర్తించకుండా వాదించడమే అవుతుంది. చరిత్ర కందని ఆత్మ, దేవుళ్ళని కాదని, చరిత్రగతిలో నిలబడి మానవుల్ని కేంద్రం చేసుకొని ఆలోచించాడు కాబట్టే బుద్ధుని సిద్ధాంతానికి, బుద్ధుడు చెప్పిన కార్యకారణ వాదానికి 'అనివార్య కారణం" అవసరం అవుతుంది.

ఆ "అనివార్య కారణాన్ని" ఆవిష్కరించడమే మానవ వైజ్ఞానిక చరిత్రలో గొప్ప మైలురాయి. ఆ మైలురాయిని పాతిన మనో వైజ్ఞానికుడు గౌతమ బుద్ధుడు.

ఆ మైలురాయే "అనిత్య" వాదాన్ని మరింత పరిపుష్టం చేస్తూ ప్రతీత్య సముత్పాదాన్ని పాదుకొల్పింది.

ప్రతీత్య సముత్పాదం
డార్విన్ పరిణామవాదం

బుద్ధుడు ప్రవచించిన "అనివార్య కారణం" ఆ తర్వాత ఎందరో చారిత్రక పరిశోధకులకి, భాషా శాస్త్ర పరిశోధకులకు ఒక మార్గం అయ్యింది. ఆనాటి గ్రీకు తదితర ప్రపంచ శాస్త్రవేత్తలకి కూడా దారి చూపింది. "ఇది బౌద్ధం" అని తెలియక పోయినా కారల్ మార్క్స్ తన సిద్ధాంతాన్ని ఈ పునాది మీదే నిర్మించాడు.

ఇక- ప్రతీత్య సముత్పాదంలోని అసలైన కోణాన్ని చూడాలి.

డార్విన్ తన పరిణామ శాస్త్రంలో ప్రకటించిన ప్రధాన అంశం కూడా ఇదే. "జీవుల్లో పరిణామం ఒక అనివార్య కారణం" అనే దానికి వాతావరణం, జీవనరణం, ప్రకృతి అనేక విషయాలు కారణం కావొచ్చు. అవ్వన్నీ అనివార్య కారణాలే. ఆ కారణాలు లేకపోతే జీవుల జన్యువుల్లో "మ్యుటేషన్లు" జరగవు. అనేక మ్యుటేషన్లు జరక్కపోతే ఒక జీవి మరో జీవిగా మార్పు చెందలేదు.-

దీన్నే "పరిసరాల అనుగుణ్యత", "ప్రకృతి ఎంపిక" అని డార్విన్ ప్రకటించాడు.

కాబట్టి డార్విన్ ప్రకటించిన ప్రకృతి ఎంపిక (Natural selection) బుద్ధుడు చెప్పిన "అనివార్య కారణమే" అని చెప్పుకుంటే- బుద్ధుని సిద్ధాంత మహోన్నతిని కొద్దిగా చెప్పుకున్నట్లే-

అసలు పరిణామశాస్త్రం ఏంచెప్తుందో చూస్తేనే- బుద్ధుని ప్రతీత్య సముత్పాద విజ్ఞాన ఉషోదయ కాంతి మనముందు ప్రకాశిస్తుంది.

ప్రతీత్య సముత్పాదం అంటేనే ఒక దాన్నుండి మరొకటి పొంది పుట్టడం. ఒక దాన్నుండి పుట్టిందంటే... కొత్తగా పుట్టిందీ అచ్చం పాత దానిలానే ఉండాలి. కానీ పొంది పుట్టేది-

1. అచ్చం పాతదానిలాగానే ఉంటుంది.

2. అచ్చం పాతదానిలాగానూ ఉండదు. ఇదీ, బుద్ధుడు చెప్పింది.

అంటే... కొత్తగా పుట్టింది అచ్చం పాతదే... కానీ అచ్చం అదే కాదు.

అచ్చం అదే అయితే... పిల్లవాడు పెద్దవాడు కాలేడు. "పెద్దవాడు వృద్ధుడు" కాలేడు. మొలక మొక్క కాకూడదు. మొక్క వృక్షంగానూ మారకూడదు-

కానీ ఈ మార్పు జరుగుతూ ఉంటుంది. మారిన కొద్దీ దాని లక్షణాలూ మారిపోతూ ఉంటాయి.

పిందె...రంగు, రూపం, రుచి వేరు. కాయ రంగూ రుచీ రూపం వేరు. పండు రంగూ, రుచీ రూపాలు వేరు. వాటి కాఠిన్యత లు మెత్తదనమూ వేరు వేరు. పండని కాయలోని విత్తనం మొలకెత్తదు.- ఇలా ఏ దశ లక్షణాలు వాటివే- కానీ... ఈ క్షణంలోని పిందె, ఈ క్షణంలో పుట్టలేదు. ఈ క్షణంలోనే అది కాయగా మారలేదు. మరలా క్షణంలోనే అది పండుగానూ పండలేదు-

ఈనాటి పిందె, రేపుకూడా మనకి నిన్నటి పిందెలాగానే ఉంటుంది. రేపటి పిందె కూడ మనకి ఈనాటి పిందెలాగానే ఉంటుంది. అలా చూస్తూపోతే... పిందె ఎప్పుడు ఏ క్షణంలో కాయగా మారిందో మనం చెప్పలేం. ఆ కాయ ఏ క్షణంలో పండడం మొదలెట్టిందో పసిగట్టలేం. అదెప్పుడూ మనకి "నిన్నటి" లాగానే ఉంటుంది.- ఆ మార్పుల్ని బట్టి, వాటి క్రమానుగత పరిణామాల్ని బట్టి అది "రేపు" ఎలా ఉండగలదో- ఊహించుకోగలం. దాదాపుగా సరైన పరిశీలన ఉంటే ఖచ్చితంగానే ఊహించగలం. భవిష్యత్తుని దర్శించగలం. అయినా- "నిన్న" అనేది గతించిన అనుభవం.

"రేపు" అనేది అనుభవంనుండి పుట్టిన ఊహ.

కాని "నేడు" అనేది ప్రత్యక్ష సాకారం. వాస్తవం. కాబట్టి బుద్ధుడు తన దృష్టినంతా "వర్తమానం" మీదే నిలిపాడు.

నిన్నటి అనుభవంతో, "నేటిని" సరిదిద్దుకుంటే మెరుగైన భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని తేల్చాడు-

ఇక- పింద, కాయ, పండుల విషయాన్ని మరోసారి చూద్దాం.

పిందె పండుగా మారే ప్రక్రియలో ఏక్షణం 'మారకుండా' ఉంది? మార్పుచెందని క్షణం అంటూ ఏదైనా ఉందా? ఈ మార్పు గంతులా ఎగిరి దూకుతూ ఉంటుందా? నదిలో నీటిలా ప్రవహిస్తూ, పారుతూ ఉంటుందా? మార్పు ఒక ప్రవాహంలా నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది అనేది బుద్ధుని ప్రబోధం. అది నదిలో నీటిలా-... నదిలో మునిగిన వ్యక్తి ఒకే నీటిలో స్నానం చేయలేడు అంటారు. అతను మునిగి లేచే లోపే నీరు ప్రవహించి వెళ్లిపోతుంది. కొత్త నీరు వచ్చి చేరుతుంది. పాతది పోవడం, కొత్తది రావడం అలా జరుగుతూనే ఉంటుంది. అంతేకాదు- ఒకే నీటిలో ఒకే వ్యక్తికూడా స్నానం చేయలేడు. మునిగిన వ్యక్తి వయస్సు 40 సంవత్సరాల 10 రోజులు 11 గంటల 17 నిముషాల 10 సెకన్లు అయితే- నీటినుండి లేచేప్పటికి అతని వయస్సు మరో ఐదు సెకన్లు, పదిసెకన్లు పెరిగి ఉంటుంది కాబట్టి అతనూ ఇతనూ ఒకడే కాదు. అని ఒకడు కాకుండానూ పోడు.

అంటే... ఈ విశ్వంలో ప్రతిదీ మారిపోతూనే ఉంటుంది. ఏక్షణం పాటూ "అది అదిగా" ఉండలేదు. కనీసం ఒక క్షణమైనా "తనకు తనుగా" మనలేదు. మార్పులోనే బ్రతుకుతుంది. మార్పుతోనే బతుకుతుంది. మారితేనే బతుకుతుంది. కాబట్టి వర్తమానం అంటేనే మార్పు. మారకుండా క్షణంకూడా ఉండదు కాబట్టి బుద్ధుడు దీన్ని "క్షణికం" అన్నాడు.

"క్షణం అంటే ఎంత కాలప్రమాణమో ఇప్పుడు మనకు వాడుకలో లేదు. ఇప్పుడు కాలాన్ని సెకన్లలో కొలుస్తున్నాం కాబట్టి మనం మార్పుని ఎంత కాలప్రమాణం వరకు గమనించగలమో చూద్దాం.-

మనిషికి తను చూసిన దృశ్యాన్ని గుర్తించడానికి సెకన్లో 21వ వంతు సమయం పడుతుంది. ఈ ఇరవై ఒకటవ వంతులోపల ఏం జరిగిందో గుర్తించడం మనవల్ల కాదు. (కానీ... మనిషి నిర్మించిన గడియారాలలో కొన్ని, సెకన్లో వెయ్యోవంతు కూడా గుర్తించగలవు)

మనం ఏదైనా మార్పుని చూడాలంటే ఈ 21వ భాగం పరిధిలోనే చూడగలం.

అయితే, మనం చూడలేని ఆ సమయంలో మార్పు జరగదా? అంటే... జరుగుతుంది. మనం గుర్తించినా, గుర్తించలేక పోయినా మార్పు ఆగదు. - అది ఒక అనంత ప్రవాహం.

ఇలా "క్షణిక" వాదం ఈ ప్రపంచం అసలైన నిర్మాణాన్ని, పరిణామాన్ని మన ముందుంచింది.


డార్విన్ పరిణామవాదం: ఇప్పుడు డార్విన్ పరిణామవాదం చూద్దాం డార్విన్ ఒక జీవినుండి మరోజీవి పరిణామం చెందింది అని చెప్పాడు. కోతినుండి మనిషి వచ్చాడని చెప్పాడు. అంటే కోతి- ఒక్క సారిగా మనిషిగా మారిందని చెప్పాడా? లేదు. కొన్ని వేల సంవత్సరాలు దానిలో కొన్ని కోట్లమార్పులు జరిగి.... జరిగి... మనిషిలా మారింది.

మనం కోతిని ఒక ప్రక్కా, మనిషిని మరోప్రక్కా ఉంచి చూస్తే అటు కోతి, ఇటుమనిషే కనిపిస్తారు. పిందెను ఒక ప్రక్క పండును ఒక ప్రక్కగా ఉంచి చూసినా అలాగే కనిపిస్తాయి.

కానీ- కోతికి మనిషికీ మధ్య జీవులున్నాయి. వాటిలో వైరుధ్యాలున్నాయి. వాటన్నింటినీ ఒక క్రమంలో పేర్చితే వాటిలోని మార్పుల్ని గుర్తించడానికి మనకి వందేళ్లు చాలవు. కాబట్టి పిందె, కాయ, పండు లాగా మూడు ముక్కల్లో చూద్దాం-.

మనిషి పరిణామాన్ని, వాటి చిత్రాల్ని ఎప్పుడూ చూస్తూ ఉంటాం- ఇప్పుడు కొన్ని జంతువుల పరిణామం చూద్దాం-

ఈ క్రింది బొమ్మ చూడండి. ఇది ఏనుగుల పరిణామ చిత్రం. 38 మిలియన్ సంవత్సరాలనాటి మోరిథేరియం అనే జంతువునుండి ఈ చిత్రం మొదలయ్యింది. అంటే అంతకుముందు లేవా? అంటే దానికి ముందున్న పరిణామం కూడా ఉంటుంది- కానీ తేలిగ్గా ఉండడం కోసం ఇక్కడనుండి చూద్దాం.




దానినుండి 26 మిలియన్ల సంవత్సరాలనాటి ట్రిలోఫోడన్, 12.5 మిలియన్ సంవత్సరాలనాటి ప్లాటిబెలోడన్, 2 మిలియన్ ఏళ్లనాటి మేమత్‌లు వాటినుండి రెండు శాఖలుగా చీలిన ఆధునిక ఆసియన్ ఏనుగు, ఆధునిక ఆఫ్రికన్ ఏనుగులు-

ఈ 38 మిలియన్ల కాలాన్ని ఇయోసీన్, వలిగోసీన్, మియోసీన్, ప్లియోసీన్, ప్లీస్టోపీన్ అనే ఐదు యుగాలుగా విభాగించాం. కాబట్టి ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క రూపాన్ని ఇక్కడ తీసుకున్నాం.

1,2 సంఖ్యల మధ్య 1.1, 1.2, 1.01, 1.02,.. ఇలా అనంత సంఖ్యలు ఉన్నట్లు వీటి మధ్యకూడ అనంతమైన మార్పులు ఉంటాయి.


అంటే మారని క్షణమంటూ ఉండదు. అలాగే గుఱ్ఱాల పరిణామ క్రమం చూడండి.



30 లక్షల సంవత్సరాలనాటి మానవ పూర్వీకులైన ఆస్ట్రలో పిథికస్ నుండి, 20 లక్షల సం॥నాటి హోమో హెబిలస్, 15 లక్షల సంవత్సరాలనాటి హోమో ఎరక్టస్, లక్ష ఏళ్లనాటి హోమోసేపియన్, చివరిగా నేటి ఆధునిక మానవుడు- ఈ దశల్లోకూడా ప్రతి దశలో ఒక దశనుండి మరో దశకు అనేక మార్పులు ఉన్నాయి-

ఈ పరిణామం కేవలం ప్రకృతి లోనే కాదు- మానవ సమాజం లోని వస్తువుల్లో కూడా ఉంటుంది. మానవ సమాజాలు కూడా మారిన పరిస్థితులకు అనుకూలంగా అవసరం అయిన విధంగా వస్తూ వుత్పత్తిలో కూడా మార్పు చేసుకుంటుంది. కాబట్టి ప్రతి వస్తువులోనూ పరిణామం కనిపిస్తుంది.

మనం ఈ వ్యాసం ప్రారంభిస్తూ మొదట్లో కంప్యూటర్ పరిణామ దశల గురించి చర్చించాం. అలాగే.. ప్రతి వస్తువులోనూ ఈ మార్పులు కనిపిస్తాయి.



అంటే... పరిణామమే ప్రపంచ గమనం. పరిణామమే విశ్వ ప్రయాణం. పరిణామమే సమస్తం. పరిణామమే వర్తమానం. పరిణామమే స్థితి. పరిణామం చెందనిది ఏదీ ఈ విశ్వంలో ఉండడానికి వీల్లేదు. ఉండదు. అది దేవుడైనా, జీవుడైనా, ఆత్మ

అయినా ఆవకాయ అయినా–

ప్రపంచ పరిణామ రహస్యాన్ని బుద్ధుని క్షణికవాదం శాస్త్రీయంగా ఎరుక పరచింది.

క్షణిక వాదం అంటేనే పరిణామ శాస్త్రం. కేవలం ఇప్పటి డార్విన్ పరిణామ శాస్త్రంకాదు. అది సామాజిక, నైతిక, వైజ్ఞానిక పరిణామ శాస్త్రం కూడా.

బౌద్ధం కేవలం డార్విన్ సిద్ధాంతంలాంటి జీవపరిణామ సిద్ధాంతం మాత్రమే కాదు. అది సమస్త విశ్వ పరిపూర్ణ పరిణామ సిద్ధాంతం.

ఇంత గొప్పది– గంభీరమైన విషయాన్ని బుద్ధుడు ఆవిష్క రించాడు. ఆ రోజునే మనం బుద్ధుడు జ్ఞానోదయం పొందిన రోజుగా, లేదా సంబోధిని పొందిన రోజుగా చెప్పుకుంటాం.

ఇంత గంభీరమైన విషయాన్ని చెప్పాలా? వద్దా? చెప్తే అర్థం చేసుకోగలరా? లేదా? తప్పుగా అర్థం చేసుకుంటారా?– దాన్ని తేలిగ్గా ఎలా చెప్పాలి?– అని దాదాపు 7 వారాలు ఆలోచించాడు. చివరికి ప్రజల భాషలో చెప్పాలని నిర్ణయించుకొన్నాడు. ఆషాఢ పున్నమి రోజున ఐదుగురికి తొలిగా ఉపదేశించాడు. ధర్మచక్రాన్ని నడిపాడు.

ఈ ధర్మాన్ని అర్థం చేసుకోవాలంటే అష్టాంగమార్గం అనుసరిం చాలని చెప్పాడు. ఆ మార్గాన్ని 3 ప్రధాన భాగాలుగా విభజించాడు.

ఒకటి: జ్ఞానమార్గం. ఇందులోని సమ్యక్ దృష్టి, సమ్యక్ నిర్ణయం అనే రెండు భాగాలూ జ్ఞానవిభాగానికి చెందినవి. ఇవి భౌతిక వైజ్ఞానిక పరిణామ శాస్త్రాలకు చెందినవి.

రెండు: శీల మార్గం. ఇందులో సమ్యక్ వాక్కు (సరైన మాట), సమ్యక్ కర్మ (సరైన పని), సమ్యక్ జీవనం (సరైన జీవనం) అనే మూడూ నైతిక అంశాలు.ఇవి సామాజిక నైతిక శాస్త్రానికి చెందినవి.

మూడు: ధ్యాన మార్గం. దీనిలో సమ్యక్ ప్రయత్నం, సరైన స్మృతి (సరైన ఎరుక) సమ్యక్ సమాధి (సరైన ఏకాగ్రత) ఈ మూడూ మానసిక ఏకాగ్రతకు చెందినవి. ఇవి మనో వైజ్ఞానిక శాస్త్రానికి చెందినవి.

ఇలా బుద్ధుడు తన మార్గాన్ని విజ్ఞానం, సమాజం, వ్యక్తి అనే మూడు విభాగాలకి సంబంధించిన మార్గంగా రూపొందించాడు.

బుద్ధునిలోని ఈ విభాగాల విభజన చూస్తుంటే... ఎంత గొప్ప శాస్త్రీయత కన్పిస్తుందో చూడండి–

సరైన దృక్పథంతో సరైన జ్ఞానం సంపాదించగలం. సరైన జ్ఞానం ఉంటే సరైన సామాజిక నైతిక విలువలతో సరైన సమాజాన్ని రూపొందించుకోగలం. అలాంటి సమాజంలో వ్యక్తిగత క్రమశిక్షణ, మానసిక ఏకాగ్రతల ద్వారా దుఃఖాన్ని దూరం చేసుకోగలం.

అస్తవ్యస్త సమాజాల్లో, అజ్ఞానంలో ఉంటే వ్యక్తిగతంగా ఏకాగ్రత సాధించలేం. దుఃఖాన్ని దూరం చేసుకోలేం.

జ్ఞానం, సమాజం, వ్యక్తి వికాసం– ఇదీ ఆయన చూపిన శాస్త్రీయ వైజ్ఞానిక మార్గం. ఆర్య అష్టాంగమార్గం.

ఆ మార్గం.....

మనోవైజ్ఞానిక శాస్త్రానికి పునాది.

బుద్ధుడు తొలి శాస్త్రీయ పరిణామవాది.

భువనేశ్వర్‌లో భువనమనోహరం



7.7.2017(శుక్రవారం) ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో నగరం నడిబొడ్డున ఠీవిగా నిలుచున్న రవీంద్రమండప్ రంగు రంగుల విద్యుద్దీపాలతో ముస్తాబయ్యింది. సాయంత్రం ఆరయింది. ఆడిటోరియం నిండిపోయి ఉంది. ఆ రోజు దుబాయి నుండి వచ్చిన 'అనంతర' నాట్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్నారు. యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయి అంటే బంగారు ఆభరణాలు, పెట్రోలు బావులు, వినోద పర్యటనకు ప్రసిద్ధి అని అందరి అభిప్రాయం. కాని, అక్కడ శాస్త్రీయ, సంగీత, నృత్యాలు కూడా ఆ నేలని సుసంపన్నం చేస్తున్నాయని అనంతర సంస్థ ఆనాడు ఋజువుపరిచింది. 'ప్రకృతిధ్వని 2017' పేరిట ఓఢ్రప్రాంత ప్రజలకు అంకితం ఇస్తూ నృత్యప్రదర్శన ఇవ్వడం విశేషం. దుబాయ్‌లోని ఒక ప్రవాస భారతీయ సంస్థ ఈ దేశ సంస్కృతిలో అంతర్భాగమైన శాస్త్రీయ నృత్యరీతుల్ని ప్రపంచమంతా పరిచయడం చెయ్యడం ముదావహం.

కళలకు కాణాచి అయిన కళింగదేశంలో శతాబ్దాలుగా పేరొందిన ఒడిస్సి, గొట్టిపువా లాంటి నృత్యాలతో అలరారుతోందన్న విషయం పాఠకులకు విదితం. అందుకే అనంతర కళాత్మక దృష్టి ఉత్కళంపై పడింది.ప్రకృతి పరవశించి పూలవాన కురిపించగా, పుడమితల్లి పులకరించిపోయింది. కూచిపూడి నాట్యానికి సృష్టికర్త భరతముని ఆత్మ సాక్షాత్కారమై గజ్జెలు ఘల్లుఘల్లుమన్పించింది.

కాపీ రాగంలో రూపక తాళం వేస్తూ శ్రీమతి విమ్మీ సోలోగా జావళి పాడి నర్తించారు. ప్రియునిపై అలకని తన హావభావాలతో ప్రదర్శించడం హైలెట్. విరామం తర్వాత 'అనంతర ప్రయాణం' అన్న డాక్యుమెంటరీ ప్రదర్శన జరిగింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ సంస్థ ప్రపంచ ప్రఖ్యాత నర్తకులకు తర్ఫీదు ఇవ్వడం లో కృతకృత్యమయిందని చెప్పడం ఈ చిత్ర ప్రదర్శన ముఖ్య ఉద్దేశ్యం. చివరగా 'అనంతర' బృందం కూచిపూడి బ్యాలట్ సప్తమాతృకని రాగమాలిక రాగం, తాళమాలిక తాళంతో ప్రదర్శించారు. ఆడిటో రియంలోని అశేష జనవాహిని నిలబడి తమ గౌరవాన్ని చాటారు. విజయకేతనం ఎగరవేస్తూ 'అనంతర' ప్రయాణం నిర్విఘ్నంగా సాగిపోవాలని కోరుకొందాం.

–ఆనందరావు పట్నాయక్

ఆంగ్లమాధ్యమం వద్దని గుడ్డిగా వ్యతిరేకించొద్దు

మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారో చెప్పి మాట్లాడండి: మంత్రి నారాయణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని వ్యతిరేకిస్తున్న నాయకులంతా.. ముందు వారి పిల్లల్ని, మనమల్ని ఏ మాధ్యమంలో, ఏ స్కూళ్ళలో చదివిస్తున్నారో చెప్పి, అప్పుడు మాట్లాడాలని పురపాలక శాఖామంత్రి పి.నారాయణ చురకలు వేశారు. 2015,2016,2017లో ఎంసెట్ ర్యాంకుల్ని పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో చదివిన వారు ఎంతగా వెనుకబడుతున్నారో అర్ధమవుతుందన్నారు. 2015లో మొదటి ఎనిమిదివేల ర్యాంకుల్లోను, 2016, 2017ల్లో మొదటి పదివేల ర్యాంకుల్లోనుప్రభుత్వపాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులుఒక్కడు కూడా లేడని బుధవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. “ప్రభుత్వపాఠశాలల్లో చదివేవారంతా పేదవారు. వారికి ఇంజనీరింగ్ వంటి వృత్తివిద్యాకోర్సుల్లో ప్రభుత్వ కోటాలో సీట్లు వస్తేనే చదువుకోగలరు. ప్రభుత్వ కోటాలో సీట్లు రావాలంటే మంచి ర్యాంకులు రావాలి. కానీ తెలుగుమాధ్యమంలో చదువుకున్న వారికి మంచి ర్యాంకులు రావడంలేదు. ఈ గణాంకాలు చూడకుండా, విశ్లేషించకుండా..ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంవద్దని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు” అని పేర్కొన్నారు. ఆంగ్లమాధ్యమంలో బోధిస్తున్నంత మాత్రాన తెలుగుని నిర్లక్ష్యం చేయబోమన్నారు. కానీ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే ఆంగ్లంలో నైపుణ్యం ఉండాలని, 35ఏళ్ళ బోధనానుభవంతో ఈ విషయం చెబుతున్నానని ఆయన పేర్కొన్నారు.

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్ళుగా మార్చి, నర్సరి, యూకేజి, ఎల్‌కేజి పిల్లలకు 500 పేజీలున్న మూడు వేర్వేరు పుస్తకాలు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బొమ్మలు, రంగులు, ఆటపాటలద్వారా నేర్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని, ప్రీస్కూల్స్ గోడల్ని అందమైన పెయింటింగ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దామని చెప్పారు.

(ఈనాడు సౌజన్యంతో...)

నారాయణ!...నారాయణ!!

ఈరోజు (27.07.2017 గురువారం) ఆంధ్రజ్యోతి దినపత్రికలో గౌరవనీయ మంత్రివర్యులు నారాయణగారు ఒకప్రకటన విడుదల చేశారు. తెలుగును పరిరక్షిస్తూనే.. ఇంగ్లీష్! అని. ఆ ప్రకటనలో వారు ఆంగ్లమాధ్యమం వద్దంటున్నవారు తమ పిల్లల్ని తెలుగులో చదివిస్తున్నారా? అని గొప్ప ప్రశ్న వేశారు. ఏరకంగా చూసినా ఇంగ్లీష్ మీడియం ప్రయోజనకరమైనదని, 35 ఏళ్ళుగా విద్యారంగంలో తనకున్న అనుభవంతో చెబుతున్నానని విద్యార్థులు, వారి తల్లి దండ్రుల్లో అత్యధికులు అంగీకరిస్తున్నారని చెప్పారు.


మంత్రిగారికి మనవి.. అయ్యా! తెలుగు భాషాభిమానులకు, మాతృభాష మనుగడకోసం పోరాడే వారికి ఆంగ్లం పట్ల లేదా ఇతర భాషలపట్ల ద్వేషం లేదు. ఏ మాధ్యమంలో చదివినా, ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని, మిగిలిన తరగతులలో మొదటి భాషాంశంగా తెలుగు ఉండాలని. రోజుకో ప్రకటనతో విద్యార్థుల తల్లి దండ్రులను తికమక పెట్టవద్దని, మీ పంతం నెగ్గించుకోవడానికే మీరు కంకణం కట్టుకుంటే.. మీ రాజకీయ ప్రత్యర్థులకు మీరే ఒక అవకాశం ఇచ్చి తెలుగుభాషకే కాదు, మీ పార్టీకే మీరు నష్టం కలిగించిన వారవుతారని సవినయంగా తెలియజేసుకుంటున్నాము.

ఈరోజు వరకు వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు, ఆత్మహత్యలు చేసుకున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అరాచకాలు సృష్టిస్తున్నారు. ఉపాధ్యాయులను, యాజమాన్యాలను, తల్లిదండ్రులను వేధిస్తున్నారు, అవమానిస్తున్నారు. చాలావరకు ప్రభుత్వ పాఠశాలలు “దుంపల బడులు”గా అవతారమెత్తాయి. ఈ అనర్థాలకు కారణం ఆంగ్ల మాధ్యమంలో బోధన అని, ఉద్యోగావకాశాలు మెండు అని పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కార్పోరేట్ విద్యా సంస్థల పుణ్యంకాదా? మీరే చెప్పండి.

బహిరంగ రహస్యం.......

మునిసిపల్ పాఠశాలల్లో ఎవరికి నచ్చిన మాధ్యమంలో వారు చదవొచ్చని ప్రకటిస్తూనే తెలుగు పుస్తకాలన్నీ వెనక్కి తెప్పించుకుంటున్నారు. ఉపాధ్యాయులను భయపెట్టి తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మీకు న్యాయమా? అంగన్ వాడి పాఠశాలల్లో చేరిన మూడు సంవత్సరాల పసివాణ్ని తెలుగులో చదువుతావా? ఇంగ్లీషులో చదువుతావా? అంటే వాడు ఏమి చెబుతాడు. ఏమీ చదవను! ఇంటికి పోతాను అంటాడు. అన్నీ తెలిసి తెలిసి అపకీర్తి తెచ్చుకుంటున్నారు. మన్నించండి.

–పరవస్తు ఫణిశయనసూరి,
సమన్వయకర్త, **“తెలుగు దండు.”**



అమ్మనుడిపై నెనరు లేనివాడు కన్నతల్లిని, పుట్టిననేలని ప్రేమించలేడు.

2015లో డెట్రాయిట్(అమెరికా)లో జరిగిన 'తానా' సభల సందర్భంగా వారి తరపున డెట్రాయిట్ తెలుగు సాహితీసంఘం(డి.టి.ఎస్.సి) నిర్వహించిన రచనల పోటీలో రెండవబహుమతి పొందిన రచన.

అమెరికా తెలుగు కథా సాహిత్యంలో స్త్రీ పాత్రల స్వభావ పరిణామం

–డాక్టర్ తన్నీరు కళ్యాణ్ కుమార్



__డాక్టర్__ తన్నీరు కళ్యాణ్ కుమార్ గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో జన్మించారు. యం.ఏ., యం.ఫిల్. కోర్సులను హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం నందు పూర్తిచేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో "అమెరికాలో తెలుగు కథా సాహిత్యం – సమగ్ర పరిశీలన" అనే అంశం పై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను పొందారు. 2014 సంవత్సరం అమెరికా తెలుగు సంఘం(ATA) వారి నుండి ఉత్తమ వ్యాస రచయిత అవార్డును అందుకున్నారు. ఈయనచే వ్రాయబడిన 'అమెరికాలో తెలుగు కథా సాహిత్యం – ఒక సమగ్ర పరిశీలన' అనే పుస్తకం వంగూరి ఫౌండేషన్ వారిచే ప్రచురించబడి, హ్యూస్టన్‌లో ఆవిష్కరించబడింది. ఈయన వ్రాసిన పరిశోధన పత్రాలు అమెరికాలోను – ఆంధ్రదేశంలోను పలు సాహితీ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ప్రస్తుతం తెనాలిలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

కథలు వ్యక్తుల జీవితానుభవాల్లోంచి పుట్టి, ఆ జీవితాలనే ప్రతిబింబిస్తుంటాయి. అమెరికాలోని తెలుగు వారి జీవితాలలో తరచు తారసపడే పరిస్థితులను, సమస్యలను వాటి పరిష్కారాలను కథలుగా మలిచి మనకు అందిస్తున్న కథకులు అభినందనీయులు. వేరు వేరు కాలాలలో అమెరికాలోని తెలుగువారి జీవనవిధానం ఎలా కొనసాగిందో తెలుసుకోవడం ఈ కథల ద్వారానే సాధ్యమవుతుంది. అమెరికాలోని తెలుగు కథకులు అక్కడి సమాజంలోని తమ వారి జీవితాలను శోధించి, ఆ అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకొని కథలను సృష్టిస్తున్నారు. అమెరికా తెలుగు సాహిత్యంలోని కథలన్నీ అక్కడి తెలుగువారి జ్ఞాపకాల నుండి, ఆరాటాల నుంచి, బెంగల నుంచి, స్పృశించిపోయే అనుభవాల నుండి పుట్టుకొచ్చాయి. అక్షరాల ఈ కథలు ప్రస్తుతం తెలుగుగడ్డపై పుడుతున్న కథలకు ఇవి భౌతికంగాను, మానసికంగాను భిన్నమైనవి. ఈ కథలలో అధికభాగం కథలు స్త్రీ దృక్పథం నుండి వెలువడి, వారి కష్టసుఖాలను విశదీకరిస్తాయి.

అమెరికాలోని తెలుగు కథా రచయిత(త్రు)లు ఎక్కువ మంది అక్కడి తెలుగు వారి జీవనానికి సంబంధించిన కౌటుంబిక ఇతివృత్తాల నేపథ్యంతోనే కథలను సృజియించారు. ఈ కుటుంబ ఇతివృత్తాలకు స్త్రీలే ప్రధాన భూమికలు. తమకు పూర్తిగా భిన్నమైన ఆ సరికొత్త సమాజంలో మమేకం కావడానికి భారతీయ నారీమణులు పడిన పాట్లు, పిల్లల పెంపకంలో ఉండే ఇబ్బందులు, మారుతున్న భార్యాభర్తల అనుబంధాలు, పిల్లల పెళ్ళి విషయంలో ఎదురౌతున్న సమస్యలు, గృహహింస – విడాకులు – వృద్ధాప్యం తదితర అంశాలు వస్తువులుగా అమెరికా తెలుగు కథా సాహిత్యం వెలువడుతుంది. అమెరికా తెలుగు కథలు చాలా వరకు తెలుగు పాత్రలు, తెలుగు కుటుంబాలకే పరిమితమయ్యాయి. 1970 ప్రాంతంలో భారతీయులు చెప్పుకోదగ్గ సంఖ్యలో అమెరికా గడ్డపై అడుగుబెట్టారని అనుకుంటే, ఆనాటి నుండి ఈనాటి వరకు అక్కడి భారతీయ స్త్రీల జీవన విధానంలో వచ్చిన మార్పులను తెలుసుకోవడానికి అమెరికా తెలుగు కథాసాహిత్యం చక్కని ఉపకరణంగా ఉపయోగపడుతుంది.

భారతీయ సమాజంలో పుట్టి పెరిగిన స్త్రీలు ఉన్నత విద్య – ఉద్యోగ నిమిత్తం, వివాహానంతరం అమెరికాకు వచ్చి, తమకు పరిచయం లేని ఆ సరికొత్త వ్యవస్థలో ఇమడలేక కొన్ని అవస్థలు పడుతుంటారు. మరి ముఖ్యంగా వివాహానంతరం భర్తతోపాటు అమెరికాకు వచ్చిన భారతీయ గృహిణులు ఆ సరికొత్త సమాజంలో కలిసిపోవడానికి కొంత సమయం పడుతుంది. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు వారే అక్కడి సమాజంతో మమేకం అవుతారు. తమకు పరిచయం లేని ఆ సరికొత్త సమాజంలో భారతీయ నారీమణులు పొందే వింత అనుభవాలను, క్రమంగా అక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక వారిలో కలిగే క్రమ వికాసాన్ని గూర్చి అమెరికా తెలుగు కథా రచయిత(త్రు)లు చక్కని కథలు అల్లారు. శార్వరి వ్రాసిన 'తప్పెవరిది' కథలో 'సునీత' పాత్ర, కృష్ణప్రియ వ్రాసిన 'న్యూయార్క్ చేరిన అనుభవం' కథలో 'లలిత' పాత్ర ఇటువంటి ఖేదాన్ని అనుభవించిన పాత్రలే. ఐతే ఈ ఖేదం తాత్కాలికమైనదే. కాలక్రమేణ ఈ స్త్రీలు అక్కడి వాతావరణానికి అలవాటు పడి, అక్కడి జీవనంలో మమేకమైపోతారు. ఈ క్రమ పరిణామం కూడా అమెరికా తెలుగు కథా సాహిత్యంలోని స్త్రీ పాత్రల్లో కన్పిస్తుంది. దశిక శ్యామలదేవి వ్రాసిన 'జానకి' కథలో 'జానకి' పాత్ర, రాధికాశాస్త్రి వ్రాసిన 'జీవన వాహిని' కథలోని 'రాధ' పాత్ర తదితర పాత్రలు ఈ క్రమ పరిణామానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు.

భారతదేశంలో పుట్టి పెరిగి అమెరికాకు వచ్చి స్థిరపడిన తొలి తరానికి, అమెరికాలో స్థిరపడిన భారతీయ కుటుంబాలలో పుట్టి పెరిగిన రెండవ తరానికి అనేక విషయాలలో వ్యత్యాసం కన్పిస్తుంది. ఆలోచనల్లోను, అభిప్రాయాల్లోను, దృక్పథాల్లోను స్పష్టమైన తేడా ఈ రెండు తరాల వారిలోను కన్పిస్తుంది. పిల్లలు తమ మనస్సును అర్థం చేసుకోవడం లేదని పెద్దలు, పెద్దలు తమ అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని పిల్లలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. భారతీయ సంస్కృతి – సంప్రదాయాలకు అనుగుణంగా వారి జీవితాలను తీర్చిదిద్దడానికి తాము చేస్తున్న

ప్రయత్నాలు వారికి చేదుగా అనిపిస్తున్నాయనే ఆవేదన వీరిలో వ్యక్తమవుతుంది. ఈ ఆవేదనకు అమెరికా తెలుగు కథా రచయిత (త్రు)లు తమ కథలలో అక్షర రూపం ఇచ్చారు. వంగూరి చిట్టెన్ రాజు వ్రాసిన 'విలువలు' కథలోని 'రేణుక' పాత్ర, పూడిపెద్ది శేషుశర్మ వ్రాసిన 'పదహారేళ్ళ వయస్సు' కథలోని 'జానకి' పాత్ర, సుధేష్ణ వ్రాసిన 'ఫాసింగ్ ఫేజ్' కథలోని 'తన్మయ' పాత్ర, ..తదితర తల్లి పాత్రలు అమెరికాలోని తొలితరం స్త్రీల ఆవేదనకు ప్రతిరూపాలు.

అల్లే భారతదేశంలో పుట్టి పెరిగి అమెరికాకు వచ్చి స్థిరపడిన తమ తల్లిదండ్రులు ఒకప్పుడు స్వదేశంలో తాము పెరిగిన విధంగానే తమను పెంచాలనుకోవడంలో అర్థం లేదని అమెరికాలోని రెండవ తరం వారి వాదన. నాడు తమ తల్లిదండ్రులు పెరిగిన వాతావర ణానికి, నేడు తాము పెరుగుతున్న వాతావరణానికి గల తేడాను వారు గ్రహించలేకపోతున్నారనే బాధ అమెరికాలోని రెండవతరం స్త్రీలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తరం వారి అభిప్రాయలకు అద్దం పడుతూ అమెరికా తెలుగు కథా సాహిత్యంలో కొన్ని కథలు వెలువ డ్డాయి. పూడిపెద్ది శేషుశర్మ వ్రాసిన 'సంఘర్షణ' కథలోని 'గీత' పాత్ర, 'పదహారేళ్ళ వయస్సు' కథలోని 'అనుపమ' పాత్ర అమెరికాలో పుట్టి, పెరిగిన భారతీయ యువతరం స్త్రీల మనోభావాలకు ప్రతి రూపాలు. ఐతే ఈ రెండు తరాల స్త్రీలు ప్రేమ పూర్వక వాతా వరణంలో మనస్ఫూర్తిగా ఒకరినొకరు అర్థం చేసుకొని, ఒకరి అభిప్రాయాలను మరొకరు స్వాగతించుకుంటూ కలిసి ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ కొన్ని కథలు వెలువడ్డాయి. ఆరి సీతారామయ్య వ్రాసిన 'దూరపు కొండలు' కథలోని 'సుభద్ర' పాత్ర, గొర్తి సాయి బ్రహ్మానందం వ్రాసిన 'వలస జీవితం' కథలోని 'అను' పాత్ర, అమెరికాలోని తొలితరం స్త్రీలలో మారుతున్న దృక్పథాలకు ప్రతిబింబాలు. అల్లే వంగూరి చిట్టెన్ రాజు వ్రాసిన 'విలువలు' కథలోని 'నవీన్' పాత్ర, సుధేష్ణ వ్రాసిన 'ఫాసింగ్ ఫేజ్' కథలోని 'సంగీత' పాత్ర తదితర పాత్రలు అమెరికాలోని రెండవ తరం స్త్రీలలో కన్పిస్తున్న మానసిక పరిపక్వతకు నిదర్శనాలు.

అమెరికాలో స్థిరపడిన భారతీయ కుటుంబాలలోని కొందరు వ్యక్తులను వేధిస్తున్న సమస్యల్లో మధ్య వయస్సు ఒంటరితనం ఒకటి. జీవితంలో కొంత భాగం గడిచిన తరువాత అనివార్య కారణాల వల్ల జీవిత భాగస్వామి దూరం కావడం, యుక్త వయస్సు వచ్చిన పిల్లలు తమ జీవితాలను తాము చూసుకొని దూరంగా వెళ్ళడం తదితర అంశాలు అక్కడి భారతీయ కుటుంబాల్లోని కొందరు వ్యక్తులను ఒంటరి వారిని చేస్తున్నాయి. అలాంటి స్థితిలో స్వదేశానికి వెళ్ళలేక, తమ సంతానంపై ఆధారపడి వారికి భారం కాలేక, మిగిలిన జీవితమంతా ఒంటరితనంతో ఎలా బ్రతకాలో తెలియక మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఈ ఒంటరితనం మగవారి కంటే ఆడ వారికే పెద్ద సమస్య. ఈ విధంగా వెలువడిన కథల్లో చాలా కథలు ఈ సమస్యకు పరిష్కారంగా పునర్వివాహాన్ని సూచిం చాయి. అమెరికన్ సమాజంలో పునర్వివాహం అనేది అత్యంత సహజమైన అంశం కాగా, అక్కడి భారతీయ మహిళలు మాత్రం ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఎంతగానో సంకోచిస్తున్నారని అక్కడి కథా సాహిత్యంలోని స్త్రీ పాత్రలను చూస్తే అర్థమవుతుంది. తాడికొండ శివకుమారశర్మ వ్రాసిన 'స్టిల్ ఏన్ ఇండియన్' కథలోని 'సరోజ' పాత్ర, రెంటాల కల్పన వ్రాసిన 'అయిదో గోడ' కథలోని 'శారద' పాత్రలు అక్కడి మధ్య వయస్సు స్త్రీల ఒంటరి మానసిక సంఘర్షణకు ప్రతినిధులు.

స్త్రీని శారీరకంగానూ, మానసికంగానూ హింసించడాన్ని గృహ హింస అంటారు. భారతీయ వివాహవ్యవస్థలోని వరకట్న దురాచారం అనేక కుటుంబాలలోని స్త్రీల గృహహింసకు ప్రధాన కారణం. అమెరికాకు వెళ్ళిన భారతీయ కుటుంబాలలో కూడా ఈ హింసలకు గురవుతున్న స్త్రీలు ఉన్నారు. లక్షల కట్నాలు కుమ్మరించి సంపాదిం చుకున్న భర్తలు తమకు రక్షణ ఇవ్వకపోగా, శారీరకంగానూ – మానసికంగానూ హింసలకు గురి చేస్తుంటే, ఆ పరాయి దేశంలో తమ బాధలను పంచుకునేవారు లేక, స్వదేశంలోని తల్లిదండ్రులకు చెప్పుకోలేక మౌనంగా మూగ వేదనను అనుభవిస్తున్న గృహిణులను కేంద్రంగా చేసుకొని అమెరికా తెలుగు కథా సాహిత్యంలో కొన్ని కథలు వెలువడ్డాయి. జ్యోతి వ్రాసిన 'తరతరాల కథ'లోని 'గంగ–యమున–సరస్వతి' పాత్రలు, సత్యం మందపాటి వ్రాసిన 'మరణ ముహూర్తం' కథలోని 'సునేత్ర' పాత్ర, అమెరికాలో భారతీయ నారీమణులు ఎదుర్కొంటున్న గృహహింసకు సాక్ష్యాలు. ఐతే గృహ హింసను చిత్రించిన రచయిత(త్రు)లు స్త్రీ చైతన్యమనే ఈ సమస్యకు పరిష్కారమని తమ కథలలో చాటి చెప్పారు. భర్తల దౌర్జన్యాలపై తిరగబడాలని సందేశాన్నిచ్చారు. స్త్రీలు ఆర్థిక స్వావలంబన సాధించి, తమ కాళ్ళ మీద తాము నిలబడి మనోధైర్యంతో ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఆరి సీతారామయ్య వ్రాసిన 'గట్టు తెగిన చెరువు' కథలోని 'శారద' పాత్ర, నోరి రాధిక వ్రాసిన 'న్యాయం' కథలోని 'జయలక్ష్మి' పాత్ర స్త్రీ చైతన్యానికి ప్రతీకలు.

అమెరికాకు వెళ్ళిన భారతీయ ఆడపడుచులు వారి కాన్పుల కోసం, తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవడం కోసం మాతృదేశంలోని తమ మాతృమూర్తులను అమెరికాకు పిలిపించుకోవడమనేది అక్కడి భారతీయ కుటుంబాలలో సహజంగా కన్పించే విషయం. విదేశంలోని తమ బిడ్డలకు సహాయంగా ఉండేందుకు సొంత ఊరును, భర్తను, మిగిలిన పిల్లలను విడిచి మాతృమూర్తులు అక్కడికి వెళ్తున్నారు. ఐతే అమెరికాలోని బిడ్డలు కేవలం పనిచేసే యంత్రాలుగానే తమను భావిస్తున్నారనే ఆవేదన అక్కడికెళ్ళిన మాతృమూర్తులలో కన్పిస్తుంది. రాధికాశాస్త్రి వ్రాసిన 'సోషల్ సెక్యూరిటీ – సేక్రెడ్ కౌ' కథలోని 'సుశీలమ్మ' పాత్ర, కొమరవోలు సరోజ వ్రాసిన 'మాతృదేవోభవ' కథలోని 'సుమతి' పాత్ర ఇలాంటి మూగ బాధను అనుభవించిన పాత్రలు. జీవితాంతం పిల్లల కోసమే బ్రతికిన తాము జీవిత చరమాంకంలో కూడా స్వదేశాన్ని, సొంత వారిని వదలుకొని పరదేశంలోని తమ పిల్లల పిల్లలకు సేవలు చేయడానికి అంకితం కాలేమనే భావనను స్వదేశం నుండి అక్కడికి వెళ్ళిన మాతృమూర్తులు వ్యక్తం చేస్తున్నారు. అపర్ణ వ్రాసిన 'ఘర్షణ' కథలోని 'రుక్మిణి' పాత్ర, ప్రభల శ్రీనివాస్ వ్రాసిన 'స్వేచ్ఛ' కథలోని 'పార్వతి' పాత్ర, భారతీయ మాతృమూర్తుల ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులకు ఉదాహరణలు.

అమెరికాలోని తెలుగు వారు ఎదుర్కొంటున్న సమస్యల్లో వారి పిల్లల వివాహ సమస్య అనేది వారిని ఎంతగానో వేధిస్తుంది. అందులోను ఆడపిల్లల వివాహ విషయంలో ఈ సమస్య అనేది మరింత జటిలంగా మారింది. డేటింగ్‌లు, స్వలింగ వివాహాలు

అధికంగా కన్పించే అక్కడి సమాజంలో తమ పిల్లలు ఎక్కడ ఆ సంస్కృతి పట్ల ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకుంటా రోననే ఆందోళన అక్కడి భారతీయ మాతృమూర్తులలో కన్పిస్తుంది. పిల్లల ప్రేమలను సమర్ధించలేక, వారి అభిప్రాయాలకు తలొంచలేక వీరు సతమతమవుతున్నారు.

అలాగని అక్కడి భారతీయ తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులకు భిన్నంగా వారికి బలవంతంగా వివాహాలు చేయడానికి ప్రయత్నించడం లేదు. కాబోయే జీవిత భాగస్వామిని తమ పిల్లలు వాళ్ళంతట వాళ్ళే ఎన్నుకుంటే తమకేమి సమస్య లేదని, కాని ఆ ఎంపికలో వారు ఒకే సంస్కృతి, సంప్రదాయం, మతం – కులం కలవారిని ఎన్నుకుంటే బాగుంటుందని అక్కడున్న భారతీయ తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. కానీ చాలా సందర్భాల్లో తమ పిల్లలు ఎంచుకున్న జీవిత భాగస్వాముల విషయంలో తమ కులం వారు కాకపోయినా తమ మతం వారే కదా అని, తమ మతం కాకపోయినా తమ జాతి వారే కదా అని, తమ జాతి కాకపోయినా స్వదేశీయులే కదా అని అక్కడి భారతీయ తల్లిదండ్రులు సరిపెట్టుకోక తప్పడం లేదు. ఇట్లు క్రమంగా సర్దుకుపోతూ, తమ పిల్లల అభిప్రాయాలను స్వాగతిస్తున్న అక్కడి భారతీయ తల్లిదండ్రుల మనస్తత్వాలను కేంద్రంగా చక్కని కథలు వెలువడ్డాయి. మాచిరాజు వెంకటరత్నం వ్రాసిన 'సంధ్యా వందనం' కథలోని 'సంధ్య' తల్లి 'శ్రీలత' పాత్ర, కామేశ్వరి వ్రాసిన 'తీర్పు' కథలోని 'తులశమ్మ' పాత్ర, తదితర పాత్రలు పిల్లల వివాహ విషయంలో అక్కడి భారతీయ మాతృమూర్తుల ఆలోచన క్రమ పరిణామానికి నిలువెత్తు సాక్ష్యాలు.

అమెరికన్ ఇమిగ్రేషన్ నియమాలలో మార్పులు వచ్చాక, తెలుగు నారీమణులు అమెరికాకు వెళ్ళడం ఆరంభమైంది. ఈ దశాబ్దాలలో వారి జీవితాలలో వచ్చిన మార్పులు అవగాహన చేసుకోవడానికి కావాల్సిన వస్తువులు పూర్తిగా అందుబాటులో లేవు. వీటిని సంగ్రహించి, విశ్లేషించి ప్రకటించే పరిశోధకులు ఇంకా బయలుదేరలేదనే చెప్పాలి. ఈ కొరతను కొంతవరకు అమెరికా తెలుగు కథా సాహిత్యం తీర్చిందనుటలో సందేహం లేదు. సమకాలీన అమెరికా తెలుగు కథా సాహిత్యాన్ని పరిశీలిస్తే తెలుగునాట లేని రచనా స్వాతంత్ర్యం, ఏ విషయాన్నైనా తడబాటు లేకుండా చెప్పగలిగే ధైర్యం ఈ అమెరికా తెలుగు కథల్లో కనిపిస్తుంది. ఊహలు, వర్ణనల కంటే వాస్తవిక సంఘటనలే ప్రధానంగా కనిపించడం వల్ల ఈ కథల్లో ఒకలాంటి నింపాదితనం కన్పిస్తుంది. ఈ ప్రత్యేక గుణం స్త్రీల హృదయాల్ని స్పష్టంగా ఆవిష్కరించడానికి దోహదపడింది.

కాలక్రమేణా తూర్పు – పడమర దేశాల మధ్య జీవన శైలిలో బేధాలు తగ్గిపోతూ వస్తున్నాయి. అమెరికాలో తొలితరం అడుగుబెట్టిన భారతీయ స్త్రీలకు, ఇప్పుడు కొత్తగా అమెరికాకు వెళ్తున్న భారతీయ స్త్రీలకు ఆలోచన విధానంలోను, అలవాట్లలోను ఎంతో భేదం వుంది. ఈ భేదం అమెరికా కథా సాహిత్యంలో స్పష్టం చేయాల్సిన బాధ్యత రచయిత(త్రు)లపై ఉంది. అట్లే అమెరికా తెలుగు కథా సాహిత్యంలో కథలన్నీ తొలితరం మహిళల వైపే మొగ్గుచూపుతున్నాయి. అమెరికా కథా సాహిత్యంలో అత్యధిక కథలు తొలితరం మహిళలు వ్రాయడం కూడా ప్రధాన కారణమై ఉండవచ్చు. ఐతే అక్కడి తరువాత తరాల వారి మానసిక సంఘర్షణను, అంతరంగాన్ని ఆవిష్కరించడంలో అమెరికా తెలుగు కథ కొంత వెనుకబడి ఉందేనని చెప్పాలి. అట్లే మారుతున్న కాలానుగుణంగా పరాయిగడ్డపై వర్తమాన సాంఘిక – రాజకీయ – ఆర్థిక విషయాలు అక్కడ భారతీయ స్త్రీలపై చూపుతున్న ప్రభావం, ఆయా పరిస్థితులకు అనుగుణంగా వారిలో వస్తున్న మార్పుల క్రమపరిణామాన్ని కథకులు తమ కథల్లో చిత్రించే ప్రయత్నం చేయాలి. భిన్న కోణాలలో – విభిన్న దృక్పథాలలో అమెరికా తెలుగు కథా సాహిత్యంలోని స్త్రీ పాత్రలపై సమగ్రమైన చర్చ జరిపితే ఆ పాత్రల క్రమ పరిణామం, వికాసం, స్వభావం మరింత స్పష్టమవుతుంది. ఈ ప్రయత్నాన్ని తెలుగు సాహితీ సంఘాలు, విశ్వవిద్యాలయాలు, అకాడమీలు చేస్తే, భవిష్యత్తులో వెలుగు చూడబోయే అమెరికాంధ్ర సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన వారవుతారు. భవిష్యత్తులో వెలుగు చూడబోయే అమెరికా తెలుగు కథా సాహిత్యం దినదిన ప్రవర్ధమానమై అమెరికాలోని భారతీయ స్త్రీమూర్తుల హృదయాంతరంగాలను ఆవిష్కరిస్తూ వర్ధిల్లాలని మనసారా కాంక్షిద్దాం.

డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం - 2017

డా, వేదగిరి రాంబాబు ప్రముఖ రచయితే కాదు కథానికాజీవి. కథానికే ఆయన శ్వాస, ధ్యాస, తపన, ఆరాటం, పోరాటం – సమస్తమూనూ. కథానికకు పట్టాభిషేకం చేసేందుకు ఒక ఉద్యమాన్నే నిర్మించి నిర్వహిస్తున్నవారు. అంతేకాదు, కథకుల వెన్ను తట్టేందుకు 24 గంటలూ సంసిద్ధంగా ఉండే మంచి మనిషి, సత్సాహిత్యాభిలాషి.

వారి కథానికా సేవకు చిన్నగుర్తింపుగా ఈ ఏడాది నుంచి ప్రతి సంవత్సరం **డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారాన్ని** యువ రచయితలకు ఇవ్వాలని **సింహప్రసాద్ సాహిత్య సమితి** నిర్ణయించింది.

ఇందు నిమిత్తం 14.10.17 నాటికి 40 ఏళ్ళు మించని రచయితల నుండి 2015, 2016, 2017 లో ప్రచురింపబడిన కథానికా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఒక్కొక్కటి ఒక కాపీ చొప్పున 14.8.17 లోపల అందేలా పంపాలి. ఒక ప్రఖ్యాత రచయిత, విమర్శకులు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారు. 14.9.17న విజేతని ప్రకటిస్తాం. 14.10.17న హైదరాబాద్‌లో జరిగే శ్రీ వేదగిరి రాంబాబు జన్మదినోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయబడుతుంది. ఆ రోజున పురస్కార విజేత తప్పనిసరిగా హైదరాబాద్ వచ్చి ఈ పురస్కారం స్వీకరించాల్సి ఉంటుంది.

పురస్కారంగా రూ.5000 నగదు, దంపతులిద్దరికీ శాలువా సత్కారం, జ్ఞాపిక ఇవ్వబడతాయి. నాటి నుండి 3 సం.లోపు ఇంకో కథానికా సంపుటిని ప్రచురిస్తే, ఇంకో రూ.5000 గ్రంథ ప్రచురణార్థం ఆర్థిక సాయం అందివ్వబడుతుంది.

పుస్తకాలు పంపాల్సిన చిరునామా: సింహప్రసాద్, 401, మయూరి ఎస్టేట్స్, ఎమ్ ఐ జి 2650, కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాద్–85, సెల్, 9849061668.

-ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
98485 98446

విజయనగర చక్రవర్తుల బిరుదులు

ఇప్పటివరకూ దొరికిన చారిత్రక ఆధారాల ప్రకారం సంగముని కుమారులైన హరిహర, బుక్క సోదరులు క్రీ.శ. 1336లో విజయనగర రాజ్యాన్ని స్థాపించినారు. క్రీ.శ. 1336 నుంచి క్రీ.శ. 1680 వరకూ విజయనగర రాజ్యం, సామ్రాజ్యంగా చివరి రోజుల్లో మళ్లీ చిన్న చిన్న రాజ్యాగానూ విడిపోయింది. విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాలు పాలించాయి. సంగమ వంశానికి చెందిన మొదటి హరిహరుడు (క్రీ.శ. 1336-1354), మొదటి బుక్కడు (క్రీ.శ. 1355-1377), రెండో హరిహరుడు (క్రీ.శ. 1377-1404), రెండో బుక్కడు (క్రీ.శ. 1404-1406), మొదటి దేవరాయలు (క్రీ.శ. 1406-1422), విజయ రాయలు (క్రీ.శ. 1422), రెండో దేవరాయలు (క్రీ.శ. 1422-1446), మల్లికార్జున రాయలు (క్రీ.శ 1465-1485) పాలించారు. సాళువ వంశంలో సాళువ నరసింహుడు (1485-92) ఇమ్మడి నరసింహుడు (క్రీ.శ 1493-1505), తుళువ వంశానికి చెందిన వీర నరసింహరాయలు (క్రీ.శ. 1506-1509), శ్రీకృష్ణ దేవరాయలు (క్రీ.శ. 1509-1529), అచ్యుత దేవరాయలు (క్రీ.శ 1529-1542), మొదటి వెంకటపతి రాయలు (క్రీ.శ. 1542), సదాశివరాయలు (క్రీ.శ 1542-1570), చివరిదైన ఆరవీటి వంశానికి చెందిన తిరుమలరాయలు (క్రీ.శ 1571) మొదటి శ్రీరంగరాయలు (క్రీ.శ 1571-1586), రెండో వెంకటపతిరాయలు (క్రీ.శ. 1586-1614), రామరాయలు (క్రీ.శ. 1614-1630), మూడో వెంకటపతిరాయలు (క్రీ.శ. 1630-1642), మూడో శ్రీరంగరాయలు (1642-46), మళ్ళీ క్రీ.శ 1665-80 వరకూ పాలించారు.

నాలుగు వంశాలకు చెందిన 20మంది రాజులు/ చక్రవర్తులు, తమ తమ సామర్థ్యం, పాలనాదక్షత, ఇతర రంగాల పోషణ, రాజ్య విస్తరణలను బట్టి అనేకరకాల బిరుదులను ధరించారు. వీరు తొలుత కర్ణాటక, తరువాత ఆంధ్ర, తమిళనాడులను పాలించినందున, ఆయా భాషల్లో శాసనాలు, సాహిత్యంలో వీరి బిరుదుల వివరాలు లభిస్తున్నాయి. మొదటి హరిహరుడు (క్రీ.శ 1336-1354), **అరిరాయ విభా(ళ)ధ** (శత్రురాజులను చెండాడేవాడు), **పూర్వ పశ్చిమ సముద్రాధిపతి, పూర్వ పశ్చిమ దక్షిణ సముద్రాధిపతి** (తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరబిక్ మహాసముద్రాల మధ్యగల ప్రాంతానికి) అధిపతి అనీ, మూడు సముద్రాలకు అధిపతి అనీ అర్థం. **భాషతప్పువ రాయరగండ** (ఆడినమాటను తప్పిన రాజులను అదుపులో పెట్టే మొనగాడు) **మహామండలేశ్వర** (విశాలమైన ప్రదేశానికి అధిపతి) **మహారాజాధిరాజ** (రాజుల్లో గొప్పవాడు, రాజులకురాజు), **మహారాయ** (మహారాజ), **రాజ పరమేశ్వర** (రాజులకు పరమేశ్వరుడు, ప్రభువు), **వీరప్రతాప చక్రవర్తి** (వీరుడు, ప్రతాపంగల చక్రవర్తి) అనే బిరుదులు ధరించాడు.

మొదటి బుక్కరాయలు (క్రీ.శ 1355-77) **అరిరాయ విభాడ, చతుస్సముద్రాధిపతి** (పూర్వ, పశ్చిమ, దక్షిణ, ఉత్తర (కృష్ణానది సముద్రంలో కలుస్తున్న సాగర సంగమం నుంచి, ఉత్తరంగా నున్న సముద్రం) నాలుగు సముద్రాలకు అధిపతి, **పూర్వ పశ్చిమ సముద్రాధి పతి** (తూర్పు, పశ్చిమ సముద్రాలకు అధిపతి), **భాషగె తప్పువ రాయరగండ, మహామండలేశ్వర, యాదవాన్వయ** (యాదవ వంశానికి చెందిన(సంబంధించిన), **శ్రీ వీరసంగమేశ్వర రాయబాహు** (సంగమ వంశానికి చెందిన వీరుడు,



పరాక్రమవంతుడు) **వైదికమార్గ ప్రవర్తక** (సాయణ, మాధవాచార్యుల నేతృత్వంలో వేదాలకు భాష్యాలను రాయించిన కారణంగా వైదిక మార్గాన్ని ప్రవర్తింప జేసినవాడు), **హిందూ రాయసురత్రాణ** (ముస్లిం రాజులను సుల్తానులంటారు. హిందూ రాజులకు సుల్తానులాంటివాడు) **హొన్నకూట్టు కుదరయ కూంబ మాండలికరగండ** (హొన్ను అనగా చిన్న బంగారునాణెం, కుదర అనగా గుర్రం అంటే అరబ్బులనుంచి గుర్రాలను కొని, చిన్న బంగారు నాణేలను చెల్లించే మాండలికుల్లో మొనగాడు) అనే బిరుదుల్ని ధరించాడు. (హిందూశబ్దం మొదటి బుక్కరాయల కాలపు శాసనంలో తొలిసారిగ వాడుకలోకి తేవడాన్ని గమనించాలి).

రెండో హరిహరుడు (క్రీ.శ 1377-1404), **అరిరాయ విభాడ, అశ్వపతి** (గుర్రాలకు అధిపతి), **ఉభయరాయ విగ్రహవినోద** (యుద్ధంలో ఇద్దరు రాజులను జయించినవాడు), **ఏకాంగవీర** (యుద్ధంలో ఒక్కడే వీరోచితంగా పోరాడినవాడు), **కఠారిత్రినేత్ర** (కఠారిని తిప్పటంలో విశేష ప్రతిభ కనబరచిన వాడు, శివునితో సముడైనవాడు), **కర్ణాటక విద్యావిలాస** (కన్నడ కవులను పోషించి, కన్నడ సాహిత్యాన్ని ఆనందించినవాడు), **గజపతి** (ఏనుగులకు అధిపతి), **చతుసముద్రా ధిపతి, చోళరాయస్థాపనాచార్య** (చోళరాజ్యాన్ని తిరిగిస్థాపించిన వారిలో ఆచార్యుడు వంటివాడు), **తురుష్క రాయశిరసాకందుక్రీడా వినోద** (తురుష్క రాజులను సంహరించి వారి తలలను బంతుల మాదిరిగా ఆడుకొని వినోదాన్ని పొందినవాడు), **ధనుర్ధరమధ్యమ పాండవరాయ** (దనుర్విద్యలో పాండవమధ్యముడైన అర్జునునితో సమానుడు), **దుష్ట శార్దూల మర్ధన** (శార్దూలంవంటి దుష్టులైన శతృవులను అణచినవాడు), **నరపతి** (నరులకు పతి, పదాదిదళ అధ్యక్షుడు), **పంచముఖ విభాడ** (ఐదుముఖాలను నాశనం చేయగలవాడు, బహుశ ఒకేసారి ఐదుగురిని వధించగల ధీరుడై ఉంటాడు), **వడవార** (పడవాల)**వంశోద్ధర** (సేనానుల వంశంలో పుట్టినవాడు), **పరరాయ భయంకర** (శత్రు రాజులకు భయాన్ని కలిగించేవాడు), **పరరాష్ట్ర పితామహ** (ఇతర రాజ్యాలను పునఃస్థాపించటంలో తాతలాంటివాడు), **పూర్వ పశ్చిమ దక్షిణోత్తర సముద్రక నాయక** (నాలుగు సముద్రాల నడుమనున్న భూభాగానికి నాయకుడు), **భాషా తిలంగి** (భాషా పారంగతుడు/ తెలుగు భాష తెలిసినవాడు), **భూపాల భుజంగ** (భూమిని కాపాడు సర్పంలాంటివాడు) **మగధరాయమాన (మద) మర్ధన** (కొంకణంలో నున్న మగధరాజుల గర్వాన్ని అణచినవాడు), **మూరు రాయరగండ** (మాండలిక, సామంత, రాజుల అనే ముగ్గురికి అధిపతి), **రాజకులతిలక చూడామణి, సత్యహరిశ్చంద్ర** (నీతి నియమాలతో పాలించినవాడు), **హమ్మీరరాయ అంధకార గర్వకిరణ, హిందూ రాయ సురత్రాణ** అనే బిరుదులను ధరించాడు.

(ఇంకాఉంది)

-బుద్ధవరపు వేంకటరత్నం



బ్రహ్మర్షి శ్రీరఘుపతి వెంకటరత్నం నాయుడు గారు

నిజం చెప్పాలంటే బ్రహ్మర్షి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారిని గురించి వ్రాయడానికి నేనెంతమాత్రమూ చాలను. ఈనాడు ఏమైనా నేను చెబుతున్నానంటే, వ్రాస్తున్నానంటే అది శ్రీనాయుడుగారి శిష్యరికంలో నాకు అబ్బిన శక్తి మాత్రమే. ఈ అనుభూతి వెనుక ఆ మహర్షి స్ఫూర్తి ఎంతవున్నదో నేను చెప్పలేను.

అది 1935వ సంవత్సరం. నేను కాకినాడ పిఠాపురం మహారాజావారి కళాశాల ఉన్నతపాఠశాలలో 7వ తరగతి (సెకండ్ ఫారమ్) చదువుతున్న రోజులు. ఆనాడు కళాశాల, పాఠశాలల యాజమాన్యం ఏమిటి, వివిధ కార్యకలాపాల నిర్వహణ, పర్యవేక్షణ అన్నీ నాయుడుగారే చూసేవారు. ప్రతిరోజూ, ఉదయం, సాయంత్రం రెండుపూటలా ఆయనే ఉన్నత పాఠశాల, కళాశాల వరండాలో పర్యటిస్తూ ఉండేవారు. నాయుడుగారు యెప్పుడూ స్వచ్ఛమైన తెల్లని దుస్తులనే ధరించేవారు. ఆయనకు తనదైన శైలిలో తలపాగ చుట్టుకోవడం అలవాటు. ఆ తలపాగాకు వెనుకవైపున కుచ్చుతోక వ్రేలాడేది. ఒక ప్రత్యేక అందం, ఆకర్షణ.

నాయుడుగారు కోపంతో ఉండటం మేమెప్పుడూ చూడలేదు. ఉపాధ్యాయులపై గాని, ఆచార్యులమీద గాని ఆగ్రహించేవారు గాదు. విద్యార్థులను కన్నబిడ్డలుగా సమాదరణీయ దృక్పథంతో చూసేవారు.

నాయుడుగారికి పేదలన్నా, సమాజంవల్ల ఏకారణాన్నో ఉపేక్షితులుగా వచ్చువారిపైన హృదయ పూర్వకమైన జాలి, ప్రేమ ఊరుతూ ఉండేవి. ఒక చక్కని సంఘటన - నాయుడుగారు మద్రాసు నుండి ఒకసారి మెయిల్లో కాకినాడ వస్తున్నారు. మెయిల్ ఇంజను నీళ్ళు పట్టుకోవడానికి (ఆరోజుల్లో రైళ్ళు ఆవిరి యంత్రాలతో నడిచేవి) ఆగింది. ఫస్ట్‌క్లాస్ పెట్టెలో ఉన్న నాయుడుగారు కిటికీలోంచి బయటకు యదాలాపంగా చూశారు. బయట కొంచెం దూరంలో ఆయనకు ఇద్దరు పేదపిల్లలు ఆడుకుంటూ కనుపించారు. చినిగిన గుడ్డలు, చింపిరిజుట్టు, మురికి పట్టిన వాళ్ళవళ్ళూ చూసిన నాయుడుగారి గుండె కరిగిపోయింది. చటాలున బండిదిగి వాళ్ళవద్దకు వెళ్ళి, "నాతో వస్తారా? మీకు మంచి బట్టలు కుట్టించి, కడుపునిండా అన్నం పెట్టిస్తాను" అన్నారు. వాళ్ళిద్దరూ నవ్వుతూ "ఊఁ" అన్నారు నాయుడు. స్వయంగా వాళ్ళనెత్తుకొని, తన కంపార్టుమెంటులో మెత్తప్రక్కన తనతో కూర్చుండబెట్టుకొని - కాకినాడ తీసుకువచ్చి ఆయనయే స్వయంగా నిర్మింపజేసి నిర్వహిస్తున్న అనాథ శరణాలయం (ఆర్ఫనేజ్) లో చేర్పింపజేసి తన కన్నబిడ్డలవలె ఆదరించి, పెంచి పెద్దజేసి వృద్ధిలోకి తీసుకువచ్చారు. నాయుడుగారి జీవితంలో ఇలాంటి ఘటనలెన్నో జరిగాయి.

అలనాటి పిఠాపురం మహారాజావారి కళాశాలకు సంబంధించి నవే రెండు జ్ఞాపకాలు ... కళాశాలలో ఒక బెంగాలీ ఇంగ్లీషు ఆచార్యులుండేవారు. ఆయనగానీ ఎప్పుడైనా తరగతులు నడిచేవేళల్లో ఎవరైనా విద్యార్థులు వరండాలో పచార్లు చేస్తుంటే ఆయన కోపంగా "భై ఆర్‌యూ బాండరింగ్ ఇన్ ద బరండా లై కే బేగబాండ్" అని బిగ్గరగా అదలించేవారు. ఆయన వంగ పదరీతిని అప్పుడప్పుడూ శ్రీ నాయుడుగారు వింటూ ముసిముసిగా నవ్వుకొనేవారు.

దీన్ని మించినదే ఇంకొక మధుర స్మృతి- పెద్దాడ రామస్వామి గారు అనే ఆంగ్లపాఠ బోధకులుండేవారు. ఆయన ఇంగ్లీషులో విలియం షేక్స్‌పియర్ నాటకాలు పాఠాలుగా బోధించేవారు. వారి ఇంగ్లీషు భాషోచ్చారణ కథోచితంగా, పాత్రోచితంగా అద్భుతంగా ఉండేవి. వాటికి తగ్గట్లు ఆయన బోధన పాఠకులను ఎంతగానో ఆశ్చర్యంలోనూ, ఆనందంలోనూ ముంచేవి. తర్వాత రామస్వామి గారు, భీమవరం కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్ళారు.

నాయుడుగారు గొప్ప సంస్కర్త. సంఘంలో ఆనాడున్న అనేక దురాచారాలను రూపుమాపేందుకు వారు ఉద్యమించారు. ఆ దురాచారాలలో ఒకటి పురుషుడు స్త్రీకి తనతో సమానమైన సంఘజీవియైనా, ఆ సత్యాన్ని గుర్తించక స్త్రీని ఒక బానిసగా, ఆట బొమ్మగా, అసహ జీవిగా యెంచి, ఆమెను ఒక క్రీడా వస్తువుగా, చేతి కీలుబొమ్మగా భావించి తక్కువ పర్చడం. నాయుడుగారు ప్రథమంలో కళాశాలా ధ్యాపకులుగా ఈ దుష్భావాన్ని నిరశిస్తూ, దీన్ని రూపు మాపేందుకు కృషి చెయ్యాలని విద్యార్థులకు బోధించేవారు. ఈ బోధలను స్ఫూర్తిగా గ్రహించి, ఆ లక్ష్యాన్ని తను భావి జీవితంలో అంకిత భావంతో స్వీకరించి, ఆచరించి అందు కృతకృత్యులైన వారిలో నాయుడుగారి శిష్యులు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు అగ్రగణ్యులు. ఈ కర్తవ్య నిర్వహణలో వీరేశలింగం పంతులుగారు గురువునకు మించిన శిష్యులు అని కితాబు నందుకొన్నారు.

వీరేశలింగం పంతులుగారి ఉద్యమానికి లక్ష్యం, కేంద్ర బిందువులు వితంతువు, బాలిక. వితంతు వివాహాన్ని ప్రోత్సహించి పంతులుగారు బాల్యవివాహాన్ని తీవ్రంగా నిరశించి ఖండించారు.

నాయుడుగారు ఈ ప్రక్రియలో - భోగము స్త్రీని, వెలయాలిని, కేంద్రబిందువుగా తమ ఆశయసిద్ధికి లక్ష్యంగా చేపట్టి విజయం సాధించారు. భోగము మేళములు బహిష్కరింపచేసి, తనకంటూ పురుషుడు ప్రత్యేకంగా ఒక వేశ్య (సాని) ని కేటాయించే దురాచారాన్ని నాయుడుగారు అసహ్యించుకొని, ఈ రెండు చెడుగులను సంఘంనుండి కడిగి వేయడానికి భగీరథ ప్రయత్నంచేసి, అందు విజయం సాధించారు. "భోగము మేళములను బహిష్కరింపుడు" అనే నినాదాన్ని చేపట్టి నాయుడుగారు ఉద్యమించారు.

చెన్నరాజధాని (నాడు మనం చెన్నరాజధాని (మెడ్రాస్ ప్రెసిడెన్సీ లో ఉండేవాళ్ళం) లో బ్రహ్మసమాజ శాఖల స్థాపనకు, ఆ ఉద్యమ స్ఫూర్తితో జతగూడిన మతవ్యాప్తికి శ్రీ నాయుడుగారు చేసిన కృషి ఎంతో గొప్పది. ఆయన అవిరళ కృషికి దర్పణం నేడు కాకినాడలో కళాశాల యెదుట మనకు దర్శనం ఇచ్చే బ్రహ్మ మందిరం. శిఖరాన నిలువెత్తు "ఓమ్" కారరూపం, లోహంతో చెక్కబడినది. ఈ మందిరం "బ్రహ్మకృపావలమ్" అనే సంస్తుతితో, నాయుడి గారి బోధనలతో అలరారుతూ ఉండేది.

చివరగా – నాయుడుగారు అస్మదాదులకు పాఠాలు బోధించే పద్ధతి. వారానికోసారీ, ఒక్కొక్కప్పుడు రెండుసార్లు తరగతులవంటివి ఉండేవి. వయసులో పదేళ్ళ నుండి ఇరవై యేళ్ళలోపు వాళ్ళం శిష్యులుగా ఉండేవాళ్ళం. నాయుడుగారు మాకు ఆరోజుల్లో చెప్పినవి పాఠాలు కావు. పెరిగి పెద్దవాళ్ళం కావలసిన పిల్లల మనస్సులో వారి భవిష్యత్తుకు ముఖ్యావసరాలైన ఎన్నెన్నో గొప్ప విషయాలకు శ్రీ నాయుడుగారు మాకు అంకురార్పణ రీతిలో తమ వద్ద నిక్షిప్తమైన గనియనదగ్గ విద్వత్తునుండి ఘనవిషయాలను మా మనస్సులకు, హృదయాలకు నప్పే పద్ధతిలో వివరించేవారు. అటువంటి వాటిలో నేను మూడు ముఖ్యవిషయాలను వంటబట్టించుకొన్నాను. అవి – 1, కథ చెప్పడం, (వ్రాయడం కాదు) 2, వ్యాసం వ్రాయడం, 3 వేదిక భీతి (స్టేజిఫియర్) లేకుండా మాట్లాడ్డం. తద్రాపి: ఆ వేగం గంభీరోపన్యాసాలుగా వర్ధిల్లేటట్లు శ్రమించడం.

ఈ అంశాలు నాకు నాటికి రెండు దశాబ్దాలు దాటినాక మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఎలా యెదిగాయో చెప్పడానికి మూడు ఉదాహరణలు.

1. 1941 నుండి "ఆంధ్రపత్రిక" దినపత్రిక సారస్వతా నుబంధంలో; వారపత్రిక; వార్షిక ప్రత్యేక సంచిక; "భారతి" పత్రికలు నా కథలను, ధారావాహికలను ప్రచురించాయి. "స్వాతి" పత్రిక చాలా కథలను ముద్రించింది.

2. 1948 లో "జాగృతి" వారపత్రికను ప్రారంభించి, ప్రప్రథమ సంపాదకునిగా ఉండినాను. "జాగృతి" 69 యేండ్లుగా నేటికీ ప్రఖ్యాత జాతీయ వారపత్రికగా వెలువడుతున్నది.

3. ఉపన్యాసాలకువస్తే గంటలు కొలదిగా ఎన్నో ఉపన్యాసాలిచ్చాను.

శ్రీరఘుపతి వేంకటరత్నం నాయుడిగారు నాకిచ్చిన ఈ సంపదకు నేనెన్ని జన్మలకైనా వారి ఋణం తీర్చుకోలేను.

పూజ్యుపాదులు గురుదేవులు బ్రహ్మశ్రీ శ్రీరఘుపతి వేంకటరత్నం నాయుడుగారికి మరోమారు ప్రణామాలర్పిస్తూ శెలవు తీసుకుంటాను.

(ఇంకా ఉంది)

ఈ వ్యాస రచయిత ఇప్పుడు తెలుగుసమాజంలో జీవించియున్న వృద్ధపాత్రికేయులందరిలోకీ పెద్దవారు. 92ఏళ్ళ వయసులోఈ వ్యాసాన్ని వ్రాసి పంపించారు. వారికి కృతజ్ఞతలు. సం॥

విశాఖలో మూడు దశాబ్దాల చైతన్యసమితి:




గతంలో జరిగిన గురజాడ జయంతి సభలో
శ్రీ ఆర్.వి.రామారావు మాట్లాడుతున్న దృశ్యం

1987 జులై 22న విశాఖపట్నంలో స్థాపించిన 'చైతన్య సమితి' ఈ జూలై 22న మూడు దశాబ్దాల వేడుకను అరకువేలీలో నిర్వహించుకొంది. ఉత్సవసభకు సంస్థాపక అధ్యక్షుడు శ్రీ బి.వి.అప్పారావు అధ్యక్షత వహించారు. భాషా సాహిత్యాలు, పర్యావర ణంకు సంబంధించిన కార్యక్రమాలను ఇంతవరకు నిర్వహిస్తున్న చైతన్యసమితి తెలుగుభాషా పరిరక్షణకు ఇప్పటికే కృషిచేస్తున్న పలు సంస్థలకు తాము సహకరిస్తామని ఆయన అన్నారు. సంస్థ కార్యదర్శి బి.వి. రమణ, మళ్ళ బలరాం, కె.వి.నరసింగరావు, కొణతాల సూర్య నారాయణ, మళ్ళ శంకరరావు, పారుపూడి రవి, పెంటకోట రమణ మున్నగువారు పాల్గొన్నారు.



జూన్ 25న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఆచార్య ఎన్. గోపి రచించిన "జీవన భాష" కవితా సంపుటి ఆవిష్కరణసభలో ప్రసంగిస్తున్న డా॥ఓలేటి పార్వతీశం. వేదికపై నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ఆచార్య టి.మోమన్ సింగ్, మామిడి హరికృష్ణ, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, డా॥ఎన్.గోపి, డా॥వై. రామకృష్ణ, సీతారాం.

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి.
అభివృద్ధి నిరోధకమైనవి కూడా.
అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు



సుదర్శనం గారికి

ప్రముఖ సాహితీవేత్త, రచయిత, విమర్శకులు, ఆంధ్రాంగ్ల సాహిత్య కోవిదులు, ఆర్.ఎస్. సుదర్శనం గారికి, 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రముఖ రచయితలు 19మంది నుండి (చలంనుండి చండీదాస్ వరకు) వచ్చిన సాహిత్య సంబంధం వున్న లేఖలను కొన్నిటిని ఎంచి, వేర్పరచి లేఖా గ్రంథంగా ప్రచురించిన పుస్తకం ఇది. సంపాదకురాలు శ్రీమతి ఆర్. వసుంధరాదేవి. శ్రీ సుదర్శనంగారి సహధర్మచారిణి, కథా రచయిత్రిగా సాహితీలోకానికి పరిచితులే.

ఇందులోని మొదటి విభాగంలో ప్రముఖ రచయితల నుండి శ్రీ సుదర్శనంగారికి వచ్చిన ఉత్తరాలున్నాయి. కొన్ని ఉత్తరాలు ప్రతిఛాయలు (scan)గా ఇవ్వబడ్డాయి. ఆయా సాహితీ బంధువుల ఛాయా చిత్రాలు మాత్రమే కాకుండా వారిగురించిన జీవిత వివరాలను సంక్షిప్తంగా పొందుపరిచారు. దాదాపు 1961 సం॥నుండీ 1996 సం॥ వరకు అంటే 35 సం॥ల మధ్యకాలంలో– భారతీయ సంస్కృతి, ప్రపంచ దేశాల రాజకీయాలు, రాజకీయ పార్టీల విధానాలు, సిద్ధాంతాలు, సమకాలీన తెలుగు సాహిత్యం గురించిన విశ్లేషణలు, ప్రఖ్యాత తత్త్వశాస్త్రవేత్తల సిద్ధాంతాలు యిలా చాల ముఖ్యమైన విషయాలకు సంబంధించి ఆ సాహితీ వేత్తల యొక్క దృక్పథాలను, ఆలోచనా గాఢతను పరిచయం చేస్తాయి– వారి దస్తూరీతో (చేతి వ్రాతతో) రాసిన లేఖలు.

అనుబంధంగా– శ్రీసుదర్శనంగారు విశ్వనాథవారికీ, రావూరి వారికీ కాత్యాయనీ విద్మహే గారికి రాసిన మూడు లేఖలు, కొడవటిగంటి కుటుంబరావు శ్రీమతి వసుంధరాదేవిగారికి రాసిన మూడు లేఖలున్నాయి. రెండవ విభాగంలో– భారతి, ఆంధ్రపత్రిక వ్యవస్థాపకసంపాదకులు శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారి పరిచయం, వారు రాసిన లేఖలు, శ్రీమతి వసుంధరాదేవికి రాసిన అయిదు లేఖలు) యిక చివరగా త్రిపురనేని వెంకటేశ్వరరావుగారినుంచి 'భారతి'కి లేఖ (శ్రీసుదర్శనంగారు రాసిన ఒక సమీక్షగురించి), దానికి వారు రాసిన సమాధానం– యిలా రెండు అనుబంధాలుగ ఇవ్వబడ్డాయి. ఇంకొక విశేషం– 'సుదర్శనీయాలు' అనే శీర్షికతో శ్రీసుదర్శనంగారి రచనలలోని కొన్ని ఆణిముత్యాలవంటి వాక్యాలను అవకాశంవున్న పేజీలలో చేర్చారు.

అయితే, క్రిందటితరం పాఠకులు, పూర్వ సాహిత్యంమీద అభిలాష, అభిమానం ఉన్న సాహితీ ప్రియులకు తమ అభిమాన రచయితల అభిప్రాయాలను, వారి రచనలకు ప్రేరణ అయిన అంశాలను వారి సాహిత్య విశ్లేషణకు, ఆయా రచయితల సొంత మాటల్లోనే తెలుసుకునే అవకాశం, వారి ఛాయాచిత్రాలు, కొంతమంది చేతివ్రాతలు– మొ॥ ఆసక్తికరమైన విషయాలను తెలుసుకోవచ్చు. లేఖాగ్రంథంగా ఒక చక్కటి సాహితీ ప్రక్రియగా మనోరంజకంగా అనిపించే పుస్తకం– సంపాదకులు చెప్పినట్లుగా ప్రేమాభిమానాలతో ప్రచురించిన **'సుదర్శనంగారికి'** పుస్తకం సాహితీ ప్రియులు ఆదరించతగినది.

సుదర్శనంగారికి (చలం నుంచి చండీదాస్ వరకు). రాటకొండ ప్రచురణలు. పేజీలు:192, వెల: రు.150/. ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, బడీచౌక్, హైదరాబాద్.

–ఎమ్.వి.శాస్త్రి
9441342999



తెలుగు వారపత్రికలు రచనా ధోరణులు

పాత్రికేయవృత్తి, సంకల్ప బలం, రచయితగా అనుభవం– వీటన్నిటికీ పరిశోధన జోడించి, విమర్శనాత్మక దృష్టితో పై అంశం మీద పరిశోధనచేసి పిహెచ్.డి. పట్టాను ఉస్మానియావిశ్వవిద్యాలయం ద్వారా 1996లో అందుకున్న ప్రముఖ సాహితీ బంధువు వేదగిరి రాంబాబు. ఆ సిద్ధాంత వ్యాసాన్ని పుస్తకంగా తీసుకువచ్చారు. అయితే యిందులో విశేషం ఒకటి ఉంది. తెలుగు 'వార' పత్రికల రచనా ధోరణులనే కాకుండా ఈపుస్తకంలో తెలుగు వారి అన్ని కాలిక పత్రికల– వార్తా పత్రికలు, దిన,పక్ష, మాస పత్రికల తీరుతెన్నుల్నీ ఆవిర్భావం నించీ, అన్ని విశేషాలను విశ్లేషణాత్మకంగా తనదైన సరళమైన, సూటియైన శైలిలో ప్రస్తావించారు రాంబాబు.

మనదేశంలో పత్రికల ఆవిర్భావం దగ్గర్నించీ మొదలుకొని తెలుగు పత్రికల తొలినాటి ముచ్చట్లు, వార్తారచన, వారపత్రికలు, వివిధ పత్రికలు మొ॥వాటి సమాచారంతోపాటు కొన్ని పాత పత్రికల ముఖచిత్రాలను కూడా ప్రచురించడం ఆసక్తి కలిగించింది. దేశంలోని సాంఘిక దురాచారాల ఖండనకు, స్వాతంత్ర్య సముపార్జన ఆశయాన్ని పెంపొందించడానికి, ముఖ్యంగా తెలుగు పత్రికలు నవలలు, కథానికలు, కవిత్వం, అనువాద రచనలు, ప్రత్యేక శీర్షికలు, వ్యావహారిక భాషావ్యాప్తికి ఏవిధంగా తోడ్పడిందీ సమగ్రంగా వివరించారు.

అయితే ఒకప్పుడు పండితులు, సాహితీవేత్తలు పత్రికలను నడిపితే, ఇప్పుడు పెట్టుబడిదారులు పేరుకోసం, డబ్బుకోసం పత్రికలను సాధనాలుగ చేసుకున్నారు. పత్రికలు పవిత్రతను కోల్పోయి సర్క్యులేషన్‌ని పెంచుకోవడానికి ఎటువంటి శీర్షికలను, కథలను, నవలలను ఆశ్రయించినదీ హృద్యంగా పేర్కొనటం జరిగింది.

ఈ పుస్తకంలో ఇంకొక విశేషం– 11 అధ్యాయాలతో తెలుగు వార పత్రికలు– రచనాధోరణులనే తనసిద్ధాంత వ్యాసమునకు అనుబంధంగా– గతంలో ప్రముఖ సాహితీవేత్తలు, సంపాదకులు, పత్రికా నిర్వహణలో అనుభవం గడించినవారు వ్రాసిన 15 వ్యాసాలు చేర్చారు. ఈ వ్యాసాలన్నీ కూడా జర్నలిజం గురించి, పత్రికా నిర్వహణ గురించి, పత్రికలలోని భాష గురించి ఎంతో విలువైన విషయాలని తెలియజేస్తాయి. ముఖ్యంగా పత్రికా చట్టాలు, ఇతర భాషల్లో తెలుగు పాత్రికేయులు, గత రెండు దశాబ్దాల తెలుగు పత్రికలు వంటి వ్యాసాలు, అందులోని సమాచారం, జర్నలిజం వృత్తిలో రాణించదలచిన వారికి ఈ పుస్తకం మార్గ దర్శకం. 'అనుబంధం'గా యిచ్చిన వ్యాసాలన్నీ పత్రికారంగంలో మారుతున్న ధోరణుల్ని చక్కగా అర్థం చేసుకోవటానికి దోహద పడతాయి.


తెలుగు పత్రికలను గురించిన సమగ్ర వివరాలను విశ్లేషణను, పత్రికారంగంలో గాని జర్నలిజంలోగాని ఆసక్తిగలవారు, సాహిత్యాభిలాషులు, మరి పత్రికా పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం.

తెలుగు వారపత్రికలు–రచనాధోరణులు –వేదగిరి రాంబాబు. పేజీలు:356, వెల:రు.200/–. ప్రచురణ, ప్రతులకు: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్.ఐ.జి.1, బ్లాక్–6, ఫ్లాట్–10, బాఘ్‌లింగంపల్లి, హైదరాబాద్–500 044. చరవాణి: 9393834050

–ఎమ్.వి.శాస్త్రి
9441342999




రెండు పక్షులూ..ఒక జీవితం: కవిత్వ సంభాషణ; రచన: బూర్ల వెంకటేశ్వర్లు. పుటలు: 90, వెల:రు.100/-, ప్రచురణ: సాహితీ సోపతి, కరీంనగర్.ప్రతులకు: బి.సంతోష, డోర్.నెం.2-10-1524/10, ఫ్లాట్ నెం. 403, వెంకటేశ్వర టవర్స్, జ్యోతి నగర్, కరీంనగర్, తెలంగాణ- 505 001.




కైత: కవితలు. రచన: రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి. పుటలు: 94, వెల: రు.50/-, ప్రచురణ: రాజావాసిరెడ్డి ఫౌండేషన్. ప్రతులకు: శ్రీమతి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, ఇంటినెం.501, సీతా రెసిడెన్సీ, బ్రాహ్మణ్‌వాడి, బేగంపేట, హైదరాబాదు- 500 016. ఫోన్: 98665 83907.




ఇం..కొకప్పుడు : ఇప్పటికవిత్వం. రచన: దేవీప్రియ. పుటలు: 172, వెల:రు.100/-, ప్రచురణ: ప్రతులకు: సమత బుక్స్, 204-రాచకొండ టవర్స్, ఆల్వాల్, సికిందరాబాదు- 500 010.



తడి ఆరిన సీమ గొంతుకలు : కవితా సంకలనం. సంపాదకత్వం: డా. అప్పిరెడ్డి హరినాధ రెడ్డి. పుటలు: 112, వెల: రు.50/-, ప్రచురణ: రాయలసీమ సాంస్కృతిక వేదిక. ప్రతులకు: కోనా పురం ఈశ్వరయ్య, ఇంటి.నెం.1/244, మడకశిర రోడ్డు, ఆల్విన్ కాలనీ, పెనుకొండ-515 110. అనంతపురం జిల్లా. ఫోన్: 7386623864



గాయపడ్డ గుండెభాష : కవిత్వం. రచన: శ్రీ నాగాస్త్ర. పుటలు: 132, వెల: రు.100/, ప్రతులకు: శ్రీ నాగాస్త్ర, కృష్ణాపురం గ్రామం, టి. నర్సాపురం (పో) (మం) పశ్చిమగోదావరి జిల్లా.- 534 467. ఫోన్: 96403 17108



మహాత్ముని జీవితంలో కడపటి సంవత్సరం: రచన: కీ.శే.కంచి వాసుదేవరావు. పుటలు: 120, వెల: రు.100/-, ప్రచురణ: ప్రజాస్పందన, విశాఖపట్నం. ప్రతులకు: సి.యస్.రావు, డోర్ నెం.47-3-31, ఎస్.వి.టవర్స్-302, 5వ లైను, ద్వారకానగర్, విశాఖపట్నం- 530 106. ఫోన్: 0891-2534353.

తమిళనాడు ఉడుమలపేటలో తెలుగుశిక్షణ తరగతులు

ఇప్పటి తమిళనాడు, తిరుపూరు జిల్లాలలోని ఉడుమలపేట (ఉడుముల, ఉడుమాల కాదు) తాలూకా అంతా తెలుగు మయం. తెలుగు మాటలు, పాటలు, ఆటలు నలుమూలలా నడుస్తూనే ఉంటాయిక్కడ. లేనిది తెలుగురాత ఒక్కటే. ఇప్పుడు ఆ కొరత కొంత తీరింది. 'తెలుగువాణి' అనే అరణి(ట్రస్ట్), గత రెండేళ్ళుగా పనిచేసి, ఉడుమలపేట చుట్టుముట్టు ఏభై పల్లెల్లో సుమారు 1250 మందికి తెలుగు రాతల్ని నేరిపించింది. తెలుగు తీరువు(పరీక్ష)లో తేరిన (ఉత్తీర్ణులైన) 350 మందికి జూన్ 18న ఒరపురేకులను అందించినారు తెలుగువాణివారు.

తరువాత జులై 2న 700 మందికి ఒరపురేకులను అందించే పండుగ జరిగింది. ఈ పండుగలో చదివిన పిల్లలు 700 మందితో పాటు వాళ్ళ తల్లిదండ్రులూ పెద్దలూ అందరూ కలిసి సుమారు 2000 మంది పాలుగొన్నారు. ఈ పండుగకు అతిథిగా ఉడుమలపేట పార్లమెంటుసభ్యులైన శ్రీ మహేంద్రన్ గారు విచ్చేసినారు. పండుగ కోలాహలంగా జరిగింది. మహేంద్రన్ గారు తమిళులైనా తెలుగు కోసం నడుము కట్టుకొని నిలబడు తానని మాటిచ్చినారు. భాషోద్యమకారులు పారుపల్లి కోదండ రామయ్యగారు, ఎర్రనాయుడుగారు (విశాఖపట్నం) కూడా పండుగకు అతిథులుగా వచ్చినారు. తెలుగు పల్లెకళలు దేవరాట, జిక్కాట ప్రదర్శన జరిగింది. ఉందూరు దళిత సామాజిక కార్యకర్త మరవ ఆనంద్‌గారి తలమ(అధ్యక్షత)న పండుగ నడిచింది.

జులై 9న కొంగలనగరం, ఇప్పలనగరం అనే మారుమూల పల్లెల్లో, చదివిన 100 మంది పిల్లలకు కొంగలనగరంలో ఒరపు రేకులను ఇచ్చినారు. ఈ వేడుక రత్నాల జయకుమార్ తలమన జరిగింది.

చివరగా జులై 23న పళ్ళపాలెం, చెల్లాండమ్మపల్లి, జింకపల్లి, గురప్పనాయుడూరు, గొర్లగుంట పల్లెల్లో చదివిన వారికి ఒరపు రేకులను ఇచ్చే వేడుక పళ్ళపాలెంలో జరిగింది. ఈ వేడుకకు దళిత సామాజిక కార్యకర్త అయిన మిడిగ స్వామినాధన్‌గారు తలవరగా ఉన్నారు. ఈ వేడుకలో అతిథులుగా మలేసియా నుండి వచ్చిన వెలగా అప్పలనాయుడుగారు, వారి ఇల్లాలు జయలక్ష్మిగారు మరియు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు, తెలుగువాణి అరణరి అయిన డా॥సామల రమేష్ బాబుగారు పాలుగొన్నారు. ఈ పనిబరువునంతా తలకు ఎత్తుకొని పనిచేసినవారు తెలుగు అరణరి స.వెం.రమేశ్, 'మా తెలుగు'సంగ కార్యకర్తలు మార్టూరి వసంత్‌కుమార్, వలపుల సెందిల్, మద్దినేని జవహర్, గుది వెంకటపతి, ఎర్రగొండ జమున మరియు సామల మురళి. (చిత్రాలు ప్రక్కపేజీలో...)

-స.వెం.రమేష్.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362



జులై 23న పళ్ళపాలెంలో జరిగిన చివరి వేడుకలో మాట్లాడుతున్న స.వెం.రమేశ్. ప్రక్కన డాక్టర్ సామల రమేష్‌బాబు, శ్రీ వెలగా అప్పల్నాయుడు-శ్రీమతి జయలక్ష్మిదంపతులు(మలేసియా తెలుగుసంఘం), మార్టూరి వసంత్‌నాయుడు, మిడిగ స్వామినాధన్, సెంథిల్, మద్దినేని జవహర్ మొ॥వారు





తమిళనాడు
ఉడుమలపేటలో
తెలుగు తరగతుల
ముగింపు వేడుకలు





అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
August 2017, Vol.3, Issue 6

Date of publication : 1st of every month
Date of posting : 4th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17